నల్లగొండ వార్త

నల్లగొండ, సూర్యాపేట, యాదాద్రి భువనగిరి

శుక్రవారం 30, డిసెంబర్ 2022 16 పేజీలు






## ఘర్షణలకు పాల్పడితే చట్టపరమైన చర్యలు తప్పవు: ఎస్పీ

నల్లగొండ టౌన్, డిసెంబర్ 29 ప్రభాతవార్త

డిసెంబర్ 31 వేడుకలు శాంతియుత వాతావరణంలో ఎలాంటి అవాంఛనీయ సంఘటనలు చోటుచేసుకోకుండా ప్రశాంత వాతావరణంలో జరుపుకోవాలని జిల్లా ఎస్పీ రెమా రాజేశ్వరి తెలిపారు. డిసెంబర్ 31 వేడుకలు నిర్వహించుకునే ప్రజలు ప్రమాదాలకు దూరంగా ఉంటూ పోలీస్ వారి సూచనలు పాటించాలని, వేడుకలు నిర్వహించుకునే వారు ఇతరుల మనోభావాలు దెబ్బతినకుండా, ప్రమాదాలకు దూరంగా ఉంటూ నిర్వహించుకోవాలన్నారు. మద్యం దుకాణాలు, వైన్‌షాప్‌లు,

2లో...

భూమి ఉన్న వారికి మాత్రం రికార్డులు, పాస్ పుస్తకాలు లేవు

మ్యానువల్ ప్రొసీడింగ్స్ ఇచ్చి చేతులు దులుపుకున్న అధికారులు

ధరణి పోర్టల్‌తో కూడా తీరని రైతుల సమస్యలు

పాలవరం తండాలో విస్తీర్ణానికి మించి భూముల రికార్డులు

## అవగాహన రాహిత్యమా! అధికారుల పర్యవేక్షణా .. లోపమా?

### సెంటు భూమి లేని వారికి పాస్‌పుస్తకాలు జారీ చేసిన వైనం



అనంతగిరి, డిసెంబర్ 29 ప్రభాతవార్త

తెలంగాణ ప్రభుత్వం పాలనా సౌలభ్యం కోసం ఉమ్మడి జిల్లాలను, మండలాలను విభజించి ప్రజా సమస్యలను త్వరితగతిన పరిష్కరించేందుకు, ప్రజలకు ప్రభుత్వాన్ని దగ్గరకు చేర్చేందుకు చిన్న మండలాలుగా విభజించినప్పటికీ కింది స్థాయి అధికారుల అవగాహన రాహిత్యం తోడు అధికారుల పర్యవేక్షణ లోపంతో రైతులు తీవ్ర మనోవేధనకు గురవుతున్నారు. క్షేత్రస్థాయి అధికారుల నిర్లక్ష్యమో, అవగాహన లేమి వల్లనో లేదా

2 లో..



లో...

## అమ్మో.... యాసంగి

భారీగా పెరిగిన పెట్టుబడులు

రెట్టింపైన యంత్రాల ధర, కూలీల ఖర్చు

ఆర్థిక సమస్యలో అన్నదాతలు

మోతె, డిసెంబర్ 29, ప్రభాతవార్త:

ప్రస్తుత యాసంగి రైతన్నలకు ఆర్థిక సమస్యలోకి నెట్టి వేస్తుంది. గత ఏడాదిలో పోలిస్తే వ్యవసాయ పెట్టుబడులు రెట్టింపయ్యాయి. మోతె మండలంలో వాన కాలంలో 20435 ఎకరాల విస్తీర్ణంలో వరి సాగు చేశారు. ప్రస్తుతం యాసంగిలో గతంతో పోలిస్తే ఎక్కువ విస్తీర్ణంలో వరిసాగు చేస్తారని అధికారులు అంచనా వేస్తున్నారు. ఒక పక్క పెట్టుబడులు పెరగడం, మరో పక్క పంటలకు తెగుళ్ల, చీడపీడలు సోకడంతో అన్నదాతల పరిస్థితి ఆగమ్యగోచరంగా తయారైంది. భారీగా పెరిగిన పెట్టుబడులతో చిన్న, సన్నకారు, మద్యతరగతి రైతుల పరిస్థితి మరి దయనీయమైంది. ప్రస్తుతం యాసంగిలో వరిసాగు జోరందుకున్న నేపథ్యంలో వ్యవసాయ పరికరాల ధరలు భారీగా పెరగడంతో రైతులు ఆర్థిక సమస్యలను ఎదుర్కుంటున్నారు. వరినాట్ల నుండి దాదాపు అన్ని పంటలు సాగుకు పెద్ద ఎత్తున ఖర్చు చేయాల్సి వస్తుందని వాపోతున్నారు. ప్రధానంగా నారుమడి, పొలం దున్నడానికి, చదును చేయడం, విత్తనాలు, కలుపుమందు, కలుపు తీయడం, రసాయనాలు వాడకం విపరీతంగా పెరగడంతో పెద్ద ఎత్తున ఖర్చు అవుతుందని రైతులు లెక్కలు కడుతున్నారు. దీనిక తగినట్లుగా ఇనుము ధరలు పెరగడం, కూలీల కొరత, డీజీల్ ధరల పెంపుతో రవాణా చార్జీలు అధికమైనాయని





## ఆకాశమే హద్దుగా అక్రమ నిర్మాణాలు

నిబంధనలకు విరుద్ధంగా నిర్మాణాలు

పట్టించుకోని అధికారులు

టాస్క్‌ఫోర్స్ పేరుతో చేతులు దులుపుకుంటున్న మున్సిపల్ అధికారులు

పట్టణంలో బహుళ అంతస్తుల నిర్మాణాలపై పలు విమర్శలు

కోదాడ రూరల్, డిసెంబర్ 29 ప్రభాతవార్త

65వ నెంబర్ జాతీయ రహదారిపై ఉన్న కోదాడ పట్టణం దినదినాభివృద్ధి చెందుతూ వ్యాపార వాణిజ్య వైద్య రంగాలలో పలు సంస్థల స్థాపనకు అవకాశం ఏర్పడింది. దశాబ్ద కాలం క్రితం వేల రూపాయలు పలికిన స్థలాలు నేడు లక్షల రూపాయల్లో ఉన్నాయి. దీంతో పట్టణంలో నిర్మాణాల సంఖ్య భారీగా పెరిగింది. పెరుగుతున్న అవసరాలకు అనుగుణంగా నిర్మాణాలు చేసేందుకు స్థల యజమానులు నిర్మాణాలు చేపడుతున్నారు. అయితే కొద్ది మంది భవన నిర్మాణదారులు తాము అనుమతి పొందిన నిర్మాణాల కంటే అదనపు ఫ్లోర్లతో నిర్మాణాలు చేపడుతున్నారు. కోదాడ మున్సిపల్ పరిధిలో మూడంతస్తులకు అనుమతులు ఉన్నప్పటికీ నిర్మాణదారులు అనుమతులకు మించి ఆరు అంతస్తులు నిర్మిస్తున్నారు. పర్యవేక్షణ చేయాల్సిన

2 లో..

## సర్వీస్ క్రమబద్ధీకరణ జరిగేనా?

17 ఏళ్లుగా నిరీక్షణ

చాలీచాలని వేతనాలతో ఇబ్బందులు పడుతున్న ఉపాధి హామీ కాంట్రాక్టు ఉద్యోగులు



2లో...

నడిగూడెం, ప్రభాతవార్త

సుమారు రెండు దశాబ్దాలుగా జాతీయ గ్రామీణ ఉపాధి హామీ పథక ఉద్యోగులు చాలీచాలని వేతనాలతో ఇబ్బందులకు గురవుతున్నారు. గ్రామీణాభివృద్ధి శాఖ పరిధిలోని ఎంజిఎన్ఆర్ఈజీఎస్ కాంట్రాక్టు ఉద్యోగులు తమ సర్వీస్‌ను క్రమబద్ధీకరించాలని, కనీసం టైం స్కేల్ ఇవ్వాలని ఆందోళన చేస్తున్నప్పటికీ ఫలితం లేకుండా పోతుంది. అరకొర వేతనాలతో కుటుంబాలు గడవడం ఇబ్బందిగా మారింది. ప్రభుత్వం తమ సర్వీస్‌ను క్రమబద్ధీకరిస్తుందని కొంత కాలంగా ఎంతో ఆశతో ఎదురుచూస్తున్నారు. ఇప్పటికే కొంత మందికి వయస్సు మీద పడుతుంది. రెగ్యులర్ అవుతాయనే ఆశతో పనిచేస్తున్నారు.

## అవగాహన రాహిత్యమా!
## అధికారుల పర్యవేక్షణా లోపమా?

(మొదటి పేజీ తరువాయి..)

అక్రమార్జన కోసం వెంపర్లాటలో రైతులకు తీవ్ర అన్యాయం జరిగిందని అనుకుంటున్నారు. దీనికి తోడు ఉన్నతాధికారుల పర్యవేక్షణ లోపించడమో లేదా వారికి కూడా అక్రమార్జన వాటాల చేరిక వల్లనో కానీ భూమి లేని రైతులకు పాస్ పుస్తకాలు వచ్చి, భూమి ఉన్న రైతులకు రిక్తహస్తము ఇచ్చారని ఆందోళన వ్యక్తం చేశారు. దీనికి మండలంలో ప్రతి గ్రామం సాక్ష్యముగా నిలిచిందని రైతులు వాపోతున్నారు. మండల పరిధిలోని పాలారం తండా గ్రామానికి చెందిన పలువురు రైతులకు పాలారం గ్రామ రెవిన్యూ పరిధిలో భూములు కలవు. గతంలో పాలారం రెవిన్యూ కింద గ్రామ రెవిన్యూ అధికారులు జారీ చేసి ఇబ్బందులు పడిన సంఘటనలు కూడా కలవని, అట్టి దొంగ పాస్ పుస్తకాలు జారీ చేసిన అధికారులను విధుల నుండి సస్పెండ్ చేసినప్పటికీ సంబంధిత రైతులకు న్యాయం జరగలేదని వాపోతున్నారు. తరువాత విధులు నిర్వహించిన అధికారులు కూడా గడిచిన అధికారులకు తీసిపోకుండా అమ్యామ్యాలకు రాజీపడకుండా భూమి లేని వారిని మ్యానువల్ రికార్డులలో చేర్చి తమకేమీ తెలియనట్లు మిన్నకున్నారని రైతులు పేర్కొన్నారు. భూమి ఉన్న తమకు ఎందుకు ఆన్‌లైన్ రికార్డులు రాలేదని అడిగితే మ్యానువల్ ప్రొసీడింగ్ ఇచ్చి చేతులు దులుపుకున్నారు. గ్రామ రెవిన్యూ పరిధిలోని 27 నుండి 33 సర్వే నెంబర్లలో ఆర్ఎస్ఆర్‌కు మించి పట్టాలు చేశారని, ప్రస్తుతం ధరణిలో వాస్తవిక భూమి కలిగిన రైతులకు ఆన్‌లైన్ చేయించుకొనుటకు ఇబ్బంది కలదని సంబంధిత రైతు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. గడిచిన నాలుగు సంవత్సరాల నుండి తాను ఉన్నత విద్యావంతుడై ఉన్నప్పటికీ తహసీల్దార్ కార్యాలయం చుట్టూ చెప్పుల అరిగేలా తిరిగినప్పటికీ పట్టించుకునే నాథుడే లేడని, ఎన్నిసార్లు ఉన్నతాధికారులకు కలిసినప్పటికీ ఎటువంటి ఫలితం లేదని వాపోయాడు. విద్యావంతులకే కార్యాలయాల్లో కనీస పనులు కాకుంటే నిరక్షరాస్యులైన రైతుల పరిస్థితి ఏమిటని ప్రశ్నిస్తున్నారు. ఇదేమని కార్యాలయం చుట్టూ తిరుగుతుంటే ఇప్పుడు ధరణి వెబ్‌సైట్‌లో అటువంటి అప్షన్ లేదని వచ్చినప్పుడు పొందుపరుస్తామని కాలం వెల్లబుచ్చుతున్నారు. ధరణి క ంటే ముందు నుండే కార్యాలయానికి వెళ్లినప్పటికీ అప్పుడు కూడా తమ సమస్య తీరలేదని, ఇప్పుడు ధరణి వెబ్‌సైట్‌ని సాకుగా చూపుతున్నారని తెలిపారు. పలుమార్లు తహసీల్దార్ కార్యాలయానికి తిరగగా మ్యానువల్ ప్రొసీడింగ్ చేతికిచ్చి ఆన్‌లైన్ వచ్చినప్పుడు చేస్తామని అంతకు మించి తన పరిధిలో ఏమీ లేదని అప్పటి తహసీల్దార్ పేర్కొన్నారు. రైతుల భూ సమస్యలు తీర్చే ఉద్దేశ్యంతో తెలంగాణ ప్రభుత్వం ధరణిని అందుబాటులోకి తెస్తే అధికారులు దాని ఫలితాలను రైతులకు చేర్చకుండా ధరణిలో గల లోటుపాట్లతో రైతులకు తీవ్ర ఇబ్బందులకు గురి చేస్తూ చోద్యం చూస్తున్నారని ఆరోపిస్తున్నారు. ఇప్పటికైనా రైతుల సమస్యలను తీర్చే ఉద్దేశ్యంతో అధికారులు పనిచేయాలని కోరుకుంటున్నారు.

**రెండుసార్లు సర్వే చేయించాం: భూక్యా సీతారాం, బాధిత రైతు, పాలారం తండా**



గ్రామ రెవిన్యూ పరిధిలోని 33 సర్వే నెంబర్‌లో నాకు 3,40 ఎకరాల భూమి రికార్డుల్లో నమోదు కావాల్సి ఉండగా కేవలం 2.20 ఎకరాలకు మాత్రమే రికార్డుల్లో ఖాళీ ఉందని అధికారులు చెబుతున్నారు. గత నాలుగు సంవత్సరాల నుండి రెవిన్యూ రికార్డుల్లో నమోదు చేయమని తహసీల్దార్ కార్యాలయం చుట్టూ తిరుగుతున్నా నమోదు చేయడం లేదు. ఆ సర్వే నెంబర్లు భూమి లేని వ్యక్తికి రికార్డుల్లో నమోదు చేసి అధికారులు తనను ఇబ్బందులకు గురి చేస్తున్నారు. రెండుసార్లు రెవిన్యూ ఇన్‌స్పెక్టర్‌తో సర్వే చేయించాము. ఆర్ఐ భూమిని అమ్మిన వ్యక్తుల సమక్షంలో పంచనామా నిర్వహించారు. ఇప్పటికైనా అధికారులు స్పందించి తన భూమిని రికార్డుల్లో చేర్చి తనకు న్యాయం చేయాలన్నారు.

## ఆకాశమే హద్దుగా అక్రమ నిర్మాణాలు

(మొదటి పేజీ తరువాయి..)

సంబంధిత అధికారులు నిర్మాణదారులతో లాలూచీ పడడంతోనే ఈ విధమైన నిర్మాణాలు జరుగుతున్నాయని ప్రజలు చర్చించుకుంటున్నారు. సదరు అక్రమ నిర్మాణాలలో వ్యాపార సంస్థలు, వైద్యశాలలు ఉండడంతో ఏదైనా ప్రమాదాలు జరిగినప్పుడు ఏ విధంగా రక్షించబడతారో ప్రజలకు అర్థం కావడం లేదు. ఇటీవల కాలంలో సికింద్రాబాద్‌లో లాడ్జిలో జరిగిన అగ్ని ప్రమాదం, మిర్యాలగూడలో ఒక వైద్యశాలలో జరిగిన ప్రమాదాలను ప్రజలు గుర్తు చేసుకుంటున్నారు. వ్యాపార సముదాయాలు, వైద్యశాలలో నిత్యం వందలాది మంది సంచరిస్తుంటారు. జరగబోయే ప్రమాదాలను ఏ విధంగా నివారించాలో నిర్మాణదారులకు సైతం తెలియని పరిస్థితి. బహుళ అంతస్తుల నిర్మాణాలకు సంబంధించి ఆర్అండ్‌బి, అగ్నిమాపక విభాగం తదితర విభాగాల నుండి అనుమతులు పొందవలసి ఉన్నప్పటికీ కొంత మంది నిర్మాణదారులు తమకు ఆ విషయమే తెలియదంటూ చెప్పడం విస్మయాన్ని కలిగిస్తుంది. పట్టణంలోని ప్రధాన రహదారి పక్కన గల ఇరుకు వీధులలో సైతం ఆరు, ఏడు అంతస్తుల నిర్మాణాలను చేపట్టి పలు వైద్యశాలలను నిర్వహిస్తున్నప్పటికీ మున్సిపల్ అధికారులు పట్టించుకోకపోవడం వారి అనుబంధం నిర్మాణదారులతో ఎలా ఉందో అర్థమవుతుంది. ఈ విషయమై అధికారులను ప్రశ్నిస్తే పట్టణంలోని అక్రమ నిర్మాణాలపై టాస్క్‌ఫోర్స్‌కు నివేదిక ఇచ్చామని, తదుపరి చర్యలు వారే తీసుకుంటారని తమ భాధ్యతల నుండి తప్పుకునేందుకు ప్రయత్నిస్తు_న్నారని పలువురు సామాజిక కార్యకర్త_లు ఆరోపిస్తున్నారు. సాధారణ ప్రజలు తమ ఇళ్ల నిర్మించుకునే క్రమంలో ఏదైనా చిన్న పొరపాట్లు జరిగితేనే తమ సిబ్బందిని పంపి నిర్మాణాలను నిలిపివేసే మున్సిపల్ అధికారులకు ఈ బహుళ అంతస్తుల నిర్మాణాల సమయంలో ఎందుకు అలాంటి చర్యలు తీసుకోలేదని ప్రజలు ప్రశ్నిస్తు_న్నారు. పట్టణంలో 20కు పైగా అక్రమ నిర్మాణాలను గుర్తించి టాస్క్‌ఫోర్స్ అధికారులకు నివేదిక ఇచ్చినట్లు మున్సిపల్ అధికారులు తెలిపారు. సదరు అక్రమ నిర్మాణదారులకు నోటీసులు రాలేదని సమాచారం. నిర్మాణ సమయంలోనే చర్యలు తీసుకుంటే ప్రస్తుతం ఈ సమస్య ఉద్భవించదు కదా అని ప్రజలు చర్చించుకుంటున్నారు. నిర్మాణదారుల నుండి సంబంధిత అధికారులకు ముడుపులు ముట్టడంతోనే ఈ రకమైన అక్రమ నిర్మాణాలు జరుగుతున్నాయని ప్రజలు బహిరంగంగానే విమర్శిస్తున్నారు. జాతీయ రహదారికి 500 మీటర్ల దూరంలో మద్యం దుకాణాలను ఏర్పాటు చేయకూడదనే నిబంధన ఉన్నప్పటికీ పట్టణంలోని హుజూర్‌నగర్ రోడ్డులో జాతీయ రహదారి పక్కనే వైన్స్‌ను నిర్వహిస్తున్నప్పటికీ సంబంధిత అధికారులు పట్టించుకోకపోవడం గమనార్హం. నిర్వహించబడుతున్న వైన్స్ దుకాణ నిర్మాణానికి ఎలాంటి అనుమతులు తీసుకోకుండా నిర్మించడం కొసమెరుపు. సంబంధిత అధికారులు ఈ అక్రమ నిర్మాణాలపై చర్యలు తీసుకోవాలని, రాబోయే ప్రమాదాలను నివారించాలని పట్టణ ప్రజలు కోరుతున్నారు.

## అమ్మో.. యాసంగి

వాపోతున్నారు. మరోవక్క ప్రస్తుత యాసంగి పంటల సాగులో కూలీల కొరత పెద్ద సమస్యగా తయారవుతుంది. సాగు విస్తీర్ణం పెరిగేకొదినద కూలీల లభ్యత బాగా తగ్గుతుంది. జిల్లాలోని అన్ని ప్రాంతాల్లోను వరినాట్లు వేయడానికి కూలీలు దొరకడం లేదని, మరికొన్ని ప్రాంతాల్లో ఒక్కోకూలీ రోజుకు 500 రూపాయలు నుండి 700 వందల రూపాయల వరకు అడుగుతున్నారు. ఇక యంత్రాలను ఉపయోగిస్తే వాటికి డీజిల్ ధరలు, డ్రైవర్ల జీతాలు పెరగడంతో అద్దె పెంచడం తప్పడం లేదని యజమానులు చెబుతున్నారు. యంత్రాలు ఉంటేనే సాగు ముందుకు వెళ్లే పరిస్థితి నెలకొంటుందని చెబుతున్నారు. ఈ పరిస్థితుల్లో రైతులకు యాసంగి సాగు చేయడం తలకు మించిన భారంగా తయారైంది.

**రైతు గుండాల నవీన్ వివరణ:**

గతంతో పోలిస్తే పెట్టుబడులు అధికమయ్యాయి. దిగుబడి తగ్గింది వేరే గత్యంతరం లేక వ్యవసాయం చేస్తున్నాము.

## ఘర్షణలకు పాల్పడితే చర్యలు తప్పవు

బార్ అండ్ రెస్టారెంట్లు ప్రభుత్వం అనుమతించిన సమయపాలన పాటించాలన్నారు. డిసెంబర్ 31వ తేదీ రాత్రి 10 గంటల నుండి స్పెషల్ డ్రంక్ అండ్ డ్రైవ్ నిర్వహిస్తామన్నారు. మద్యం మత్తులో వాహనాలు నడిపే వారిని అదుపులోకి తీసుకుని జరిమానాలు విధించడంతో పాటు వాహనాలు సీజ్ చేయడం, లైసెన్స్‌లు రద్దు చేయడం, బైండోవర్ చేయడం లాంటి చట్టపరమైన చర్యలు చేపడతామన్నారు. త్రిబుల్ రైడింగ్, రాంగ్ రూట్ డ్రైవింగ్,, హెల్మెట్ లేకుండా వాహనం నడిపినా చట్టపరమైన చర్యలు తప్పవన్నారు. మఫ్టీ టీమ్స్, స్పెషల్ బ్రాంచి సిబ్బందితో అక్రమ సిట్టింగులు, ఆరుబయట మద్యం సేవించడం, గుంపులు గుంపులుగా తిరుగుతూ మహిళలను వేధింపులకు గురి చేస్తూ ఇబ్బందులను పెట్టే వారిపై ఎప్పటికప్పుడు పర్యవేక్షణ చేయడం జరుగుతుందన్నారు. ఆర్కెస్ట్రా, డిజేలు, మైకులు ఉపయోగించడం, బాణాసంచా నిషేధమన్నారు. నిబంధనలు అతిక్రమిస్తే చట్టపరమైన చర్యలు తప్పవన్నారు. వేడుకల్లో అవశ్యతలు జరగకుండా వాహన తనిఖీలు, పెట్రోలింగ్, పికెట్స్, మఫ్టీ టీమ్స్, ముఖ్యమైన కూడలిలో సిసి కెమెరాలు ఏర్పాటు లాంటి ముందస్తు చర్యలు తీసుకుంటున్నామన్నారు. డిసెంబర్ 31 ప్రోగ్రాం నిర్వహించే వారు, దుకాణ యజమానుదారులు ఫుడ్, డ్రింక్స్‌కు వినియోగదారుల నుండి ఎక్కువగా వసూలు చేస్తూ ప్రజలను మోసం చేయరాదన్నారు.

## ఉత్తమ పోలీస్ స్టేషన్‌గా కోదాడ

**కోదాడ రూరల్, డిసెంబర్ 29 ప్రభాతవార్త**

కోదాడ పట్టణ పోలీస్ స్టేషన్ తెలంగాణ రాష్ట్ర స్థాయిలో ఉత్తమ పోలీస్ స్టేషన్‌గా ఎంపికైంది. రాష్ట్ర డిజిపి మహేందర్‌రెడ్డి నిర్వహించిన రాష్ట్ర స్థాయి సమీక్షా సమావేశానికి జిల్లా ఎస్పీ రాజేంద్రప్రసాద్ జిల్లా పోలీస్ కార్యాలయం నుండి హాజరయ్యారు. రాష్ట్రంలో పోలీస్ విభాగం తమకు సంబంధించిన అన్ని విభాగాలలో మంచి పనితీరును కనబరుస్తున్నారని డిజిపి తెలిపారని ఎస్పీ పేర్కొన్నారు. కేసుల స్థితిగతులు, అంతర్జాల నమోదు, కమ్యూనిటీ కార్యక్రమాలు, సాంకేతికత, ఆధునిక పోలీసింగ్, మహిళల ర క్షణ తదితర అంశాలపై డిజిపి నిర్వహించిన సమీక్షలో అన్ని విభాగాల నిర్వహణలో కోదాడ పట్టణ పోలీస్ స్టేషన్ ఉత్తమ స్టేషన్‌గా వచ్చిందని ఎస్పీ తెలిపారు. అదే విధంగా పోలీస్ స్టేషన్ల నిర్వహణ, పని విభాగాల పనితీరు అమలులో భాగంగా జిల్లాలో ఫైవ్ ఎస్ వర్టికల్ ఇన్వెస్టిగేషన్, కోర్టు మానిటరింగ్, సైబర్ క్రైమ్ మానిటరింగ్, పోలీస్ హెచ్ఆర్ఎం ట్రైనింగ్ అండ్ కెపాసిటీ, బిల్డింగ్ పోలీస్ ట్రాన్స్‌పోర్టు సమన్స్ అమలులో బాగా పనిచేసినందుకు రాష్ట్ర స్థాయిలో జిల్లా పోలీస్ ప్రథమ స్థానంలో నిలిచిందని జిల్లా పోలీస్ విభాగాన్ని రాష్ట్ర డిజిపి అభినందించారు.

# సర్వీస్ క్రమబద్ధీకరణ జరిగేనా?

2005వ సంవత్సరంలో అప్పటి యుపిఎ ప్రభుత్వం జాతీయ గ్రామీణ ఉపాధి హామీ పథకాన్ని ప్రవేశపెట్టింది. 2006వ సంవత్సరంలో ఈ పథకం అమలుకు రాష్ట్ర వ్యాప్తంగా అన్ని జిల్లాల్లో ప్రత్యేక కమిటీలను ఏర్పాటు చేసి కాంట్రాక్టు పద్దతిలో ఉద్యోగులను నియమించారు. ఏపీవోలు, ఈసీలు, టిఎలు, కంప్యూటర్ ఆపరేటర్లు తదితరులు రాష్ట్ర వ్యాప్తంగా 3874 మంది పనిచేస్తున్నారు. ఉపాధి పథకం కింద ప్రభుత్వం ప్రవేశపెట్టిన కార్యక్రమాలన్నింటిని సిబ్బంది సమర్థవంతంగా అమలయ్యేందుకు అన్ని రకాల చర్యలు తీసుకుంటున్నారు. 17 ఏళ్లుగా తమ సర్వీస్‌లను ఉపయోగించుకుంటున్నారే తప్ప క్రమబద్ధీకరించకపోవడంతో ఎదుగు బొదుగు లేకుండా పోతుందని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. 2008లో ఎంజిఎన్ఆర్ఈజీఎస్ ఉద్యోగులను హెచ్ఆర్‌సి పాలసీ పరిధిలోకి తీసుకువచ్చారు. ఒకే కమీషనర్, రూరల్ డెవలప్‌మెంట్ కింద ఫిక్స్‌డ్ టెన్యూర్ ఉద్యోగులు(ఎఫ్‌టిఈ)గా మార్పు చేశారు. వీరంతా కనీసం టైమ్ స్కేల్ అయినా ఇవ్వాలని ప్రభుత్వానికి విన్నవిస్తున్నారు. పలుసార్లు ఆందోళన చేపట్టారు. సెర్ప్‌లో ఉన్న ఫిక్స్‌డ్ టెన్యూర్ ఉద్యోగులకు టైమ్ స్కేల్ కవర్ చేస్తున్నారని, ఈజీఎస్ పథకంలో పనిచేస్తున్న ఉద్యోగులు పేర్కొంటున్నారు. తమకు కూడా టైమ్ స్కేల్ వర్తింపజేస్తే వేతనాలు పెరిగి కొంత మేరకు ఇబ్బందులు తొలగుతాయంటున్నారు. 2006లో రోస్టర్ పద్దతి ద్వారా నియమించిన తమను 2014-15 సంవత్సరంలో రాష్ట్ర ప్రభుత్వం ఈజీఎస్ ఉద్యోగులకు న్యాయం చేస్తామని హామీ ఇచ్చింది. నేటికీ సమస్య పరిష్కారం కాకపోవడంతో నిరుత్సాహం చెందుతున్నారు. గ్రామాల్లో ఉపాధి సిబ్బంది ఎన్నో పథకాలను సమర్థవంతంగా అమలు చేస్తున్నారు. చెరువులు, కుంటల్లో పూడిక తొలగింపు, హరితహారం, రోడ్ల నిర్మాణం, మరుగుదొడ్లు, ఇంకుడు గుంతల నిర్మాణం, క్రీడా ప్రాంగణాలు, వైకుంఠదామాలు, సెగ్రిగేషన్ షెడ్లు తదితర పనులను నిర్వహించడంలో ప్రధానపాత్ర వహిస్తున్నారు. ఎలాంటి పదోన్నతులు లేకుండా నియమించినప్పుడు ఏ పోస్టులో ఉన్నారో అదే పోస్టులో పనిచేస్తున్నారు. వేతనాలు పెరగకపోవడంతో ఆర్థిక ఇబ్బందులు ఎదుర్కోవాల్సిన పరిస్థితి నెలకొందని వాపోతున్నారు. గత సంవత్సరం తెలంగాణ ప్రభుత్వం ఫీల్డ్ అసిస్టెంట్లను తొలగించినప్పటికీ ఉన్న సిబ్బందే గ్రామాల్లో ఈజీఎస్ పనులు సకాలంలో పూర్తి అయ్యేలా చర్యలు తీసుకున్నారు. ఇప్పటికీ పథకాన్ని అమలు చేయడంలో శక్తివంచన లేకుండా కృషి చేస్తున్నారు. మరుగుదొడ్ల నిర్మాణం, హరితహారం మొక్కల పెంపకం, రోడ్ల నిర్మాణం తదితర పనులను ఎప్పటికప్పుడు పర్యవేక్షిస్తూ సంబంధిత ఉన్నతాధికారులకు సమాచారం అందిస్తున్నారు. ఉన్నతాధికారుల ఆదేశాల మేరకు పనులు పూర్తి చేయించడంలో ముందు వరుసలో ఉంటున్నారు. తమ ఇబ్బందులను గుర్తించి టైం స్కేల్ వర్తింపజేసి సర్వీస్ క్రమబద్ధీకరించాలని కోరుతున్నారు.



**టైం స్కేల్ ఇచ్చి పదోన్నతులు కల్పించాలి: సుంకరి రాకేష్ వర్మ**

గ్రామీణాభివృద్ధి శాఖలో 17 సంవత్సరాలుగా ఉద్యోగులుగా పనిచేస్తున్న తమకు టైం స్కేల్ ఇస్తూ పదోన్నతులు కల్పించాలని ఉపాధి హామీ ఉద్యోగుల జెఏసి జిల్లా ప్రధాన కార్యదర్శి సుంకరి రాకేష్ వర్మ అన్నారు. పనిభారంతో వయస్సు మీద పడుతూ అనారోగ్య సమస్యలతో ఉద్యోగులు ఇబ్బందులు పడుతున్నారు. సర్వీస్ క్రమబద్ధీకరించడంతో పాటు పదోన్నతులు కల్పించాలి. గతంలో మంత్రులకు పలుమార్లు విన్నపాలు అందజేశాం. సానుకూల దృక్పథంతో సమస్యను పరిష్కరించాలి.

# సబ్బండ కులాలకు బిఆర్ఎస్ ప్రభుత్వం పెద్దపీట

*కోదాడ రూరల్, డిసెంబర్ 29 ప్రభాతవార్త*

సబ్బ ండ కులాలకు తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం పెద్దపీట వేసిందని ఎమ్మెల్యే బొల్లం మల్లయ్యయాదవ్ అన్నారు. గురువారం పట్టణంలోని గాంధీనగర్‌లో హోలియో దాసరి కుల ఆత్మీయ సమ్మేళనంలో ఆయన ముఖ్య అతిధిగా పాల్గొని మాట్లాడుతూ గత పాలకులు వెనుకబడిన కులాలను ఓటు బ్యాంకుగా వినియోగించుకున్నారే తప్ప వారి అభ్యున్నతికి చేసిందేమీ లేదన్నారు. బిఆర్ఎస్ ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తరువాత నాగరికతకు దూరంగా ఉన్న అన్ని కులాలను గుర్తించి వారిలో చైతన్యానికి కృషి చేసిందన్నారు. గురుకుల పాఠశాలల విద్య, సామాజిక ఫించన్లు, షాదీముబారక్, కళ్యాణలక్ష్మి, రైతుబంధు, రైతుభీమాతో పాటు కులాల వారీగా స్వయం ఉపాధికి ఆర్థిక సహాయాలు, ముఖ్యమంత్రి సహాయనిధి ఇలా ఎన్నో పథకాలు అన్ని కులాల వారికి అందించిందన్నారు. హోలీయ దాసరి



కులానికి కూడా అన్ని పథకాలు వర్తిస్తున్నాయని ఇంకా రాబోయే పథకాల్లో తగిన ప్రాధాన్యత ఇస్తామన్నారు. విద్యతోనే సామాజిక మార్పు అని, హోలియో దాసరి సామాజిక వర్గం తమ పిల్లలను ఉన్నత విద్యలు చదివే విధంగా ప్రభుత్వ పాఠశాలల్లో చేర్పించాలన్నారు. సామాజికంగా, రాజకీయంగా, ఆర్థికంగా అన్ని రంగాల్లో అభివృద్ధి చెందాలన్నారు. హోలీయో దాసరి కులానికి తన వంతు సహకారం అందిస్తానన్నారు. ఈ సందర్భంగా హోలీయో దాసరి కులస్తులు ఎమ్మెల్యేను ఘనంగా సన్మానించారు. ఈ కార్యక్రమంలో బిఆర్ఎస్ పట్టణ అధ్యక్షుడు చందు నాగేశ్వరరావు, మున్సిపల్ వైస్ చైర్‌పర్సన్ వెంపటి పద్మ మధుసూదన్, సంఘం అధ్యక్షుడు ఉమ్మినేని గోపి, పిట్టల శ్రీను, ఆవుల మల్లేశ్వరరావు, ఆవుల గోపి, కౌన్సిలర్లు బెజవాడ శ్రవణ్, వంటిపులి రమా శ్రీనివాస్, గుండెల సూర్యనారాయణ, కోట మధుసూదన్, ఖదీర్‌భాషా, కట్టెబోయిన జ్యోతి శ్రీనివాస్ యాదవ్, కల్లూరి పద్మజ, షేక్ మదార్, మేదర లలిత, ఖాజామొహినుద్దీన్, కమదన చందర్‌రావు తదితరులు పాల్గొన్నారు.

# పారిశుద్య కార్మికుల సంరక్షణకై ప్రభుత్వం కృషి

*కోదాడ టౌన్, డిసెంబర్ 29 ప్రభాతవార్త*



నేషనల్ సఫాయి కర్మచారిస్ ఫైనాన్స్ డెవలప్‌మెంట కార్పోరేషన్ వారి ఆధ్వర్యంలో ప్రభుత్వం అందిస్తున్న పథకాల గురించి గురువారం మున్సిపల్ పారిశుద్య కార్మికులకు అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో ముఖ్య అతిధిగా పాల్గొన్న మున్సిపల్ చైర్‌పర్సన్ వనపర్తి శిరీష లక్ష్మీనారాయణ మాట్లాడుతూ పథకం ద్వారా పారిశుద్య కార్మికులకు ఇన్స్యూరెన్ స సౌకర్యం, వారి పిల్లల చదువులకు కావాల్సినటువంటటి బ్యాంకు లోన్లపై తక్కువ వడ్డీకి రుణాలు, పారిశుద్య కార్మికుల కుటుంబ సభ్యులు నిర్వహించుకునే వ్యాపారాలకు తగిన లోన్ సౌకర్యం పథకం ద్వారా వినియోగించుకోవచ్చని తెలిపారు. ఇంత మంచి పథకం గురించి అందరూ అవగాహన కలిగి ఉండాలన్నారు. కరోనా కష్టకాలంలో ఆరోగ్యాన్ని సైతం లెక్కచేయకుండా విధులు నిర్వహించిన పారిశుద్య కార్మ్కిఉలకు పట్టణ ప్రజల ద్వారా ప్రత్యేక ధన్యవాదాలు తెలిపారు. కార్యక్రమంలో భాగంగా వారికి ఆప్రాన్స్, మాస్కులు, గ్లౌజ్‌లు అందజేశారు. ఈ కార్యక్రమంలో మున్సిపల్ ఈఈ భవాని, శ్రీదేవి, ఎన్ఎస్‌కెఎఫ్‌డిసి సిబ్బంది పాల్గొన్నారు.

# మండల స్థాయి టిఎల్ఎం మేళా

*నడిగూడెం, డిసెంబర్ 29 ప్రభాతవార్త*

2023 జనవరి 3, 4 తేదీలలో జిల్లా వ్యాప్తంగా మండల స్థాయిలో టీచింగ్ లెర్నింగ్ మెటీరియల్(టిఎల్ఎం) మేళా నిర్వహించ నున్నారు. ఈ మేరకు జిల్లా విద్యాశాఖ అధికారి నుండి ఆయా పాఠశాలల ప్రధానోపాధ్యాయులకు ఆదేశాలు అందాయి. 50 శాతం ఉపాధ్యాయులు 3వ తేదీన, మిగిలిన 50 శాతం మంది ఉపాధ్యాయులు 4వ తేదీన టిఎల్ఎం మేళాకు హాజరు కావాల్సి ఉంటుంది. ప్రాథమిక పాఠశాలల ఉపాధ్యాయులకు మాత్రమే ఈ మేళా నిర్వహించనున్నారు. రెండు రోజుల్లో ఉపాధ్యాయులు రిజిస్ట్రేషన్ చేయించుకోవాలి. ఒక్కొక్క పాఠశాల నుండి సబ్జెక్టు టీచర్ ఒక టిఎల్ఎంకు తక్కువ కాకుండా కనీసం నాలుగు టిఎల్ఎంలు తయారు చేసుకుని మేళాకు వెళ్లాల్సి ఉంటుంది. తయారు చేసే టిఎల్ఎంలు ఎక్కువ కాలం మన్నికలో ఉండాలి. సులభ పద్ధతిలో ఉపయోగించేలా తయారు చేయాలి. పరిసరాల నుండి సేకరించిన వస్తువులతో తయారు చేస్తే బాగుంటుందని ఉత్తర్వుల్లో పేర్కొన్నారు. టిఎల్ఎంలో నూతనత్వం, ఆకర్షణీయత ఉండాలి. పిల్లలందరికీ ఉపయోగపడాలి. తరగతి భోదనకు ఉపయోగపడేలా చూసుకోవాలి. పూర్తి వివరాలతో వ్రాతపూర్వక డాక్యుమెంట్, రైటప్ సిద్ధం చేసుకోవాలి. టిఎల్ఎం, రెండు నిమిషాల వీడియో రికార్డు డాక్యుమెంటేషన్ కమిటీకి అందజేయాలి. రిజిస్ట్రేషన్, అడ్వైజరీ, డిస్‌ప్లే, డాక్యు మెంటేషన్, జ్యుడీషియల్ కమిటీలను ఎంపిక చేశారు. మండల జ్యుడీషియల్ కమిటీ సభ్యులు ఉత్తమ టిఎల్ఎంను ఎంపిక చేస్తారు. మండల స్థాయిలో ఉత్తమ టిఎల్ఎం రూపొందించిన ఉపాధ్యాయుడు జనవరి రెండవ వారంలో జిల్లా స్థాయిలో జరిగే మేళాలో పాల్గొనాల్సి ఉంటుంది. ఆ తరువాత జిల్లా స్థాయిలో 20 ఉత్తమ టిఎల్ఎంలను ఎంపిక చేసి రాష్ట్ర స్థాయికి పంపనున్నారు. సదరు ఉపాధ్యాయులు రాష్ట్ర స్థాయి టిఎల్ఎం మేళాలో పాల్గొని ప్రతిభను చాటుకోవాల్సి ఉంటుంది. సమయం దగ్గర పడుతుండడంతో ఉపాధ్యాయులు టిఎల్ఎం తయారు చేయడంలో నిమగ్నమయ్యారు.

# గ్రామ దేవతలే గ్రామానికి శ్రీరామరక్ష

*కోదాడ రూరల్, డిసెంబర్ 29 ప్రభాతవార్త*



ముత్యాలమ్మ అమ్మవారి ఆశీస్సులతో ప్రజలంతా సుభిక్షంగా ఉండాలని తెలంగాణ సంప్రదాయంలో గ్రామ దేవతలను పూజించడం ఆనవాయితీ అని ఎంపిపి చింతా కవితా రాధారెడ్డి పేర్కొన్నారు. గురువారం పట్టణ పరిధిలోని అ ంబేద్కర్ కాలనీలో ముత్యాలమ్మ, పోతురాజుల విగ్రహ ప్రతిష్ట నిర్వహించిన తరువాత నిర్వహించిన 16 రోజుల వేడుకలో పాల్గొన్న అమె అమ్మవారికి ప్రత్యేక పూజలు నిర్వహించారు. చీరె సారెతో భోనం సమర్పించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ గ్రామ దేవతలే గ్రామానికి శ్రీరామరక్ష అన్నారు. అమ్మవారి విగ్రహ ప్రతిష్టా మహోత్సవానికి సహకరించిన దాతలను, ఇంత అంగరంగ వైభవ ంగా వేడుక నిర్వహిస్తున్న నిర్వాహకులను ఆమె అభినందించారు. అనంతరం ఆమెను ఆలయ కమిటీ నిర్వాహకులు ఘనంగా సన్మానించారు. ఈ కార్యక్రమంలో సుంకర పుల్లయ్య, అభిదర్‌నాయుడు, కెవి రత్నం, ప్రజలు తదితరులు పాల్గొన్నారు.

# విద్యుద్ఘాతానికి రెండు గేదెలు మృతి

*కోదాడ టౌన్, డిసెంబర్ 29 ప్రభాతవార్త*

విద్యుద్ఘాతంతో రెండు గేదెలు మృతి చెందిన సంఘటన గురువారం మున్సిపాలిటీ పరిధిలోని తమ్మరలో చోటుచేసుకుంది. విద్యుత్‌శాఖ అధికారుల నిర్లక్ష్యంతోనే తన రెండు గేదెలు మృతి చెందాయని మున్సిపల్ పరిధిలోని తమ్మరకు చెందిన రైతు యర్రా వెంకటరామయ్య ఆవేదన వ్యక్తం చేశారు. ఈ సందర ంగా అదే గ్రామానికి చెందిన తమ్మినేని రామకృష్ణ మాట్లాడుతూ ఈ నెల 25న తన స్వంత వ్యవసాయ భూమిలో వరి పంటను వరి కోత యంత్రంతో కోస్తుండగా కరెంట్ తీగలు తెగడంతో వెంటనే సంబంధిత అధికారులకు సమాచారం అందజేసినట్లు తెలిపారు. ట్రాన్స్‌ఫార్మర్ ఆఫ్ చేయమని చెప్పడంతో వెంటనే ఆఫ్ చేశామన్నారు. వెంటనే కరెంట్ తీగలు మరమ్మత్తులు చేయాలని కోరామని, అధికారులు నిర్లక్ష్యంతో రెండు రోజులు పట్టించుకోకపోవడంతో తోటి రైతులు పొలాలకు వెళ్లి విద్యుత్ ట్రాన్స్‌ఫార్మర్ ఆన్ చేశారన్నారు. రైతులు ట్రాన్స్‌ఫార్మర్ ఆన్‌చేస్తున్నారని చెప్పినప్పటికీ స్పందించకపోవడంతో ఈ ప్రమాదం చోటుచేసుకుందని, వెంకట్రామయ్యకు చెందిన రెండు గేదెలు మృతి చెందాయని తెలిపారు. దీనిపై సంబంధిత ట్రాన్స్‌కో అధికారులు విచారణ చేపట్టి న్యాయం చేయాలని గ్రామ రైతులు కోరుతున్నారు. ఇలాంటి సంఘటనలు మరోసారి పునరావృతం కాకుండా విద్యుత్ అధికారులు చర్యలు చేపట్టాలన్నారు. భాదితుడికి పరిహారం అందజేయాలని వార్డు కౌన్సిలర్ సామినేని నరేష్, కాంగ్రెస్ నాయకులు కనగాల రాధాకృష్ణ అధికారులను కోరారు.



# భవన నిర్మాణ కార్మికుల సమావేశం

*మునగాల, డిసెంబర్ 29 ప్రభాతవార్త*



భవన నిర్మాణ కార్మికుల మండల కమిటీ సమావేశం గురువారం స్థానికంగా నిర్వహించారు. ఈ సందర్భంగా పలువురు సంఘ నాయకులు మాట్లాడుతూ మునగాల ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో నూతన పనులు నిర్వహిస్తున్నందున అందరూ ఒకే విధానంతో పనిచేయాలని సూచించారు. 2023, జనవరి 8న జరిగే సమావేశానికి నియోజకవర్గ పరిధిలోని భవన నిర్మాణ కార్మికులంతా సమావేశానికి హాజరు కావాలని కోరారు. ఈ కార్యక్రమంలో మండల కమిటీ సభ్యులు దస్తగిరి, నాగేంద్రబాబు, సైదా, నాగరాజు, నాగేశ్వరరావు, జానీపాషా, ఆంజనేయులు, రాజు, భాష, నడిగూడెం మండల కమిటీ సభ్యులు పల్లపు శ్రీను, మల్లిఖార్జున్, వీరన్న, వల్లెపు శ్రీను, సోమయ్య తదితరులు పాల్గొన్నారు.

# వైకుంఠదామాల అభివృద్ధికి ప్రధమ ప్రాధాన్యతనిస్తున్న ప్రభుత్వం

*కోదాడ రూరల్, డిసెంబర్ 29 ప్రభాతవార్త*

పట్టణ పరిధిలోని తమ్మర గ్రామంలో నూతనంగా నిర్మిస్తున్న వైకుంఠదామంను గురువారం మున్సిపల్ చైర్‌పర్సన్ వనపర్తి శిరీష లక్ష్మీనారాయణ పరిశీలించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ రాష్ట్ర ప్రభుత్వం ఎంతో ప్రతిష్టాత్మకంగా నిర్మిస్తున్న వైకుంఠదామంలో ఇంకా చేయాల్సిన పనుల గురించి మున్సిపల్ అధికారులు, స్థానిక కౌన్సిలరన్లు, గ్రామ పెద్దలతో కలిసి చర్చించి నిర్ణయం తీసుకున్నారు. పేరుకు అది మరుభూమే కానీ అన్ని హంగులతో మనిషి చివరి మజిలీ యాత్రను ప్రశాంత వాతావరణంలో బతికినంత కాలం భవిష్యత్ కోసం ఆరాటపడే మనిషి పోయిన తరువాత ఆరడుగుల జాగా కోసం పోరాటం చేయాల్సి వస్తుందన్నారు. సరైన స్మశానవాటికలు లేక అంత్యక్రియల నిర్వహణకు సరైన సదుపాయాలు లేక ప్రజలు పడే కష్టాలు అన్నీ ఇన్నీ కాదన్నారు. ఈ భాదలు తీర్చే భాద్యతను తీసుకున్న తెలంగాణ ప్రభుత్వం ప్రతి గ్రామంలో, పట్టణంలో వైకుంఠదామం నిర్మిస్తూ చివరి మజిలీని స్వర్గయాత్రగా మారుస్తుందన్నారు. ఈ కార్యక్రమంలో మున్సిపల్ కమీషనర్ మహేశ్వర్‌రెడ్డి, ఏఈ అంజలికుమారి, వార్డు కౌన్సిలర్లు సామినేని నరేష్, బత్తినేని హనుమంతరావు, దారావత్ కైలాస్వామినాయక్, కోదాటి కృష్ణయ్య, కనగాల శ్రీధర్, రాధాకృష్ణ తదితరులు పాల్గొన్నారు.



## బిఎస్పీలో చేరిన రామరాజు యాదవ్

*కోదాడ టౌన్, డిసెంబర్ 29 ప్రభాతవార్త*



గత పది సంవత్సరాలుగా కాంగ్రెస్ పార్టీలో ఉంటూ ఉత్తమ్‌కుమార్‌రెడ్డి, పద్మావతిరెడ్డిలకు సన్నిహితంగా ఉన్న యువ నాయకులు మీగడ రామరాజు యాదవ్ గురువారం బహుజన సమాజ్ పార్టీ కార్యాలయంలో బిఎస్పీ రాష్ట్ర ఈసీ మెంబర్ పిల్లుట్ల శ్రీనివాస్ ఆధ్వర్యంలో బిఎస్పీ రాష్ట్ర అధ్యక్షుడు ఆర్‌ఎస్. ప్రవీణ్‌కుమార్ సమక్షంలో పార్టీలో చేరారు. ఈ కార్యక్రమంలో బిఎస్పీ ఐదు రాష్ట్రాల చీఫ్ కోఆర్డినేటర్, రాజ్యసభ సభ్యులు రామ్‌జీ గౌతమ్ తదితరులు ఉన్నారు.

## పాకాల హరనాధరావు మృతి పట్ల సంతాపం

*మునగాల, డిసెంబర్ 29 ప్రభాతవార్త*



తెలంగాణ రాష్ట్ర ముఖ్యమంత్రి కేసీఆర్ వియ్యంకుడు, మంత్రి కేటీఆర్ మామ పాకాల హరనాధరావు మృతి పట్ల మండల పరిధిలోని రేపాలకు చెందిన జిల్లా ఫారెస్ట్ బీట్ ఆఫీసర్ మాచర్ల అచ్చయ్య సంతాపం, సానుభూతి తెలిపారు. 1989 నుండి 1992 వరకు సూర్యాపేట సోషల్ ఫారెస్ట్ ఆఫీసర్‌గా పనిచేసిన హరనాధరావుతో జిల్లాలోని పలువురు ప్రముఖులతో ఆయనకు సత్సంబంధాలు ఉండేవి. అచ్చయ్య హరనాధరావుకు శిష్యుడిగా, సేవకుడిగా ఉండేవారు. వీలు చిక్కినప్పుడల్లా రేపాలకు వచ్చేవారని ఆయన తెలిపారు. ఆయన మృతి పట్ల ఆయనను కడసారి చూసేందుకు అచ్చయ్య కుటుంబం హరనాధరావు ఇంటికి వెళ్తున్నట్లు తెలిపారు.

## విద్యార్థులకు ఇంగ్లీష్ టాలెంట్ టెస్ట్

*నడిగూడెం, డిసెంబర్ 29 ప్రభాతవార్త*



మండలంలోని సిరిపురం ఉన్నత పాఠశాలలో గురువారం విద్యార్థులకు ఇంగ్లీష్ టాలెంట్ టెస్ట్ నిర్వహించారు. ఇంగ్లీష్ సబ్జెక్టుకు సంబంధించి పలు అంశాలపై టెస్ట్‌లు నిర్వహించగా విద్యార్థులు పాల్గొని ప్రతిభను చాటుకున్నారు. ఈ సందర్భంగా ప్రధానోపాధ్యాయుడు యలమర్తి శౌరి మాట్లాడుతూ విద్యార్థులు ఆంగ్ల భాష పరిజ్ఞానాన్ని, ఇంగ్లీష్‌లో మాట్లాడే నైపుణ్యాలను పెంచుకోవాలన్నారు. పాఠశాలల్లో ఇంగ్లీష్ మాధ్యమాన్ని అమలు చేస్తున్న నేపథ్యంలో భాషా పరిజ్ఞానాన్ని పెంచుకోవాల్సిన అవసరం ఎంతైనా ఉందన్నారు. గెలుపొందిన విద్యార్థులకు బహుమతులు ప్రధానం చేశారు. ఈ కార్యక్రమంలో ఉపాధ్యాయులు వేణుగోపాల్‌రావు, సిహెచ్. ప్రకాష్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

## కళ్యాణలక్ష్మి చెక్కుల పంపిణి

*ఆత్మకూర్(ఎం), డిసెంబర్ 29 ప్రభాతవార్త :*

మండలంలోని కూరెళ్ల గ్రామంలో నలుగురు లబ్దిదారులకు కళ్యాణలక్ష్మి చెక్కులను గురువారం సర్పంచ్ బాషబోయిన ఉప్పలయ్య, ఆర్ఐ చిప్పలపల్లి యాదగిరిలు లబ్దిదారులకు అందజేశారు. గ్రామానికి చెందిన వేల్పున నాగమ్మ, గంగదారి అయిలమ్మ, అక్షంత ఆయియా, హనుమంతుల చంద్రకళకు రూ.లక్ష 116 చెక్కులను అందజేశారు. ఈ కార్యక్రమంలో ఏఎస్ఓ జయంత్, టిఆర్ఎస్ అధ్యక్షులు ఎర్కల స్వామి, ఉపసర ్పంచ్ కొమ్ము నరేష్, అఖిలపక్ష నాయకులు పాల్గొన్నారు.



# సహకార సంఘాల కుటుంబాలకు సీఎం కెసిఆర్ దేవుడు

*నల్లగొండ టౌన్, డిసెంబర్ 29 ప్రభాతవార్త*



రాష్ట్ర ప్రభుత్వం 44 జీవో ద్వారా రాష్ట్రంలోని సహకార సంఘాలలో పనిచేస్తున్న ఉద్యోగులకు ఏకరూప మానవ నరుల పథకాన్ని తీసుకువచ్చి వారి కుటుంబాలకు సీఎం కెసిఆర్ దేవుడిలా మారారని డిసిసిబి చైర్మన్ గొంగిడి మహేందర్‌రెడ్డి పేర్కొన్నారు. గురువారం పట్టణంలోని జిల్లా సహకార కేంద్రం బ్యాంకు లిమిటెడ్‌లో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ యూనిఫామ్, హెచ్‌ఆర్ పాలసీ వలన ఉమ్మడి నల్లగొండ జిల్లాలో 350 మంది సహకార సంఘాలలో పనిచేసే యూనిఫామ్, హెచ్‌ఆర్ పాలసీ వలన ప్రయోజనం చేకూరుతుందన్నారు. ఈ పాలసీకి ప్రాథమిక వ్యవసాయ ఉద్యోగుల బోర్డు ఆమోదించిం దన్నారు. అదే విధంగా సింగిల్‌విండో డైరెక్టర్ల గౌరవ వేతనాన్ని పెంచాలని, గత 30 సంవత్సరాల నుండి అందరి సీఎంలను కోరినా ఫలితం లేకుండా పోయిందని, నేడు ముఖ్య మంత్రి కెసిఆర్ చొరవతో రాష్ట్రంలోని సింగిల్‌విండో డైరెక్టర్ల గౌరవ వేతనం రూ. 7500 నుండి రూ. 15 వేలకు పెరిగిందని, దీనిని కూడా బోర్డు ఆమోదించినట్లు వివరించారు. దేశంలో సహకార రంగంలో ఏ రాష్ట్రంలో లేని విధంగా రాష్ట్ర ప్రభుత్వం అన్ని రాష్ట్రాలకు రోల్‌మోడల్‌గా మారిందని పేర్కొన్నారు. రాష్ట్ర హెచ్‌ఆర్ పాలసీ మాదిరిగా అన్ని రాష్ట్రాల సహకార సంఘాల ఉద్యోగులు తమకు కూడా తెలంగాణ హెచ్‌ఆర్ పాలసీ కావాలని ఉద్యమించేందుకు అవకాశం కలిగిందన్నారు. సహకార ఉద్యోగులకు హెచ్‌ఆర్ పాలసీ, సింగిల్‌విండో డైరెక్టర్ల గౌరవ వేతనం పెంపు చేసిన ముఖ్యమంత్రి కెసిఆర్‌కు, రాష్ట్ర మంత్రులకు జిల్లా సహకార కేంద్ర బ్యాంకు లిమిటెడ్ ద్వారా ధన్య వాదాలు తెలిపారు. ఏకరూప మానవ వనరుల పథకం ద్వారా సహకార ఉద్యోగులకు ఉద్యోగ భద్రత ఉంటుందన్నారు. ఈ పాలసీ వలన జిల్లా సహకార కేంద్ర బ్యాంకులు బలోపేతం అవుతాయన్నారు. దీని ద్వారా ప్రొఫెషనల్ క్వాలిఫికేషన్ పొందిన వారికి అదనపు ఇంక్రిమెంట్ లభిస్తుందని, గ్రాట్యుటీ రూ. 2.50 లక్షల వరకు పొందవచ్చన్నారు. ఉద్యోగులందరికీ ప్రావిడెంట్ ఫండ్ సౌకర్యం పొందవచ్చన్నారు. భీమా సౌకర్యం, వ్యక్తిగత లోన్లు జీవో 44 ద్వారా పొందవచ ్చని పేర్కొన్నారు. ఈ సమావేశంలో డైరెక్టర్లు పాశం సంపత్‌రెడ్డి, అందేలా లింగం యాదవ్, సెమిరెడ్డి తదితరులు పాల్గొన్నారు.

# కేంద్ర ప్రభుత్వం రైతు వ్యతిరేక విధానాలపై సమరశీల పోరాటాలు

*మునుగోడు, డిసెంబర్ 29 ప్రభాతవార్త*



కేంద్ర ప్రభుత్వ రైతు వ్యతిరేక విధానాలపై దేశవ్యాప్తంగా సమరశీల పోరాటాలకు సన్నద్ధం కావాలనరి తెలంగాణ రైతు సంఘం రాష్ట్ర కమిటీ సభ్యులు బడా శ్రీశైలం పిలుపునిచ్చారు. గురువార ం మండల కేంద్రంలోని అమరవీరుల భవనంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమా వేశంలో ఆయన మాట్లాడుతూ కేంద్ర ప్రభుత్వం రైతులకు ఇచ్చిన హామీలను అమలు నెర వేర్చడంలో పూర్తిగా విఫలమైందన్నారు. కనీస మద్దతు ధరల చట్టం చేయాలని, విద్యుత్ సవరణ బిల్లును ఉపసంహరించుకోవాలని, రైతుల రుణాలన్నీ ఏకకాలంలో మాఫీ చేయాలని, పేద రైతులు, వ్యవసాయ కూలీలు, చేతి వృత్తుల వారికి నెలకు రూ. 5 వేలు పెన్షన్ ఇవా ్వలని, ఉపాధి హామీ పథకానికి నిధులు పెంచాలని డిమాండ్ చేశారు. రైతులకు ఏక కాలంలో లక్ష రూపాయలు రుణమాఫీ చేసి కొత్త రుణాలు ఇవ్వాలని కోరారు. పెండింగ్‌లో ఉన్న రైతుబంధును రైతులకు వెంటనే అందించాలన్నారు. ధరణి తప్పిదాలను సరిచేసి పరిష్కరించాలన్నారు. జనవరి 8న హైద్రాబాద్‌లో రైతు, సిఐటియు, వ్యకాసల ఆధ్వర్యంలో రాష్ట్ర స్థాయి సదస్సు నిర్వ హిస్తున్నామని, కేంద్ర ప్రభుత్వ హామీలు నెరవేర్చాలని డిమాండ్ చేస్తూ జనవరి 26న దేశవ్యాప్త పిలుపులో భాగంగా ట్రాక్టర్ ర్యాలీలు నిర్వహించాలని పిలుపు నిచ్చారు. ఈ సమావేశంలో రైతు సంఘం జిల్లా నాయకులు సాగర్ల మల్లేష్, మండల నాయకులు వడ్లమూడి హనుమయ్య, కొంక రాజయ్య, బొందు అంజయ్య, నారగోని నరసింహ, వీరమల్లు, వేముల లింగస్వామి, ఎట్టయ్య తదితరులు పాల్గొన్నారు.

## డిగ్రీ కళాశాల ఏర్పాటు చేయాలని తహసీల్దార్ కార్యాలయం ముందు ధర్నా

*నాంపల్లి, డిసెంబర్ 29 ప్రభాతవార్త*

మండల కేంద్రంలో ప్రభుత్వ డిగ్రీ కళాశాల ఏర్పాటు చేయాలని డిమాండ్ చేస్తూ ఎఐఎస్ఎఫ్ ఆధ్వర్యంలో గురువారం తహసీల్దార్ కార్యాలయం ముందు ధర్నా నిర్వహించారు. ఈ సందర్భంగా ఎఐఎస్ఎఫ్ జిల్లా కార్యదర్శి ముదిగొండ మురళీకృష్ణ మాట్లాడుతూ మండల కేంద్రం విద్యాపరంగా చాలా వెనుకబడి ఉందని, ఇక్కడ విద్యా వ్యవస్థ అభివృద్ధి చెందాలంటే ఉన్నత విద్యా సంస్థలను నెలకొల్పాలని ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. మండలంలోని జూనియర్ కళాశాల, మోడల్ స్కూల్‌లో వందలాది మంది విద్యార్థులు చదువుతున్నారని, అంతే కాకుండా చుట్టుపక్కల మర్రిగూడెం, గుర్రంపోడు మండలాలకు చెందిన వేలాది మంది విద్యార్థులు హైద్రాబాద్, నల్లగొండ పట్టణాలకు వెళ్లి చదువుతున్నారని, ఆర్థికంగా వెనుకబడిన విద్యార్థులు చదువులను మధ్యలోనే ఆపేస్తున్నారని, ఇక్కడ డిగ్రీ కళాశాల ఏర్పాటు చేయడం ద్వారా విద్యార్థులు ఉన్నత చదువులు చదవడానికి అవకాశం ఉందని వారు పేర్కొన్నారు. డిగ్రీ కళాశాల సాధించడం కోసం దశల వారీగా ఎఐఎస్ఎఫ్ ఆధ్వర్యంలో ఉద్యమాలు నిర్వహిస్తామని ఆయన ఈ సందర్భంగా తెలిపారు. ఈ కార్యక్రమంలో మండల అధ్యక్షుడు కసిపాక సందీప్, హరిప్రసాద్, రాము, నదీమ్, శివాని, శైలజ, కల్పన తదితరులు పాల్గొన్నారు.

## యల్లమ్మ సేవలు ఆదర్శనీయం

*మునగాల, డిసెంబర్ 29 ప్రభాతవార్త*



మహాజన సోషలిస్టు పార్టీ జిల్లా నాయకులు, మండల పరిధిలోని విజయ రాఘవపురం గ్రామానికి చెందిన కొత్తపల్లి అంజయ్య మాతృమూర్తి యల్లమ్మ మృతి భాదాకరమని, ఆమె ఆశయాలు ఆదర్శనీయమని మహాజన సోషలిస్టు పార్టీ నియోజక వర్గ కోఆర్డినేటర్ ఏపూరి రాజు మాదిగ అన్నారు. గురువారం మండల పరిధిలోని విజయరాఘవపురం గ్రామంలో నిర్వహించిన యల్లమ్మ దశదినకర్మ కార్యక్రమంలో పాల్గొని ఆమె సమాధికి పూలు వేసి అంజలి ఘటించారు. ఈ కార్యక్రమంలో ఎంఈఎఫ్ జాతీయ ప్రధాన కార్యదర్శి డాక్టర్ కత్తి వెంకటేశ్వర్లు, చింతా జాన్‌విల్సన్, వడ్డేపల్లి కోటేష్, లంజపల్లి శ్రీను, పాతకొట్ల నాగరాజు, బొడ్డు కుటుంబరావు, మౌలానా, పిడమర్తి వెంకట్రావ్, మల్లెపాక సూరి, మేరిగ రామారావు తదితరులు పాల్గొన్నారు.

## మొక్కల పెంపకానికి నర్సరీలు సిద్ధం చేయాలి

*నడిగూడెం, డిసెంబర్ 29 ప్రభాతవార్త*



నర్సరీల్లో మొక్కల పెంపకానికి సిద్ధం చేయాలని ఎంపిపి యాతాకుల జ్యోతి మధుబాబు అన్నారు. మండలంలోని చెన్నకేశవాపురం గ్రామంలో గురువారం నర్సరీ పనులను పరిశీలించిన అనంతరం ఆమె మాట్లాడారు. సీడ్స్ కోసం బ్యాగుల్లో మట్టి, సేంద్రీయ ఎరువులు నింపి సిద్ధంగా ఉంచాలన్నారు. ఉపాధి కూలీలకు జాబ్‌కార్డులు, ఆధార్ కంప్యూటర్‌లలో నమోదు అయ్యేలా చూడాలన్నారు. ప్రభుత్వం పంపిణీ చేసే సీడ్స్‌తో పాటు మిగిలిన విత్తనాలు కూడా అందుబాటులో ఉంచాలన్నారు. ఈ కార్యక్రమంలో ఎంపీవో లింగారెడ్డి, కార్యదర్శి ఉపేందర్, ఫీల్డ్ అసిస్టెంట్ అంబేద్కర్ తదితరులు పాల్గొన్నారు.

## వరి సాగులో బాటలు తీయడం వలన ప్రయోజనాలు



**పెన్‌పహాడ్, డిసెంబర్ 29, ప్రభాతవార్త:**
వరిపంట సాగులో బాటలు తీయడం వలన ఉన్న ప్రయోజనాల కార్యక్రమంలో భాగంగా గ్రామీణ వ్యవసాయ పనుల అనుభవ సికింద్రాబాద్ లయోలా కళాశాలకు చెందిన బీఎస్సీ అగ్రికల్చర్ ఫోర్త్ ఇయర్ విద్యార్థులు, శ్రీ అరబిందో గ్రామ అభివృద్ధి సంస్థ కృషి విజ్ఞాన కేంద్రం గడ్డిపల్లి వారి సమక్షంలో మండల పరిధిలోని సింగారెడ్డిపాలెం గ్రామంలో వరి పొలాలలో కాలిబాటలు తీయడం వలన కలిగే ప్రయోజనాలను వివరిస్తు నాట్లు వేసిన పొలాలలో పది రోజులలో ప్రతి 2 మీటర్లుకు 20 సెంటీమీటర్ల చొప్పున కాలిబాటలను తీయాలని వాటి ద్వారా గాలి ప్రసరణ బాగా జరిగి ఎక్కువ పిలకలు పెరగడం కాకుండా చీడపీడలు సోకే అవకాశం కూడా తక్కువ అని రైతులకు తెలిపారు. అదేవిధంగా కాలిబాటల వల్ల ఎరువులు వేడటం, పిచికారి చేయడం సులభం అవుతుందని తెలియజేశారు. ఈకార్యక్రమంలో లయోలా కళాశాల విద్యార్థులు మణిదీప్ సూర్య వంశీ, బ్రుట్ జో, పి. అరుణ్, కార్తీక్, ఎస్ఎం షాకీర్, శుభం జోషి, ఫర్దిన్‌ఖాన్, ఎన్. బిపిన్ రాజ్, రైతులు రామారావు తదితరులు పాల్గొన్నారు.

## మిర్చిలో సస్యరక్షణ చర్యలు చేపట్టాలి



**మద్దిరాల, డిసెంబర్ 29, ప్రభాతవార్త:**
మిర్చిలో తామర పురుగు నివారణకు సస్యరక్షణ చర్యలు చేపట్టాలని మద్దిరాల వ్యవసాయ శాఖ అధికారి వికాస్ పాటిల్ అన్నారు. మండల పరిధిలోని ముకుందాపురంలో మిరప తోటలను పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ గత సంవత్సరం నుండి తామర పురుగు బెడద ఉదృతంగా ఉందని రైతులు దానిని అధిగమించటానికి అక్రితామిపీరైడ్ 1గ్రామ/10 లీటర్ల మిల్లీ లీటరుకు ఒక లీటరు నీరు లేదా ఇమామితోట్ జెంబిన్ 4గ్రామ/ 10 లీటర్ల నీటిలో కిలిపి పిచికారి చేయాలని అన్నారు. నలిపురుగు నియంత్రణకు బ్రోఫోపిజిన్ 8మిల్లీ లీటర్లు/ 10 లీటర్ల నీరు లేదా క్వినాల్ పాస్ 1.5మిల్లీ లీటరు/1 లీటరు వెట్టబుల్ సల్ఫర్, 3గ్రా/ లీటరు నీటిలో కలిపి పిచికారి చేయాలని సూచించారు. ఈ కార్యక్రమంలో ఏఈఓ ఆఫ్రిన్, రైతు కో ఆర్డినేటర్ ఆకుల వెంకన్న తదితరులు పాల్గొన్నారు.

## కన్నుల పండువగా భక్తుల పాదయాత్ర

**మేళ్ళచెరువు డిసెంబర్ 29 ప్రభాతవార్త**



స్థానిక శ్రీవెంకటేశ్వరస్వామి ఆలయం నుండి ఎర్రవరం గ్రామంలో వేంచేసియున్న శ్రీదూళ్లగుట్ట స్వయంభు వైకుంఠ బాల ఉగ్రనర్సింహస్వామి దేవాలయం వరకు గురువారం సుమారు 1000 మంది భక్తులు దైవనామస్మరణతో, భజన కోలాటములతో పాదయాత్ర కార్యక్రమాన్ని కన్నులపండువగా నిర్వహించి నరసింహస్వామి వారిని దర్శించు కున్నారు. పాదయాత్ర భక్తులందరికీ దాతలు శాగంరెడ్డి గోవిందరెడ్డి, కొట్టె సైదేశ్వరరావు, సారెడ్డి రామలింగారెడ్డి, కొర్లపాటి లక్ష్మయ్య, కొర్లపాటి జానయ్య, బుస్సా చెన్నారావు, గొర్రె శ్రీకాంత్‌లు అన్నప్రసాదం, భోజన కార్యక్రమం ఏరాట్పు చేశారు. ఈ కార్యక్రమాలలో నరగిరినాథుని నర్సింహాచార్యులు, సుదర్శనం ప్రసాదాచార్యులు, ఇనపకుతికల నర్సింహ మూర్తిశర్మ, సర్పంచ్ పందిళ్లపల్లి శంకరరెడ్డి, ఎంపిపి కొట్టె పద్మసైదేశ్వరరావు, జడ్‌పిటిసి శాగంరెడ్డి పద్మగోవిందరెడ్డి, ఇర్ల నారాయణరెడ్డి, సిద్దం వెంకటరత్నం, నలజాల జగన్నాథంతోపాటు భక్తులు పాల్గొన్నారు.

## నిరుపేద కుటుంబానికి బియ్యం పంపిణి

**బొమ్మలరామారం, డిసెంబర్ 29 ప్రభాతవార్త :**
మండలంలోని హాజిపూర్ గ్రామానికి చెందిన గ్రామపంచాయతీ సిబ్బంది పరిద కిష్టమ్మ అనారోగ్యంతో చనిపోవడంతో వారి కుటుంబానికి నాగినేనిపల్లి ఎంపిటిసి పక్కీరు రాజేందర్‌రెడ్డి 50 కిలోల బియ్యాన్ని పంపిణి చేశారు. ఈ కార్యక్రమంలో తుమ్మల కుమార్, మహేష్, మల్లేశ్, సుధాకర్, బిక్షపతి, స్వామి, కొండల్ తదితరులు పాల్గొన్నారు.

## పాడి గేదేలను శ్రద్ధగా పెంచాలి



**మేళ్ళచెరువు డిసెంబర్ 29 ప్రభాతవార్త**
స్థానిక పశువైద్యశాల ఆవరణలో గురువారం మై హోం సిమెంట్ ఇండస్ట్రీయస్ మహాసిమెంట్ వారు నిర్వహించిన ఉచిత మెగా వైద్య శిబిరం ముగింపు సభలో సర్పంచ్ పందిళ్లపల్లి శంకరరెడ్డి మాట్లాడుతూ రైతులంతా శ్రద్ధగా పాడి గేదెలను పెంచాలని, పాల ఉత్పత్తుల ద్వారా ఆర్థికంగా అభివృద్ధి చెందవచ్చని అన్నారు. సుమారు 9వేల గొర్రెలకు, 3వేల ఆవులకు, గేదెలకు, దూడలకు ఉచిత వైద్యం , ఉచిత మందులు అందించారు. ఈ కార్యక్రమంలో మైహోం ప్లాంట్ హెడ్ శ్రీనివాసరావు, జనరల్ మేనేజర్ డా.నాగేశ్వరరావు, పశువైద్యాధికారులు డాక్టర్ శ్రీనివాసరావు, డా.ఉషారాణితోపాటు పెద్ద సంఖ్యలో రైతులు, గొర్రెల, మేకల పెంపకందారులు పాల్గొన్నారు.

## విద్యార్థులకు స్టడీ చైర్స్ అందించిన డా.కరుణాకర్



**నేరేడుచర్లరూరల్ డిసెంబర్ 29 ప్రభాతవార్త**
నేరేడుచర్ల మండలంలోని దిర్శించర్ల గ్రామంలో ఉన్న జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో10వ తరగతి చదువుతున్న విద్యార్థులకు 20 స్టడీ చైర్స్‌ను రాఫా మల్టీసూపర్ స్పెషాలిటీ హాస్పటల్ మిర్యాలగూడ పట్టణానికి చెందిన ప్రముఖ గుండె వైద్య నిపుణులు డాక్టర్ రాపోలు కరుణాకర్,డాక్టర్ హెప్సినా దంపతులు రూ.12వేలు వెచ్చించి స్టడీ చైర్స్ అందించగా జడ్‌పిటిసి రాపోలు నర్సయ్య విద్యార్థులకు అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ విద్యార్థులు బాగా చదివి ఉన్నతస్థితికి రావాలన్నారు. ఈ కార్యక్రమంలో ఎస్ఎంసి చైర్మన్ వరాల కిరణ్మయి, వైస్ చైర్మన్ కొంగ బుచ్చిబాబు, ప్రధానోపాధ్యాయులు బట్టు మదు, ఉపాధ్యాయులు శ్రీనివాస్, అశోక్‌కుమార్, యాదగిరి, కోటిరెడ్డి, కిష్ణయ్య, సబియా, రాపోలు మహేష్ తదితరులు పాల్గొన్నారు.

## మొగులూరు శ్రీనుకు ఓయు డాక్టరేట్



**హుజూర్‌నగర్‌టౌన్ డిసెంబర్ 29 ప్రభాతవార్త**
హుజూర్‌నగర్ పట్టణానికి చెందిన మొగులూరు శ్రీను ఉస్మానియా యూనివర్సిటీలో చరిత్ర విభాగంలో డాక్టరేట్‌సాధించాడు. యూనివర్సిటీ ఆర్ట్స్ కళాశాల రిటైర్డ్ ప్రొఫెసర్ వెంకటేశ్వరరావు పర్యవేక్షణలో 'ఏ బయోగ్రఫికల్ స్టడి ఆఫ్ కొండా లక్ష్మణ్ బాపూజీ' అనే అంశంపై విస్తృతమైన పరిశోధన పూర్తి చేసి సమర్పించిన పరిశోధనా గ్రంధాన్ని పరిశీలించిన ఓయు ఎగ్జామినేషన్ అధికారులు ఆయనకు చరిత్రలో పిహెచ్‌డి పట్టా ప్రదానం చేస్తున్నట్లు గురువారం ఒక ప్రకటనలో తెలిపారు. హుజూర్‌నగర్ పట్టణంలోని నిరుపేద దళిత కుటుంబానికి చెందిన మొగులూరి సోమయ్య వెంకమ్మల కుమారుడు శ్రీను తన బాల్యంలోనే తండ్రిని కోల్పోయాడు. నిరక్షరాస్యులైన తల్లి వెంకమ్మకూలీ పనులు చేస్తూ శ్రీనును ఉన్నత విద్యను చదివించింది. అవార్డ్ ప్రదానోత్సవం సందర్భంగా శ్రీను మాట్లాడుతూ అవార్డ్ పొందేనాటికి తల్లి లేనప్పటికి స్వర్గస్థురాలైన ఆమె బలమైన సంకల్పమే పిహెచ్‌డి డిగ్రీ పొందడానికి దోహదపడిందని తెలిపారు. అదేవిధంగా పరిశోధనకు సహకరించిన పిజి కాలేజి ప్రిన్సిపాల్ అర్జున్‌రావు కుతాడి, హెడ్ ఆఫ్‌ది హిస్టరీ డిపార్ట్‌మెంట్ ప్రొ.జి.అంజయ్య, ప్రొఫెసర్ లావణ్య, బోర్డ్ ఆఫ్ స్టడీస్ చైర్‌పర్సన్ పి.ఇందిర,యూనివర్సిటీ నాయకులు డాక్టర్ జక్కుల కోటేశ్వరరావుయాదవ్‌లకు కృతజ్ఞతలు తెలిపారు. తెలంగాణ ఉద్యమంలోక్రియాశీలక పాత్ర పోషించిన శ్రీనివాస్ చరిత్ర విభాగంలో డాక్టరేట్ సాధించడం పట్ల గురువులు, ప్రియదర్శిని కళాశాల చైర్మన్ పశ్య శ్రీనివాసరెడ్డి, చిటాౄల శ్రీనివాసరెడ్డి, డి.శ్రీనివాస్, మహ్మద్ రఫీ, శరభారెడ్డి,పురుషోత్తంరావు,వీరబాబులు హర్షం వ్యక్తం చేశారు.

## బియ్యం పంపిణీ



**ఆలేరుటౌన్, డిసెంబర్ 29, ప్రభాతవార్త:**
పట్టణ కేంద్రంలో పద్మశాలి చేయూత సభ్యులు శ్రీరాములు రామలింగం గురువారం రోజున కుటుంబాన్ని పరామర్శించి వారి కుటుంబానికి బియ్యం పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో డాక్టర్ చింతకింది మురళి, వంగరి శివకుమార్, చిక్క శ్రవణ్‌కుమార్, డాక్టర్ చింతకింది వెంకటేశ్ పాల్గొన్నారు.

## సీఎం సహాయనిధి చెక్కు అందజేత



**ఆలేరుటౌన్, డిసెంబర్ 29, ప్రభాతవార్త:**
పట్టణ కేంద్రంలో 9వ వార్డుకు చెందిన వస్పరి లింగమ్మకు మున్సిపల్ చైర్మన్ వస్పరి శంకరయ్య ఆధ్వర్యంలో వార్డు కౌన్సిలర్ మోర్చాలా సునీత రమణరెడ్డి అధ్యక్షతన గురువారం రోజున 60000వేల రూపాయలు సీఎం సహాయ నిధి చెక్కును అందజేశారు. ఈకార్యక్రమంలో బీఆర్ఎస్ పట్టణ అధ్యక్షులు పుట్ట మల్లేష్, ఆర్‌టీఏ మెంబర్ పంతం కృష్ణ, పట్టణ ప్రధాన కార్యదర్శి పత్తి వెంకటేశ్, జూకంటి శంకర్, జూకంటి ఉప్పలయ్య, ముద్దికొండ శ్రీకాంత్, వస్పరి రవి, భాస్కర్, శ్రీను పాల్గొన్నారు.

## మృతి చెందిన కుటుంబాన్ని పరామర్శించిన నరసింహారెడ్డి



**పెన్‌పహాడ్, డిసెంబర్ 29, ప్రభాతవార్త:**
మండల పరిధిలోని అనంతారం గ్రామ బీఆర్ఎస్ యువజన నాయకులు గార్లపాటి సైదిరెడ్డి తండ్రి వెంకటరెడ్డి ఇటీవల అనారోగ్యంతో మృతి చెందారు. వారి కుటుంబాన్ని రాష్ట్ర ఉన్నత విద్యాశాఖ మండలి సభ్యులు ఒంటెద్దు నర్సింహారెడ్డి వారి కుటుంబానికి ప్రగాఢ సానుభూతి, వారి ఆత్మకు శాంతి చేకూరాలని వారన్నారు.

## బిఆర్ఎస్ ముఖ్య కార్యకర్తల సమావేశం



**మద్దిరాల, డిసెంబర్ 29, ప్రభాతవార్త:**
మండల కేంద్రంలోని ఎస్సారెస్పీ కాలువలో కాళేశ్వరం నేలకు పూజలు చేసి మండల పార్టీ కార్యాలయంలో మండల ముఖ్యకార్యకర్తల సమావేశం నిర్వహించి రైతులకు రైతుబంధు కాళేశ్వరం నీళ్లు ఇస్తున్నందుకు ముఖ్యమంత్రి కేసీఆర్‌కి మన ప్రియతమ నాయకుడు తుంగతుర్తి శాసనసభ్యులు గాదరి కిషోర్‌కుమార్‌కి మద్దిరాల మండల రైతుల పక్షాన దన్యవాదాలు తెలియజేసిన సూర్యాపేట జిల్లా రైతుబందు సమన్వసమితి కోఆర్డినేటర్ రజాక్ అన్నారు. ఈ కార్యక్రమంలో కన్నా సురాంబా వీరన్నగౌడన, వైస్ ఎంపీపీ బెజ్జంకి శ్రీరాంరెడ్డి, జిల్లా గ్రంథాలయ డైరెక్టర్ దుగ్గాల రవీందర్‌రావు, మండల సర్పంచుల ఫోరం అధ్యక్షులు కొండూరు విష్ణువర్ధన్‌రెడ్డి, ఉప్పలయ్య, మండల సర్పంచులు ఎంపీటీసీలు, అధ్యక్షులు కార్యదర్శులు అధిక సంఖ్యలో నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

# ఆర్డినరీ బస్సులు నడపాలని రాస్తారోకో



**భువనగిరి టౌన్, ప్రభాతవార్త :** భువనగిరి జిల్లా కేంద్రానికి విద్యార్థులు రావడానికి మోత్కూర్ రూట్‌లో ఆర్డినరీ బస్సులు నడపాలని వైఎస్ఆర్ తెలంగాణ పార్టీ జిల్లా అధ్యక్షులు మహమూద్ అతహార్ ఆద్వర్యంలో భువనగిరి బస్టాండ్ వద్ద గురువారం రాస్తారోకో నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ జిల్లా కేంద్రానికి వివిధ మండలాల నుండి, వివిధ గ్రామాల నుండి కాలేజి విద్యార్థులు ఎంతో మంది వస్తారని వారికి సమయానికి బస్సులు లేక తీవ్ర ఇబ్బందులకు గురవుతున్నారని ప్రత్యేక ంగా మోత్కూర్ రూట్ నుండి భువనగిరికి ఆర్డినరీ బస్సులు లేవని, కేవలం ఎక్స్‌ప్రెస్ బస్సులు మాత్రమే ఉండడం వల్ల అందులో బస్‌పాస్ చెల్లడంలేదని ఆవేధన వ్యక్తం చేశారు. గతంలో సూర్యాపేట డిపో ఆర్డినరీ బస్ నడిచేదని కానీ వారు యాదరిగిగుట్ట డిపో బస్‌పాస్ చెల్లదని విద్యార్థులను నానా ఇబ్బందులకు గురిచేసేవారని వాపోయారు. ధర్నా ప్రదేశం నుండి యాదగిరిగుట్ట డిపో మేనేజర్‌కి ఫోన్ చేసి సమస్య గురించి వివరిస్తే బాధ్యతారాహిత్యంగా మాట్లాడుతూ ఆలోచిద్దాం అని సమాధానం ఇవ్వడం తన విధుల పట్ల నిర్లక్ష్యం వహించడమేనని ఆగ్రహం వ్యక్తం చేశారు. విద్యార్థులకు న్యాయం చేయలేని ఆర్టిసి ఉన్నా, లేకున్నా ఒకటే అన్నారు. చివరికి భువనగిరి కంట్రోలర్ వచ్చి వారం సమయం ఇస్తే మోత్కూర్ రూట్‌లో రెండు ఆర్డినరీ బస్సులు నడుపుతామని మాట ఇవ్వడంతో ధర్నాను విరమించుకున్నారు. ఈ కార్యక్రమంలో సుర్వి వెంకటేష్ గౌడ్, కరకాల రమేష్, లింగాచారి, వాహెద్, సాయినివాస్, ఆమెర్, అనీల్, రాఖేష్, సోహైల్, రాధ, వెంకట్, రేవంత్, వివిధ కళాశాలల విద్యార్థులు పాల్గొన్నారు.

# బ్లాస్టింగ్ నియంత్రణ లేదు

**బొమ్మలరామారం, ప్రభాతవార్త :** అక్రమ బ్లాసి ంగ్‌పై నియంత్రణ ఎక్కడా అని ప్రజాసంఘాల నాయకులు ప్రశ్నిస్తున్నారు. మెటల్ క్లాటింగ్‌తో క్రషర్‌లు అడ్డగోలుగా బ్లాస్టింగ్ చేయడం వల్ల దగ్గరలో ఉన్న ఇండ్లు కూలిపోయాయని, పగుళ్లపట్టాయని, గుండెజబ్బులు వచ్చినా వాటిని నియంత్రించే అధికారులు నామమాత్రపు తనిఖీలే తప్ప వారిని నియంత్రించలేకపోతున్నారని ఆవేధన వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా గురువారం ప్రజాసంఘాల నాయకులు మైలారం జంగయ్య మాట్లాడుతూ గత 20 రోజులుగా మైనింగ్ అక్రమాలు మరియు అధిక బ్లాస్టింగ్‌పై పోరాటం చేస్తున్నామని మండలంలో అన్ని క్రషర్‌ల సమీప గ్రామాల్లో నష్టపోయిన ఇండ్లను వారి కుటుంబాలను పరామర్శించి బ్లాస్టింగ్ నియంత్రణ చర్యలకు ఎన్నో ఫిర్యాదులు చేశామని నిత్యం పోరాటం చేస్తునే ఉన్నామని అయినా అటు అధికారులు, ఇటు క్రషర్ యజమానులు నిమ్మకు నిరేత్తినట్లుగా వ్యవహరిస్తున్నారని ఆయన ఆరోపించారు. రూపాయి రూపాయి కూడబెట్టుకుని కూలీ పనులకు వెళ్లి కట్టుకున్న ఇండ్లు అధిక బ్లాస్టింగ్ ద్వారా పగుళ్ల రావడంతో తీవ్ర మనోవ్యాధికి గురవుతున్నారని ఆయన అన్నారు. వెంటనే మండల స్థాయి నుండి నష్టపోయిన ఇండ్లను ఒక కమిటీ ద్వారా అంచనా వ్యయం వేసి క్రషర్‌లపై చర్యలు తీసుకోవాలని బ్లాసి ్టంగ్ నియంత్రణ చేయాలని ఎంఆర్‌ఓ



పద్మసుందరికి వినతిపత్రం అందజేశారు. ఫిర్యాదులు కాగితాలకే పరిమితమవుతున్నాయని నామమాత్రపు తనిఖీలు తప్ప చర్యలు ఎక్కడా కనబడడం లేదని త్వరలోనే తీవ్రంగా ఉద్యమిస్తామని ఆయన హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో వట్టిపల్లి సుధర్శన్, ఊట్ల రమేష్, మైలారం ఆశయ్య, రాంబాబు, సుదర్శన్, నర్సింహ, ప్రదీప్‌కుమార్, మహేష్ తదితరులు పాల్గొన్నారు.

## ప్రగతి భవన్ ముట్టడిని విజయవంతం చేయాలి

**హాలియా, ప్రభాతవార్త. డిసెంబర్ 29:** ఈనెల 31వ తేదీన యూత్ కాంగ్రెస్ అధ్వర్యంలో నిర్వహించే ప్రగతి భవన్ ముట్టడిని విజయవంతం చేయాలని నల్లగండ జిల్లా యూత్ కాంగ్రెస్ అధ్యక్షులు గౌని రాజారమేష్‌యాదవ్ పిలుపునిచ్చారు. గురువారం అయన విలేఖర్లతో మాట్లాడుతూ తెలంగాణ రాష్ట్రంలో జరుగుతున్న పోలీస్ ఎస్.ఐ. కానిస్టేబుల్ నియమకాల్లో హైకోర్టు తీర్పును అమలు చేయాలని, పోలీస్ నియమకాల్లో పాల్గొన్నటువంటి లక్ష పైచిలుకు నిరుద్యోగులకు న్యాయం జరగాలని 31వ తేదీన నిర్వహించే ప్రగతి భవన్ ముట్టడి కార్యక్రామినిక గ్రామ, మండల, జిల్లా యూత్ కాంగ్రెస్ నాయకులు అధిక సంఖ్యలో తరలివచ్చి విజయవంతం చేయాలని కోరారు.

## పాఠశాలలో ప్రహారి గోడ నిర్మాణం



**భువనగిరి టౌన్, డిసెంబర్ 29 ప్రభాతవార్త :** పురపాలక సంఘం చైర్మన్ ఎన్నబోయిన అంజనేయులు, కమీషనర్ నాగిరెడ్డిల సహకారంతో నెం.2 స్కూల్‌లో విద్యార్థుల సౌకర్యార్థం ప్రహరీగోడ, మూత్రశాలల నిర్మాణ పనులు జరుగుతున్నాయని 8వ వార్డు కౌన్సిలర్ పంగారెక్క స్వామి తెలిపారు. గురువారం గాంధీనగర్‌లో జరుగుతున్న నిర్మాణ పనులను స్వామి స్కూల్ ప్రధాన ఉపాద్యాయులు శ్రీదర్‌తో కలిసి పరిశీలించారు. రాష్ట్ర ముఖ్యమంత్రి కెసిఆర్ పేద,బడుగు,బలహీన వర్గాల విద్యార్థులకు మంచి విద్యను అందించాలనే సంకల్పంతో పాఠశాలలో మౌళిక సదుపాయాలు ఏర్పాటుకు నిధులు కేటాయిస్తున్నారని తెలిపారు. ఎంఎల్‌ఏ పైళ్ల శేఖర్‌రెడ్డి ద్వారా నిధులు రాబట్టి పనులు చేయిస్తున్నామన్నారు. ఈ కార్యక్రమంలో కోఆప్షన్ సభ్యులు ఇట్టబోయిన సభిత గోపాల్, వడిచర్ల లక్ష్మీకృష్ణ యాదవ్, ఉపాద్యాయులు, సిబ్బంది పాల్గొన్నారు.

## సైబర్ నేరాలపై అవగాహన కార్యక్రమం



**భువనగిరి టౌన్, డిసెంబర్ 29 ప్రభాతవార్త :** భువనగిరి మండలంలోని హన్మాపుం గ్రామ జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో రాచకొండ కమీషనరేట్ యాదాద్రి భువనగిరి జోన్ జాగృతి కళ బృంధం ఆద్వర్యంలో విద్యార్థులకు మహిళల రక్షణ, సైబర్ నేరాలపై అవగాహన కల్పించారు. సమాజ రక్షణలో పోలీస్ శాఖ బాధ్యతను వివరిస్తూ ఎలాంటి అవసరం వచ్చినా 100కు డయల్ చేయాలని సూచించారు. పాఠశాలలో ఈవ్‌టీజింగ్ చేయరాదని అసభ్యంగా ప్రవిర్తంచరాదని ఎవరైనా అలాంటి చర్యలకు పాల్పడితే వారి పేర్లు తెలపాలని వారి వివరాలు గోప్యంగా ఉంచి, సంబంధిత వ్యక్తులపై కఠిన చర్యలు తీసుకుంటామని తెలిపారు. మహిళల రక్షణ కోసం ప్రత్యేక షీటీం ఉందన్నారు. ఎవరూ భయపడవలసిన అవసరంలేదని అన్నారు. ఈ కార్యక్రమంలో పాఠశాల ప్రధానోపాద్యాయులు సిహెచ్ రంగరాజన్, ఉపాద్యాయులు సంజీవరెడ్డి, ఉపాద్యాయ బృందం, విద్యార్థులు పాల్గొన్నారు.

## 31న ప్రగతిభవన్ ముట్టడి విజయవంతం చేద్దాం : బర్రె నరేష్

**భువనగిరి టౌన్, డిసెంబర్ 29 ప్రభాతవార్త :** ఈ నెల 31న తెలంగాణ యువజన కాంగ్రెస్ ఆద్వర్యంలో పోలీస్ కానిస్టేబుల్, ఎస్సై ఉద్యోగ నోటిఫికేషన్‌లో జరిగిన తప్పులను సవరించాలని నిర్వహిస్తున్న ప్రగతిభవన్ ముట్టడిని నిరుద్యోగ యువత కదలివచ్చి విజయవంతం చేయాలని యువజన కాంగ్రెస్ జిల్లా అద్యక్షులు బర్రె నరేష్ ఒక ప్రకటన ద్వారా పిలుపునిచ్చారు. తెలంగాణ యువతకు మోసపూరిత నియామం వద్దని, ఈ 9 డిమాండ్స్‌ను నెరవేర్చాలని పేర్కొన్నారు. ఈ ముట్టడిలో జిల్లా నుండి నిరుద్యోగ యువత, యువజన కాంగ్రెస్ నాయకులు పెద్దఎత్తున పాల్గొని విజయవంతం చేయాలని తెలిపారు. నిరుద్యోగ యువ సత్తా చూపిద్దాం, మన హక్కులను సాధించుకుందాం అన్నారు.

## అన్ని వర్గాల సంక్షేమానికి ప్రభుత్వం కృషిః ఎమ్మెల్సీ



**హాలియా, ప్రభాతవార్త. డిసెంబర్ 29:** రాష్ట్ర ప్రభుత్వం అన్ని వర్గాల సంక్షేమానికి కృషి చేస్తుందని ఎమ్మెల్సీ ఎంసీ కోటిరెడ్డి అన్నారు. గురువారం అనుముల మండలం మదారిగూడెం గ్రామానికి చెందిన దివ్యాంగుడైన ఇరిగి జానయ్యకు ప్రభుత్వం నుంచి అర్థికంగా బలపడేందుకు మంజూరైన ప్రొత్సాహా చెక్కు 50వేల రూపాయలను అనుముల మండల పరిషత్ కార్యాలయంలో అందజేశారు. ఈసందర్భంగా అయన మాట్లాడుతూ ప్రభుత్వం దివ్యాంగులకు నిరుపేదలకు ఎల్లప్పుడు అండగా ఉండి అర్థికంగా ఎదిగేందుకు ప్రొత్సాహం కలిగిస్తుందన్నారు. కార్యక్రమంలో జెడ్‌పీ వైస్ చైర్మన్ ఇరిగి పెద్దుఉ, ఎంపీపీలు సుమతిపురుషోత్తం, భగవాన్‌నాయక్, మాలే అరుణసత్యనారాయణరెడ్డి, మునాన, కుందారపు సైదులు, పోషం శ్రీనివాస్‌గౌడ్, అబ్దుల్ హలీం, అంజాద్‌ఖాన్, చింతకాలయ పద్మవెంకటేశ్వర్లు, మాతంగి కాశయ్య, షేక్ జలీల్, మక్బూల్, షేక్ జానీ, కొట్టాల శ్రీను, యడవల్లి శోభన్‌బాబు తదితరులు పాల్గొన్నారు.

## గిరిజన సంఘం మండల మహాసభలను జయప్రదం చేయాలి



**హాలియా, ప్రభాతవార్త. డిసెంబర్ 29:** జవనరి 3వ తేదీన అనుముల , తిరుమలగిరి (సాగర్ ), త్రిపురారం తెలంగాణ గిరిజన సంఘం మండలాల నూతన కమిటీ మహాసభలను జయప్రదం చేయాలని సంఘం జిల్లా ప్రధాన కార్యదర్శి కొర్ర శంకర్‌నాయక్ పిలుపునిచ్చారు. గురువారం హాలియాలోని అర్‌అండ్‌బి అతిధి గృహంలో నియోజకవర్గంలోని మండలాల అధ్యక్ష, కార్యదర్శుల సమావేశాన్ని నిర్వహించారు. ఈసందర్భంగా మాట్లాడుతూ గిరిజనుల సమస్యల హామీలను అమలు చేయించేందుకు గ్రామ స్థాయిలో తెలంగాణ గిరిజన సంఘం గ్రామ కమిటీలను పటిష్టంగా ఏర్పాటు చేసుకొని పోరాటం చేయాలని పిలుపునిచ్చారు. అనంతరం దేవరకొండ మాజీ ఎమ్మెల్సీ ధీరావత్ రాగ్యానాయక్ 21వ వర్ధంతి సందర్భంగా అయన చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. కార్యక్రమంలో రమావత్ శ్రీరాములు, అయా మండలాల అధ్యక్షులు అశోక్‌నాయక్, కొర్ర రాజు, బాణావత్ శివ, పానుగోతు రవి, రమావత్ మత్రి, జటావత్ చిట్టి, హరినాయక్, ఈశ్వర్‌నాయక్, కొర్ర రంగానాయక్, సీతారాం, వినాయక్, సతీష్, బాలచందర్, శేఖర్, శ్రీకాంత్, రంగా తదితరులు పాల్గొన్నారు.

## ఘనంగా రాగ్యానాయక్ 21వ వర్ధంతి



**హాలియా, ప్రభాతవార్త. డిసెంబర్ 29:** దేవరకొండ మాజీ శాసన సభ్యులు, గిరిజన ముద్దుబిడ్డ స్వర్గీయ ధీరావత్ రాగ్యానాయక్ 21వ వర్ధంతిని గురువారం హాలియా ప్రధాన సెంటర్‌లో ఏఐబీఎస్ఎస్ అద్వర్యంలో ఘనంగా నిర్వహించారు. ఈసందర్భంగా అయన చిత్రపటానికి పూలమాలలు వేసి ఘనంగా నివాళులర్పించారు. కార్యమ్రంలో ఏఐబీఎస్ఎస్ నియోజకవర్గ అధ్యక్షులు బిక్షనాయక్, రాష్ట్ర వర్కింగ్ ప్రెసిడెంట్ బాబురావునాయక్, భగవాన్‌నాయక్, జిల్లా ఉపాధ్యాక్షులు రవినాయక్, బీజేపీ నియోజకవర్గ ఇన్‌చార్జ్ డాక్టర్ రవికుమార్, శివాజీనాయక్, మోతీలాల్, పాండునాయక్, ప్రసాద్‌నాయక్, రవి, బాలాజీనాయక్, రాము, మునినాయక్; కిషన్‌నాయక్, శంకర్, మంగు, డాకునాయక్, బాలవర్ధిరాజు, చిన్ననాయక్, వెంకటేశ్వర్లు, స్వామి, బాలు, రమేష్ తదితరులు పాల్గొన్నారు.

## మృతుని కుటుంబాన్ని పరామర్శించిన బిఆర్ఎస్ నాయకులు

మాడ్గులపల్లి, డిసెంబర్ 29 ప్రభాతవార్త:



మాడ్గులపల్లి మండలం కుక్కడం గ్రామానికి చెందిన నూకపంగ వెంకయ్య గత కొంత కాలంగా అనారోగ్యంతో బాధపడుతూ మృతి చెందడం జరిగింది. విషయం తెలుసుకున్న మాడ్గులపల్లి మండల బిఆర్ఎస్ పార్టీ అధ్యక్షుడు పాలుట్ల బాబయ్య, మండల సర్పంచ్‌ల ఫోరం అధ్యక్షుడు మారుతి వెంకట్‌రెడ్డి, స్థానిక సర ్పంచ్ అలుగుబెల్లి గోవిందరెడ్డి, మండల పరిషత్ కోఆప ్షన్ సభ్యుడు షేక్ మౌలాలి తదితరులు కుక ్కడం లోని వెంకయ్య పార్థివదేహంపై పూలమాలలు వేసి నివాళులర్పించారు. అనంతరం మృతుని కుమారులు నూకపంగ సోమయ్య, లింగయ్య, రామస్వామి, శ్రీనివాస్‌లతో పాటు కుటుంబ సభ్యులను పరామర్శించారు.

## సేవాలాల్ మహారాజ్ జయంతిని సెలవుదినంగా ప్రకటించాలి

చింతలపాలెం డిసెంబర్ 29 ప్రభాతవార్త



సేవాలాల్ మహరాజ్ జయంతి రోజును రాష్ట్ర ప్రభుత్వం సెలవు దినంగా ప్రకటించాలని లంబాడీ విదా ్యర్థిసేన రాష్ట్ర ఉపాధ్యక్షులు ముడావత్ రవిచంద్ అన్నారు. గురువారం మండల తహసిల్దార్ కారా ్యలయంలో సీనియర్ అసిస్టెం ట్ శ్రీనివాసరావుకు వినతిపత్రం అందజేశారు. ఈ సందర్బంగా మాట్లాడుతూ బంజారా కులదైవం అయిన సేవాలాల్ మహరాజ్ ఎంతో ప్రాముఖ్యత చరిత్ర కలిగినవాడని అన్నారు. అదేవిధంగా గిరిజనులకు గిరిజన బంధు కూ డా ప్రకటించాలని డిమాండ్ చేశారు.

## క్యాలెండర్ ఆవిష్కరణ

ఆత్మకూర్(ఎం), డిసెంబర్ 29 ప్రభాతవార్త :



బీర్ల ఫౌండేష న్ ఆద్వర్యంలో 2023 నూతన సంవత్సర క్యాలెండర్‌ను మండల కేంద్రంలో గురువారం జెడ్పిటిసి కె.నరేందర్‌గుప్త, మండల కాంగ్రెస్ అధ్యక్షులు యాస లక్ష్మారెడ్డిలు ఆవిష్కరించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ఆలేరు నియోజకవర్గంలో బీర్ల ఫౌండేషన్ ద్వారా ఎన్నో సేవా కార్యక్రమాలు నిర్వహిస్తున్నట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో పిఎసిఎస్ చైర్మన్ జిల్లాల వేఖర్‌రెడ్డి, సర్పంచ్‌ల ఫోరం అధ్యక్షులు జన్నయికొడె నగేష్, సర్పంచ్‌లు సుబ్బూరు వెంకటేశం, జామ యాదయ్య, ఎంపిటిసి మర్యాల వెంకటేశ్వర్లు, నాయకులు కొసన కిష్టయ్య, కట్టెకోల హనుమంతు గౌడ్, నాగం లక్ష్మారెడ్డి, బత్తిని ఉప్పలయ్య, ముద్దసాని సిద్దులు, కందడి అనంతరెడ్డి, పోతగాని మల్లేశం, ఎద్దు వెంకన్న, పర్కాల అంజయ్య తదితరులు ఉన్నారు.

## బొడ్రాయి పునఃప్రతిష్టాపనపై సమావేశం

ఆత్మకూర్(ఎం), డిసెంబర్ 29 ప్రభాతవార్త :

మండల కేంద్రంలో బొడ్రాయి పునఃప్రతిష్టాపనపై గ్రామ పెద్దలు, అఖిలపక్ష నాయకులు సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా సర్పంచ్ జె.నగేష్ మాట్లాడుతూ ప్రతీ గడపకు రూ.1000 చొప్పున ఇచ్చి పండుగ నిర్వహణకు ప్రతీ ఒక్కరూ సహకరించాలని కోరారు. ఈ సమావేశంలో అఖిలపక్ష నాయకులు బీసు చందర్‌గౌడ్, యాస లక్ష్మారెడ్డి, ప్రతికంఠం పూర్ణచంరద్ రాజు, గడ్డం దశరథ, డి.నర్సింహచారి, జి.కాశినాద్, వివిద కుల సంఘాల నాయకులు తదితరులు పాల్గొన్నారు.

## దళిత, మహిళ ప్రజాప్రతినిధులకు అవమానించడం హేయమైన చర్య

### -వేములపల్లి ఎంపిపి పుట్టల సునీత

వేముపల్లి, డిసెంబర్ 29 ప్రభాతవార్త:



ప్రభుత్వ ప్రోటోకాల్‌ను తుంగలోకి తొక్కి మిర్యాలగూడ ఎమ్మెల్యే భాస్కర్‌రావు దళిత, మహిళ ప్రజాప్రతినిధులను అవమానించడం హేయమైన చర్య అని వేములపల్లి ఎంపిపి పుట్టల సునీత అన్నారు. మండల కేంద్రంలో ఏర్పాటు చేసిన విలేకర్ల సమావేశంలో వైస్ ఎంపిపి పాదూరి గోవర్ధని, ఎంపిటిసి చలబట్ల చైతన్యలతో కలిసి ఆమె మాట్లాడుతూ గురువారం వేములపల్లి రైతువేదిక ఆవరణలో జిల్లా గ్రామీణాభివృద్ధి సంస్థ మండల సమాఖ్యకు అందించిన వ్యవసాయ పరికరాల పంపిణీ ప్రారంభోత్సవ కార్యక్రమాన్ని ఉదయం 9గంటల నుండి తొమ్మిదన్నర గంటలకు ఉంటుందని అధికారులు తమకు సమాచారం అందించగా ఈ కార్యక్రమంలో పాల్గొనేందుకు ఎంపీపీనైనా తనతో పాటు వైస్ ఎంపిపి పాదూరి గోవర్ధని స్థానిక ఎంపిటిసి చలబట్ల చైతన్యతో కలిసి ముగ్గురం ఉదయం 9గంటలకు రైతు వేదిక వద్దకు చేరుకోవడం జరిగిందన్నారు. సుమారు 8.30గంటల సమయంలో మేము రాకముందే మిర్యాలగూడ ఎమ్మెల్యే భాస్కర్‌రావు అధికార పార్టీ సర్పంచ్‌లను బిఆర్ఎస్ పార్టీ నాయకులను పిలిపించుకుని రిబ్బన్ కట్ చేసి కార్యక్రమాన్ని ముగించి వెళ్లిపోవడం జరిగిందన్నారు. సంబంధిత అధికారులను ఏదేమని అడిగితే సరైన సమాధానం ఇవ్వకపోవడం శోచనీయమన్నారు. ప్రతిపక్ష పార్టీలకు చెందిన దళిత, మహిళ ప్రజాప్రతినిధులను కించపరుస్తూ ప్రోటోకాల్ నిబంధనలను తుంగలో తొక్కడం ఎమ్మెల్యే భాస్కర్‌రావుకు ఎంతవరకు సభభమని ప్రశ్నించారు. అధికార పార్టీ అయి నంత మాత్రాన అహంకారంతో స్థానిక ప్రజాప్రతినిధులకు కనీస గౌరవ మర్యాదలు ఇవ్వకపోవడం అదికార పార్టీ దురాహంకారానికి నిదర్శనమన్నారు. మీరు మాత్రమే కాదు మేము కూడా ప్రజల చేత ఎన్నుకోబడిన ప్రజా ప్రతినిధులమనే విషయాన్ని గుర్తుంచుకోవాలని తెలిపారు. మాటలలో తీయగా నీతి సూక్తులు చెప్పే ఎమ్మెల్యేగా స్థానిక ప్రజాప్రతినిధులు లేకుండా కార్యక్రమం చేయ కూడదని కనీస పరిజ్ఞానం లేదా లేక ఎస్సీ దళిత ఎంపిపి, మహిళలు అనే చిన్న చూపా అని ఆవేదన వ్యక్తం చేశారు. ఈ విషయమై సంబందిత అధికారులు, జిల్లా కలెక్టర్ స్పందించి ప్రోటోకాల్ పాటించకుండా తమను అవమాన పర్చిన వారిపై తగు చర్యలు తీసుకోవాలని కోరారు.

## కార్యకర్తలకు అండగా బిఆర్ఎస్

### -మిర్యాలగూడ ఎమ్మెల్యే నల్లమోతు భాస్కర్‌రావు

మాడ్గులపల్లి, డిసెంబర్ 29 ప్రభాతవార్త:



ముఖ్యమంత్రి కెసిఆర్ నాయకత్వంలో రాష్ట్ర ప్రభుత్వం అమలు చేస్తున్న అభివృద్ధి సంక్షేమ పథకాలకు ఆకర్షితులై భారతీయ రాష్ట్ర సమితిలో చేరిన ప్రతి ఒక్కరికి అన్ని వేళలా అండగా ఉంటానని మిర్యాలగూడ ఎమ్మెల్యే నల్లమోతు భాస్కర్‌రావు అన్నారు. మాడ్గులపల్లి మండలం ఇస్కబావిగూడెం గ్రామానికి చెందిన కాంగ్రెస్ పార్టీ గ్రామశాఖ అధ్యక్షుడు జిన్నె వెంకట్‌రెడ్డి, టిడిపి నాయకుడు పుట్ట శ్రీనివాస్ తదితరులు గురువారం ఎమె ్మల్యే సమక్షంలో బిఆర్ఎస్ పార్టీలో చేరారు. వారికి ఎమ్మెల్యే నల్లమోతు భాస్కర్‌రావు గులాబీ కండువా కప్పి పార్టీలోకి ఆహ్వానించారు. ఎనిమిదేళ్లుగా తెలంగాణలో జరుగుతున్న అభివృద్ధికి ఆకర్షితులై అనేక మంది బిఆర్ఎస్‌లో కొనసాగుతున్నారన్నారు. కొత్తపాత అనే తేడా లేకుండా అందరు కలిసి పనిచేసి పార్టీని బలోపేతం చేసేందుకు కృషి చేయాలని కోరారు. కార్యక్రమంలో జిల్లా పరిషత్ కోఆప్షన్ సభ్యుడు మహ్మద్ మోసిన్ ఆలీ, బిఆర్ఎస్ మండల అధ్యక్షుడు పాలుట్ల బాబయ్య, వేములపల్లి పిఏసిఎస్ చైర్మన్ జెర్రిపోతుల రాములుగౌడ్, సర్పంచ్‌ల ఫోరం మండలాధ్యక్షుడు మారుతి వెంకట్‌రెడ్డి, సర్పంచ్ నిమ్మల గోవిందమ్మ, పోరెడ్డి కోటిరెడ్డి, యాతం లక్ష్మినరేందర్‌రెడ్డి, మేకల లింగమ్మ నాగయ్య, వాంకుడోతు సుధాకర్, ఎంపిటిసిల యాతం కళింగరెడ్డి, కత్తి కనకారెడ్డి, నాయకులు పొనుగోటి చొక్కారావు, కట్టా మల్లేష్‌గౌడ్, అవిరెండ్ల నర్సింహ, గుదే సత్యనారాయణశర్మ, నకిరేకంటి శ్రీను, కూరెళ్ల వెంకటాచారి, గున్‌రెడ్డి గోపాల్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

## మహిళలు ఆర్థిక అభివృద్ధి సాధించాలి

వేములపల్లి, డిసెంబర్ 29 ప్రభాతవార్త:

ప్రభుత్వం అందిస్తున్న పథకాలను సద్వినియోగం చేసుకుని మహిళలు అర్థిక అభివృద్ధి సాధించాలని మిర్యాలగూడ ఎమ్మెల్యే నల్లమోతు భాస్కర్‌రావు అన్నారు. మండల మహిళ సమాఖ్య జిల్లా గ్రామీణాభివృద్ధి సంస్థ అందించిన వ్యవసాయ యంత్ర పరికరముల అద్దె కేంద్రం కస్టమ్ హైరింగ్ సెంటర్‌ను గురువారం ఎమ్మెల్యే నల్లమోతు భాస్కర్‌రావు ప్రారంభించి మాట్లాడారు. ఈ కార్యక్రమంలో జిల్లా కోఆప్షన్ సభ్యులు మోసిన్‌ఆలీ, స్థానిక గ్రామపంచాయతీ సర్పంచ్ చిర్ర మల్లయ్యయాదవ్, ఎంపిడిఓ నరసింహ, ఎంపిఎం అనుక్, గ్రామ పంచాయతీ కార్యదర్శి



గజగంటి శ్రవణ్‌కుమార్, ఇరుగు వెంకటయ్య, పుట్టల భాస్కర్, అమిరెడ్డి శేఖర్‌రెడ్డి, పుట్టల ఫౌల్, ఉప్పల దుర్గారెడ్డి, జడ మట్టయ్యయాదవ్, దైదా జాన్సన్, నాగవెల్లి శంకర్, పగడాల రవి, జిల్లా యాదగిరి, మాతంగి సుదీర్, విజయ్‌కుమార్, పరమేష్, పాల్వాయి, శ్రీను తదితరులు పాల్గొన్నారు.

## టిబి వ్యాధిపట్ల అప్రమత్తంగా ఉండాలి

చింతలపాలెం డిసెంబర్ 29 ప్రభాతవార్త



టిబి వ్యాధి పట్ల ప్రతి ఒక ్కరు అప్రమత్తంగా ఉండాలని టిబి సూపర్‌వైజర్ డిఎంహెచ్‌వో డా.నిరంజన్ తెలిపారు. గురువారం మండలపరిధిలోని కిష్టాపురం గ్రామంలో ఇంటింటి సర్వే నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయనమా ట్లాడుతూ టిబి వ్యాధి ఉన్నట్లుగా అనుమానితులను ఎవరినైనా గుర్తించినట్లయితే వారి తెమడను కోదాడ ప్రభుత్వ ఆస్పత్రికి పరీక్షల నిమిత్తం పంపుతామన్నారు. ఒకవేళ వా ్యధి నిర్ధారణ అయినట్లయితే వారికి ఆరు నెలలపాటు మ ందులు అందించి పోషకాహార నిమిత్తం ప్రతి నెల రూ.500 ప్రభుత్వ సహాయం అందిస్తామన్నారు. టిబి నివారణ కు గ్రామంలోని ప్రతి ఒక్కరు కృషి చేయాలన్నారు. 2025 నాటికి టిబి అంతం కావాలనే ఉద్దేశ్యంతో ఈ సర్వే ని ర్వహిస్తున్నట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో మెడికల్ ఆఫీసర్ ప్రేమ్‌సింగ్, సిహెచ్‌వో కృష్ణయ్య, సూపర్‌వైజర్ రా జ్‌కుమార్, టిబి సూపర్‌వైజర్ బందెల రాములు, ఏఎన్‌ఎంలు గోవిందమ్మ, సుజాత, ఆశ కార్యకర్తలు, వాలంటీర్లు పాల్గొన్నారు.

# హాలియా మార్కెట్ చైర్మన్‌గా జువ్వాజి వెంకటేశ్వర్లు

**- బహుజుల గొంతుకకు దక్కిన గౌరవం**

**- పలువురు పోటీఉ వీడిన ఉత్కంఠ**

*హాలియా, ప్రభాతవార్త. డిసెంబర్ 29:*



హాలియా మార్కెట్ చైర్మన్‌గా బహుజనుల గొంతక జువ్వాజి వెంకటేశ్వర్లును నియమిస్తూ గురువారం మార్కెటింగ్ శాఖ ఉత్తర్వులు జారీ చేసింది. మార్కెటన చైర్మన్ పదవి కోసం వర్రా గంగాభవానివెంకట్‌రెడ్డి, సత్యనారాయణరాజు, కూరాకుల వెంకటేశ్వర్లు, కూరాకుల అంతయ్యయాదవ్ పలువురు పోటీ పడగా ఉత్కంఠకు తెరదించుతూ జువ్వాజి పేరును ఖరారు చేశారు. జువ్వాజి వెంకటేశ్వర్లు 1971 నుంచి 2005 వరకు ఉపాధ్యాయుదిగా, హెడ్ మాస్టర్‌గా, ఎమ్ఈవోగా పని చేసి రాష్ట్ర ఉత్తమ ఉపాధ్యాయ అవార్డు పొంది విద్యారంగానికి విశేష కృషి చేశారు. అనంతరం 2012లో నాగార్జునసాగర్ బీసీ అధ్యక్షుడుగా, బహుజనుల లెఫ్ట్‌ఫంట్ నియోజకవర్గ అధ్యక్షులుగా పని చేశారు. వీరిక నోముల నర్సింహాయ్యతో బాగా సత్స్‌సంబంధాలు కలిగి వారి గెలుపు కసం బహుజనులను చైతన్యం చేస్తూ పని చేశారు. వీరు మున్సిపాల్ కోఅప్షన్ మెంబర్‌గా అశించారు నాడు పరిస్థితుల దృష్ట్యా వీరికి అపదవి దక్కలేదు. అనంతరం 2020లో నిర్వహించిన ఉప ఎన్నికల్లో నోముల భగత్ గెలుపు కోసం నియోజకవర్గంలోని బీసీ సంఘాల ద్వారా బీసీ నినాదాన్ని తీసుకెళ్లి విస్తృత ప్రూచారం నిర్వహించి గెలుపు కోసం కృషి చేశార. ఈసందర్భంగా జువ్వాజి వెంకటేశ్వర్లు మాట్డాఉతూ తొలిదశ తెలంగాణ ఉద్యమంలో విశేషంగా పని చేశానని, విద్యార్థి దశ నుంచే వివిధ సంఘాల్లో నాయకునిగా పని చేసి ప్రత్యక్ష్యంగా పరోక్షంగా పని చేశానని రాంమూర్తియాదవ్, నర్సింహాయ్య, భగత్ గెలుపు కోసం కృషి చేశానని బహుజన నినాదంతో బీఅర్ఎస్ పార్టీ బలోపేతానికి కృషి చేస్తున్నానని, బడుగు, బలహీన వర్గాలకు రాజ్యాధికారం లక్ష్యంగా నమ్మబలికి వారిని చైతన్యం పరుస్తున్నట్లు తెలిపారు. తన నియామకానాకి సహాకరించిన సీఎం కేసీఅర్, మంత్రి కేటీఅర్, ఎమ్మెల్యే భగత్, మంత్రి జగదీశ్వర్‌రెడ్డి, ముఖ్య నాయకులకు కృతజ్ఞతలు తెలిపారు. మార్కెటన వైస్ చైర్మన్‌గా అడెపు రామలింగయ్య, డైరెక్టర్‌గా సపావట్ హరిసింగ్, పగిడిమర్రి మరియమ్మ, ఉడుతూరి శ్రీనివాస్‌రెడ్డి, బూడిద హరికృష్ణ, సురభి రాంబాబు, పొదిల శ్రీనివాస్, రమావత్ రాజేష్‌నాయక్, సయ్యద్ మస్తాన్, పోషం శ్రీనివాస్, జటావత్ చందర్, ముప్పారపు శేఖర్, చిట్టిపోలు వెంకటేశ్వర్లు నియమిస్తూ ఉత్తర్వుల జారీ చేశారు.

# రూ. 2030 కోట్లు దాటిన డీసీసీబీ టర్నోవర్

**పటిష్టమైన అవగాహనతోనే**

**డీసీసీబీల బలోపేతానికి సిఎం కృషి**

*నల్లగొండ టౌన్, డిసెంబర్ 29 ప్రభాతవార్త*




గత మూడేళ్ల క్రితం రూ. 900 కోట్లు ఉన్న డీసీసీబీ వార్షిక ఆదాయం ప్రస్తుతం రూ.2030 కోట్లు దాటిందని డీసీసీబీ చైర్మన్ గొంగిడి మహేందర్‌రెడ్డి అన్నారు. స్థానిక ఇంద్రారెడ్డి ఫంక్షన్ హాల్‌లో నిర్వహించిన ఉమ్మడి నల్లగొండ జిల్లా పీఏసీఎస్, ఎఫ్ఎస్‌సీఎస్ ఎంపా్లయీస్ అసోసియేషన్ ఆత్మీయ సమ్మేళనానికి ఆయన ఎమ్మెల్యే కంచర్ల భూపాల్‌రెడ్డితో కలిసి హాజరై మాట్లాడారు. ప్రభుత్వ ఉద్యోగుల మాదిరిగానే డీసీసీబీ, పీఏసీఎస్‌లలో పనిచేస్తున్న సిబ్బందికి ప్రతి నెలా 5వ తేదీలోగా వేతనాలు అందిసు ్తన్నామని, ఉద్యోగాలలో కూడా 25 శాతం కోటా కల్పించడం జరిగిందన్నారు. 1000 మందికి పైగా విద్యార్థులకు ఎడు ్యకేషన్ లోన్లను సైతం అందించి ఇతర దేశాలకు వెళ్లే అవకాశం కల్పించడం జరిగిందన్నారు. గతంలో డీసీసీబీలు మూతపడే దశ నుండి అభివృద్ధిలోకి తీసుకురావడం జరిగిందని, సీఎం కేసీఆర్ పటిష్టమైన అవగాహనతో డీసీసీబీల బలోపేతానికి కృషి చేస్తున్నారన్నారు. ప్రతి ఒక్కరూ సీఎం కేసీఆర్‌కు రుణపడి ఉండాలని, రానున్న రోజుల్లో ఆయన నాయకత్వాన్ని బలపర్చాలని కోరారు. అనంతరం నూతన సంవత్సర డైరీ, క్యాలెండర్‌ను ఎమ్మెల్యేకు అందజేశారు. ఈ కార్యక్రమంలో మున్సిపల్ చైర్మన్ మందడి సైదిరెడ్డి, పీఏసీఎస్, ఎఫ్ఎస్‌సీఎస్‌ల చైర్మన్లు, బిఆర్ఎస్‌కెవి రాష్ట్ర గౌరవ అధ్యక్షులు రూప్‌సింగ్, రాష్ట్ర అధ్యక్షులు రమేష్‌బాబు, మోహన్‌రావు, జిల్లా అధ్యక్షుడు వెంకటరెడ్డి, కార్యదర్శి ఆంజనేయులు, యాదాద్రి భువనగిరి అధ్యక్షులు శేఖర్‌గౌడ్, కార్యదర్శి రమేష్, సూర్యాపేట జిల్లా అధ్యక్ష, కార్యదర్శులు కృష్ణ, శ్రీనివాసరావు, రాష్ట్ర నాయకులు రాజు, శంకర్, సాయిరెడ్డి, జంగారెడ్డి, మల్లిఖార్జున్ తదితరులు పాల్గొన్నారు.

# గ్రామాలాభివృద్ధియే ప్రభుత్వ ద్యేయం

**-రూ.80లక్షల సిసిరోడ్ల**

**పనులకు శంకుస్థాపన**

*మాడ్గులపల్లి, డిసెంబర్ 29 ప్రభాతవార్త:*





గ్రామాల సమ గ్రాభివృద్ధే ద్యేయం ఆ రాష్ట్ర ప్రభుత్వం ముందుకు సాగుతుందని మిర్యాలగూడ ఎమ్మెల్యే నల్లమోతు భాస ్కర్‌రావు అన్నారు. మాడ్గులపల్లి నల్లమోతు భాస్కర్‌రావు అన్నారు. మాడ్గులపల్లి మండలం కుక్కడం తోపుచర్ల చిరుమర్తి ఇస్కబావిగూడెం గ్రామ పంచాయతీలలో రూ.80లక్షల ఎస్‌డిఎఫ్ నిధులతో చేపట్టనున్న సిసిరోడ్ల పనులకు స్థానిక ప్రజాప్రతినిధులు, అధికారులతో కలిసి ఆయన శంకుస్థాపన చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ తెలంగాణ రాష్ట్ర ప్రభుత ్వం అమలు చేస్తున్న అభివృద్ధి సంక్షేమ పథకాలు దేశానికి ఆదర్శంగా నిలుస్తున్నాయన్నారు. గ్రామల్లో మౌలిక వసతులు కల్పించేందుకు కెసిఆర్ ప్రభుత్వం కృషి చేస్తుందన్నారు. కార్యక్రమంలో జిల్లా పరిషత్ కోఆప్షన్ సభ్యుడు మహామ ్మద్ మోసిన్ ఆలీ, బిఆర్ఎస్ మండలా ధ్యక్షుడు పాలుట్ల బాబయ్య, వేములపల్లి పిఏసిఎస్ చైర ్మన్ జెర్రిపోతుల రాములు గౌడ్, సర్పంచ్‌ల ఫోరం మండలా ధ్యక్షుడు మారుతి వెంకట్ రెడ్డి, సర్పంచ్‌లు అలుగుబెల్లి గోవింద ఒడ్డి, నాంపల్లి శ్రీశైలం, మంగ యాద య్య, నిమ్మల గోవిం దమ్మ, పోరెడ్డి కోటిరెడ్డి, యాతం లక్ష్మినరేందర్‌రెడ్డి, మేకల లింగమ్మ నాగయ్య, వాంకుడోతు సుధాకర్, ఎంపిటిసిలు యాతం కళింగరెడ్డి, కత్తి కనకారెడ్డి, నాయ కులు పోనుగోటి చొక్కారావు, కట్టా మల్లేష్‌గౌడ్, అవిరెండ్ల నర్సింహా, గుదె సత్యనారాయణశర్మ, నకిరే ఒకంటి శ్రీను, కూరెళ్ల వెంకటా చారి, గున్‌రెడ్డి గోపాల్‌రెడ్డి, తదితరులు పాల్గొన్నారు.

# బీఆర్ఎస్ యూత్ మండల ఉపాధ్యక్షుడిగా మహేష్‌గౌడ్ ఎన్నిక

**మండల అధ్యక్షులు మున్న మల్లయ్యయాదవ్**

*నూతనకల్, డిసెంబర్ 29, ప్రభాతవార్త:*



తుంగతుర్తి శాసనసభ్యులు డాక్టర్ గాదరి కిషోర్‌కుమార్ ఆదేశాల మేరకు మండల పరిధిలోని తాళ్లసింగారం గ్రామానికి చెందిన తండు మహేష్‌గౌడ్‌ని బీఆర్ఎస్ మండల యూత్ ఉపాధ్యక్షుడిగా ఏకగ్రీవంగా ఎన్నుకుట్లు బీఆర్ఎస్ పార్టీ మండల అధ్యక్షులు మున్న మల్లయ్యయాదవ్ తెలిపారు. గురువారం మండల కేంద్రంలో ఎన్నికకు సంబందించిన పత్రాన్ని అందజేశారు. ఈ కార్యక్రమంలో ఎంపీపీ భూరెడ్డి కళావతి సంజీవరెడ్డి, జడ్పిఈసీ కందాల దామోదర్‌రెడ్డి, మండల సర్పంచ్ల పోరం అధ్యక్షులు చూడి లింగారెడ్డి, మండల ప్రధాన కార్యదర్శి సాయిల్ గౌడ్ తదితరులు పాల్గొన్నారు.

# వరికి ప్రత్యామ్నాయంగా ఆయిల్‌పామ్ సాగుచేసుకోవాలి

*నాగారం, డిసెంబర్ 29, ప్రభాతవార్త:*



నీటి వసతి ఉన్న రైతులు వరికి ప్రత్యామ్నాయ పంటగా ఆయిల్ పామ్ పంటలను సాగు చేసి అధిక ఆదాయం పొందాలని జిల్లా ఉద్యాన శాఖ అధికారి బెల్లంకొండ శ్రీదర్‌గౌడ్ అన్నారు. గురువారం నాగారం ఆమ్లెట్ గ్రామం పిచ్చిరెడ్డి తండాలో గిరిజన రైతు బానోత్ సుముల నూతనంగా సాగు చేస్తున్న ఆయిల్ పామ్ తోటను పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ నీటి వసతి ఉన్న రైతులు ఆయిల్ పంటను సాగు చేసినట్లయితే తక్కువ సమయంలో అధిక ఆదాయం పొంది ఆర్థికంగా అభివృద్ధి చెందే అవకాశం ఉందని అన్నారు. ఈ కార్యక్రమంలో పట్టుపరిశ్రమ జిల్లా అధికారి ఎస్. వీరకుమార్, తుంగతుర్తి ప్రాంతీయ ఉద్యాన అధికారి వి. స్రవంతి, సూర్యాపేట ప్రాంతీయ ఉద్యాన అధికారి కన్న జగన్ తదితరులు పాల్గొన్నారు.

# మున్సిపల్ కౌన్సిల్ సమావేశం

*ఆలేరుటౌన్, డిసెంబర్ 29, ప్రభాతవార్త:*



ఆలేరు మున్సిపల్ పాలకవర్గ సమావేశం గురువారం సాదాసీదాగా ముగిసింది. మున్సిపల్ చైర్మన్ వస్పరి శంకరయ్య అధ్యక్షతన వహించగా పలు అంశాలపై తీర్మానాలు ప్రవేశపెట్టారు. ఎస్ఎస్టీపి ట్రాన్సిపార్మర్ ఏర్పాటు, డయాలసిస్ సెంటర్ పోస్టాపీస్ వెళ్లే దారిలో మొరం పోయడం, జంగాల కాలనీలో స్ట్రీట్ లైటింగ్ కొరకు బంచ్ కేబుల్, కార్యాలయానికి స్టేషనరీ, ఇతర కొనుగోలు కోసం 8,17,000 రూపాయలను చెల్లించుటకు తీర్మానం చేసి ఆమోదించారు. మున్సిపాలిటిలోని వీదిదీపాలకు అయిన ఖర్చు 1,45,332 రూపాయలు ఈఈఎస్ఎల్ ఎక్కు చెల్లించడానికి పురపాలకవర్గం ఆమోదించారు. పలు వార్డులో అభివృద్ధి కార్యక్రమాలపై చర్చించారు. ఈ కార్యక్రమంలో మున్సిపల్ కమిషనర్ మారుతీ ప్రసాద్, మేనేజర్ శ్రీదర్, కౌన్సిలర్లు జూకంటి శ్రీకాంత్ తదితరులు పాల్గొన్నారు.

# ప్రజాసంఘాల పోరాటాలు కాగితాలకే పరిమితమా

***బొమ్మలరామారం, డిసెంబర్ 29 (ప్రభాతవార్త) :***

అక్రమ బ్లాసి ంగ్‌పై నియంత్రణ ఎక్కడా అని ప్రజాసంఘాల నాయకులు ప్రశ్నిస్తున్నారు. మెటల్ క్లాటింగ్‌తో క్రషర్‌లు అడ్డగోలుగా బ్లాస్టింగ్ చేయడం వల్ల దగ్గరలో ఉన్న ఇండ్లు కూలిపోయాయని, పగుళ్ళుపట్టాయని, గుండెజబ్బులు వచ్చినా వాటిని నియంత్రించే అధికారులు నామమాత్రపు తనిఖీలే తప్ప వారిని నియంత్రించలేకపోతున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా గురువారం ప్రజాసంఘాల నాయకులు మైలారం జంగయ్య మాట్లాడుతూ గత 20 రోజులుగా మైనింగ్ అక్రమాలు మరియు అధిక బ్లాస్టింగ్‌పై పోరాటం చేస్తున్నామని మండలంలో అన్ని క్రషర్ల సమీప గ్రామాల్లో నష్టపోయిన ఇండ్లను వారి కుటుంబాలను పరామర్శించి బ్లాస్టింగ్ నియంత్రణ చర్యలకు ఎన్నో ఫిర్యాదులు చేశామని నిత్యం పోరాటం చేస్తునే ఉన్నామని అయినా అటు అధికారులు, ఇటు క్రషర్ యజమానులు నిమ్మకు నిరేత్తినట్లుగా వ్యవహరిస్తున్నారని ఆయన ఆరోపించారు. రూపాయి రూపాయి కూడబెట్టుకుని కూలీ పనులకు వెళ్లి కట్టుకున్న ఇండ్లు అధిక బ్లాస్టింగ్ ద్వారా పగుళ్లు రావడంతో తీవ్ర మనోవ్యాధికి గురవుతున్నారని ఆయన అన్నారు. వెంటనే మండల స్థాయి నుండి నష్టపోయిన ఇండ్లను ఒక కమిటీ ద్వారా అంచనా వ్యయం వేసి క్రషర్‌లపై చర్యలు తీసుకోవాలని బ్లాసి ్టంగ్ నియంత్రణ చేయాలని ఎంఆర్‌ఓ పద్మసుందరికి వినతిపత్రం అందజేశారు. ఫిర్యాదులు కాగితాలకే పరిమితమవుతున్నాయని నామమాత్రపు తనిఖీలు తప్ప చర్యలు ఎక్కడా కనబడడం లేదని త్వరలోనే తీవ్రంగా ఉద్యమిస్తామని ఆయన హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో వట్టిపల్లి సుధర్శన్, ఊట్ల రమేష్, మైలారం ఆశయ్య, రాంబాబు, సుదర్శన్, నర్సింహ, ప్రదీప్‌కుమార్, మహేష్ తదితరులు పాల్గొన్నారు.

# ఆర్డినరీ బస్సులు నడపాలని రాస్తారోకో

***భువనగిరి టౌన్, డిసెంబర్ 29 (ప్రభాతవార్త) :***

భువనగిరి జిల్లా కేంద్రానికి విద్యార్థులు రావడానికి మోత్కూర్ రూట్‌లో ఆర్డినరీ బస్సులు నడపాలని వైఎస్‌ఆర్ తెలంగాణ పార్టీ జిల్లా అధ్యక్షులు మహమూద్ అతహార్ ఆధ్వర్యంలో భువనగిరి బస్టాండ్ వద్ద గురువారం రాస్తారోకో నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ జిల్లా కేంద్రానికి వివిధ మండలాల నుండి, వివిధ గ్రామాల నుండి కాలేజి విద్యార్థులు ఎంతో మంది వస్తారని వారికి సమయానికి బస్సులు లేక తీవ్ర ఇబ్బందులకు గురవుతున్నారని ప్రత్యేక ంగా మోత్కూర్ రూట్ నుండి భువనగిరికి ఆర్డినరీ బస్సులు లేవని, కేవలం ఎక్స్‌ప్రెస్ బస్సులు మాత్రమే ఉండడం వల్ల అందులో బస్‌పాస్ చెల్లడంలేదని ఆవేదన వ్యక్తం చేశారు. గతంలో సూర్యాపేట డిపో ఆర్డినరీ బస్ నడిచేదని కానీ వారు యాదగిరిగుట్ట డిపో బస్‌పాస్ చెల్లదని విద్యార్థులను నానా ఇబ్బందులకు గురిచేసేవారని వాపోయారు. ధర్నా ప్రదేశం నుండి యాదగిరిగుట్ట డిపో మేనేజర్‌కి ఫోన్ చేసి సమస్య గురించి వివరిస్తే బాధ్యతారాహిత్యంగా మాట్లాడుతూ ఆలోచిద్దాం అని సమాధానం ఇవ్వడం తన విధుల పట్ల నిర్లక్ష్యం వహించడమేనని ఆగ్రహం వ్యక్తం చేశారు. విద్యార్థులకు న్యాయం చేయలేని ఆర్టిసి ఉన్నా, లేకున్నా ఒకటే అన్నారు. చివరికి భువనగిరి కంట్రోలర్ వచ్చి వారం సమయం ఇస్తే మోత్కూర్ రూట్‌లో రెండు ఆర్డినరీ బస్సులు నడుపుతామని మాట ఇవ్వడంతో ధర్నాను




విరమించుకున్నారు. ఈ కార్యక్రమంలో పార్టీ నాయకులు సుర్వి వెంకటేష్ గౌడ్, కరకాల రమేష్, లింగాచారి, వాహెద్, సాయినివాస్, ఆమెర్, అనీల్, రాకేష్, సొహైల్, రాధ, వెంకట్, రేవంత్, వివిధ కళాశాలల విద్యార్థులు పాల్గొన్నారు.

# జర్నలిస్టుల సమస్యల సాధనకు ఐక్యపోరాటాలకు సిద్ధం కావాలి

***రఘునాథపల్లి, డిసెంబరు29 (ప్రభాతవార్త) :***

జర్నలిస్టుల సమస్యల పరిష్కారం కోరుతూ పాత్రికేయులు ఐక్యపోరాటాలకు సిద్ధమవడం జరుగుతుంది. అందులో భాగంగా గురువారం రఘునాథపల్లి మండలంలోని ఏఎస్‌ఆర్ గార్డెన్‌లో స్టేషన్‌ఘన్‌పూర్ నియోజక వర్గంలో అన్ని మండలాల పాత్రికేయులు సమావేశం కావడం జరిగింది. జర్నలిస్టులకు అక్రిడేషన్ కార్డుతో సంబంధం లేకుండా ఇళ్లస్థలాలు కేటా యించి ఇండ్లు నిర్మించుకునేందుకు ప్రభుత్వం ప్రత్యేక జీవో జారీచేసి వెంటనే అమలు చేయాలని డిమాండ్‌చేశారు. ప్రింట్, ఎలక్ట్రానిక్ మీడియాలో పనిచేస్తున్న వర్కింగ్ జర్నలిస్టులు ఎలాంటి జీత భత్యం లేకుండా సమాజహితమే లక్ష్యంగా అనేక కష్టనష్టాలను ఓర్చుకుని ప్రజలకు, ప్రభుత్వానికి మధ్యసమస్యల సాధనకు వారధిగా పనిచేస్తూ నిస్వార్థంగా తమవృత్తి ధర్మాన్ని నిర్వహిస్తున్నారు. అయితే నేటికి ప్రభుత్వాల నుంచి సరైన ఆదరణ, ఆర్థిక చేయూత లభించక అనేక ఇబ్బందులు పడుతున్నామని అన్నారు. తెలంగాణ రాష్ట్ర వ్యాప్తంగా అన్ని జిల్లాలో పనిచేస్తున్న వర్కింగ్ జర్నలిస్టులందరికి ఇళ్లస్థలాలను కేటాయించి ఇండ్లు నిర్మించుకునేందుకు రాష్ట్ర ప్రభుత్వం తక్షణమే జీవో జారీచేసి అమలు చేయాలని డిమాండ్ చేశారు. ఈసందర్భంగా జర్నలిస్టులందరికి ఇళ్ల స్థలాలను కేటాయించి ఇండ్లు నిర్మించుకునేందుకు రాష్ట్ర ప్రభుత్వం తక్షణమే జీవో జారీచేయాలని, జర్నలిస్టులందరికి వారి కుటుంబ సభ్యులతోపాటు ఉచిత కార్పోరేట్‌వైద్యం అందించాలని, జర్నలిస్టుల పిల్లలకు ఉచిత కార్పోరేట్ విద్య అందించాలని డిమాండ్‌చేశారు.

# ఉపాధ్యాయ బదిలీలు ప్రమోషన్‌లు చేపట్టాలి

***మోత్కూర్, డిసెంబర్ 29 (ప్రభాతవార్త) :***

3ప్రభుత్వ ఉపాధ్యాయ బదిలీలు, ప్రమోషన్ల షెడ్యూల్ విడుదల చేయాలని టిఎస్‌యుటిఎఫ్ జిల్లా ఉపాధ్యక్షులు అక్కినపల్లి వెంకటాచారి ప్రభుత్వాన్ని కోరారు. గురువారం మండల కేంద్రంలోని సంఘం ప్రాంతీయ కార్యాలయంలో జరిగిన కార్యక్రమంలో పాల్గొని ఆయన మాట్లాడారు. ఇటీవల రామన్నపేటలో జరిగిన జిల్లా మహాసభలో మోత్కూర్ మండలం నుండి జిల్లా ఉపాధ్యక్షులుగా ఎంపికైన ఏ.వెంకటాచారి, జిల్లా కార్యదర్శి ఏ.మమత, జిల్లా స్టడీ సర్కిల్ కన్వీనర్ టి.ఉప్పలయ్యను మండల శాఖ ఆధ్వర్యంలో సన్మానించారు. ఈ కార్యక్రమంలో మండల అధ్యక్షులు బందారపు దుర్గాప్రసాద్, ప్రధాన కార్యదర్శి ఏ.సత్తయ్య, ఆత్మకూర్,గుండాల మండల శాఖ అధ్యక్షులు దర్శనం వెంకన్న, దోర్నాల వెంకన్న, విశ్రాంతి ఉపాధ్యాయులు జె.సుబ్రమణ్యంశర్మ, డి.నరేష్, డి.నర్సయ్య, బి.బిక్షం, పి.నర్సయ్య తదితరులు పాల్గొన్నారు.




# రైతు గుండెల్లో కేసిఆర్

***మోత్కూర్, డిసెంబర్ 29 (ప్రభాతవార్త) :***

తెలంగాణ రైతులకు పంట సహాయాన్ని అందిస్తూ రైతుగుండెల్లో చిరస్థాయిగా కెసిఆర్ ని లబ దతాదని మోత్కూర్ మా ర్కె ట్ కమిటి చైర్మన్ కొనతం యాకూబ్‌రెడ్డి అన్నారు. శుక్రవారం మోత్కూర్ మార్కెట్ కా ర్యాలయంలో ఏర్పాటు చేసిన విలేకర్ల సమావేశంలో మా ట్లాడుతూ తెలంగాణ రాష్ట్రంలో రై తుబంధును కొనసాగిస్తూ 10వ విడత కింద దాదాపుగా రూ.7700 కోట్లు రైతు ఖాతాలోకి జమచేస్తూ రైతులకు పంట సహాయాన్ని అందిస్తున్న దేశంలోనే



ఏకైక ముఖ్యమంత్రి అని ఆయన అన్నారు. బిఆర్‌ఎస్ పార్టీ ద్వారా ఎన్నో సంక్షేమ పథకాలు చేపడుతూ రాష్ట్రం ముందుకు సాగుతుంటే కేంద్రంలో అధికారంలో ఉన్నవారికి ముఖ్యమంత్రి సంక్షేమపథకాలు కనబడకుండా విమర్శిస్తున్నారని ఆయన ఎద్దేవా చేశారు. కేంద్రంలో పరిపాలిస్తున్న బిజెపి ప్రభుత్వం సంక్షేమ పథకాలు కొనసాగించకుండా ఈడి, ఐటి దాడులు కొనసాగిస్తూ రాజకీయ నాయకులను బయభ్రాంతులకు గురిచేస్తుందని ఆయన అన్నారు. బంగారు తెలంగాణ స్థాపనే ఆయన లక్ష్యంగా ముందుకు సాగుతూ అది సాధ్యమయ్యేంత వరకు నిర్విరామంగా బిఆర్ఎస్ కార్యకర్తలు ఆయన వెంటే ఉనా ్నరని అన్నారు.

## పాఠశాలలో ప్రహరి గోడ నిర్మాణం



***భువనగిరి టౌన్, డిసెంబర్ 29 (ప్రభాతవార్త) :***

పురపాలక సంఘం చైర్మన్ ఎన్నబోయిన అంజనేయులు, కమీషనర్ నాగిరెడ్డిల సహకారంతో నెం.2 స్కూల్‌లో విద్యార్థుల సౌకర్యార్థం ప్రహరీగోడ, మూత్రశాలల నిర్మాణ పనులు జరుగుతున్నాయని 8వ వార్డు కౌన్సిలర్ పంగారెక్క స్వామి తెలిపారు. గురువారం గాంధీనగర్‌లో ప్రభుత్వ పాఠశాలలో జరుగుతున్న నిర్మాణ పనులను 8వ వార్డు కౌన్సిలర్ పంగారెక్క స్వామి స్కూల్ ప్రధాన ఉపాధ్యాయులు శ్రీధర్‌తో కలిసి పరిశీలించారు. ఈ సందర్భంగా స్వామి మాట్లాడుతూ రాష్ట్ర ముఖ్యమంత్రి కెసిఆర్ పేద,బడుగు,బలహీన వర్గాల విద్యార్థులకు మంచి విద్యను అందించాలనే సంకల్పంతో పాఠశాలలో మౌళిక సదుపాయాలు ఏర్పాటుకు నిధులు కేటాయిస్తున్నారని తెలిపారు. ఎంఎల్‌ఏ పైళ్ల శేఖర్‌రెడ్డి ద్వారా నిధులు రాబట్టి పనులు చేయిస్తున్నామన్నారు. ఈ కార్యక్రమంలో కోఆప్షన్ సభ్యులు ఇట్టబోయిన సభిత గోపాల్, వడిచర్ల లక్ష్మీకృష్ణ యాదవ్, ఉపాధ్యాయులు, సిబ్బంది పాల్గొన్నారు.

# ఫుడ్ లైసెన్స్ రిజిస్ట్రేషన్ మేళ

***భువనగిరి టౌన్, డిసెంబర్ 29 (ప్రభాతవార్త) :***

యాదాద్రి భువనగిరి జిల్లా కేంద్రంలోని రైతుబజార్ సోషల్ వెల్ఫేర్ రెసిడెన్షియల్ స్కూల్ గ్రౌండ్స్‌లో ఫుడ్ సేఫ్టీ కమీషనర్ ఆదేశాల మేరకు అసిస్టెంట్ ఫుడ్ కంట్రోలర్ వి.జ్యోతిర్మయి పర్యవేక్షణలో డిసిగ్నేటెడ్ ఆఫీసర్ డాక్టర్ సుమన్‌కళ్యాణ్, జిల్లా ఫుడ్‌సేఫ్టీ అధికారి పి.స్వాతి నిర్వంచిన ఫుడ్ లైసెన్స్ మరియు రిజిస్ట్రేషన్ మేళకు మంచి స్పందన లభించింది. ఈ సందర్భంగా వ్యాపారులు లైసెన్స్ మరియు రిజిస్ట్రేషన్ నమోదు చేసుకున్నారు. లైసెన్స్ పొందిన వ్యాపారులందరూ ఫుడ్‌సేఫ్టీ చట్ట పరిధిలోకి వస్తారని ఎవరైతే ఇప్పటికీ ఫుడ్ లైసెన్స్ లేకుండా వ్యాపారం చేస్తున్నారో తక్షణమే లైసెన్సులు పొంది చట్టబద్ధంగా వ్యాపారాలు కొనసాగించాలని అధికారులు తెలిపారు.

# క్యాలెండ్ ఆవిష్కరణ

**ఆత్మకూర్(ఎం), డిసెంబర్ 29 ప్రభాతవార్త :**
బీర్ల ఫౌండేష న్ ఆధ్వర్యంలో 2023 నూతన సంవత్సర క్యాలెండర్‌ను మండల కేంద్రంలో గురువారం జెడ్పిటిసి కె.నరేందర్‌గుప్త, మండల కాంగ్రెస్ అధ్యక్షులు యాస లక్ష్మారెడ్డిలు ఆవిష్కరించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ఆలేరు నియోజకవర్గంలో బీర్ల ఫౌండేషన్ ద్వారా ఎన్నో సేవా కార్యక్రమాలు నిర్వహిస్తున్నట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో పిఏసిఎస్ చైర్మన్ జిల్లాల వేఖర్‌రెడ్డి, సర్పంచ్‌ల ఫోరం అధ్యక్షులు జన్నయికొడె నగేష్, సర్పంచ్‌లు సుబ్బూరు వెంకటేశం, జామ యాదయ్య, ఎంపిటిసి మర్యాల వెంకటేశ్వర్లు, నాయకులు కొసన కిష్టయ్య, కట్టెకోల



హనుమంతు గౌడ్, నాగం లక్ష్మారెడ్డి, బత్తిని ఉప్పలయ్య, ముద్దసాని సిద్దులు, కందడి అనంతరెడ్డి, పోతగాని మల్లేశం, ఎద్దు వెంకన్న, పర్మాల అంజయ్య తదితరులు ఉన్నారు.

# మండల పంచాయతీ

## కార్యదర్శుల సంఘం ఎన్నిక



**పెద్దవూర, డిసెంబర్ 29 ప్రభాతవార్త:**
పెద్దవూర మండల పరిషత్ కార్యాలయంలో పంచాయతీ కార్యదర్శుల యూనియన్‌ను ఎన్నికోవడం జరిగింది. ఈ ఎన్నికల్లో పి.డాకునాయక్‌ని అధ్యక్షుడిగా, లక్ష్మిని ఉపాధ్యాక్షులుగా, జనరల్ సెక్రటరీ ఎండి ముంతజీర్, సెక్రటరీ శ్యాంసుందర్‌రెడ్డి, ట్రెజరర్ రాధాలను మండలంలోని పంచాయతీ కార్యదర్శులు ఏకగ్రీవంగా ఎన్నుకోవడం జరిగింది. ఈ సంద్భరంగా అధ్యక్షులు డాకునాయక్ మాట్లాడుతూ ఈ ఎన్నికకు సహకరించిన ప్రతి ఒక్కరికి ప్రత్యేక ధన్యవాదాలు తెలిపారు. కార్యదర్శుల సమస్యల పరిష్కారానికి తనవంతుగా కృషి చేస్తానన్నారు.

## బిజెపి నాయకుల దాడిని ఖండించాలి

**చిట్యాల,29డిసెంబర్, ప్రభాతవార్త:**




మునుగోడు నియోజకవర్గ నాంపల్లి మండలం తుంగపాడులో కమ్యూనిస్టులపై బిజెపి నాయకుల భౌతిక దాడులను ఖండించాలని సిపిఐ మండల సహాయ కార్యదర్శి జిల్లా సత్యం అన్నారు. గురువారం పార్టీ పట్టణ కార్యదర్శి ఎస్‌కె. షరీఫ్ ఆధ్యక్షన జరిగిన సమావేశంలో ఆయన మాట్లాడుతూ మునుగోడు ఉప ఎన్నికల్లో అధికార పార్టీ టిఆర్ఎస్‌కు మద్దతు ఇచ్చారని, కోమటిరెడ్డి రాజగోపాల్‌రెడ్డి ఓడిపోవడానికి కమ్యూనిస్టులు కారకులని వారిపై దాడికి పాల్పడుతున్నారని ఆయన అన్నారు. ఈసరవెల్లిలా రంగులు మార్చే వారు వారి అనుచరులతో దాడులు నిర్వహిస్తే ఊరుకునేదిలేదని, గ్రామాలలో తిరగనివ్వమని వారు హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో గీత పనివారల సంఘం చిట్యాల మండల అధ్యక్షులు గుండాల సత్తయ్య, సిపిఐ మాజి పట్టణ కార్యదర్శి బొలుగూరి లింగయ్య, బిసి సంఘం మండల అధ్యక్షులు రావుల చిన్న వెంకన్న, వ్యవసాయ కార్మిక సంఘం నియోజకవర్గ కార్యదర్శి దుబ్బ విగ్నేశ్వర్, తదితరులు పాల్గొన్నారు.

# కొరటికల్ చెరువులోకి నీటిని మళ్లించొద్దు

**చండూరు, 29డిసెంబర్,ప్రభాతవార్త:**
చండూరుమండల పరిధిలోని ఉడతలపల్లి గ్రామ రెవెన్యూ పరిధిలోగల పెద్ద వాగుపై నిర్మించిన చెక్‌డ్యాంనుండి కొరటికల్ పరిధిలోగల జిల్లాయిపేట చెరువులోకి నీటిని మళ్లించవద్దని జిల్లా కలెక్టర్ వినయ్‌కృష్ణారెడ్డికి గురువారం గ్రామ సర్పంచ్ కొరిమి అలివేలు ఓంకారం, ఎంపిటిసి కావలి మంగమ్మమ్మప్రసాద్ గ్రామ పెద్దలతో కలిసి వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ప్రభుత్వం భూగర్భజలాలు పెరగాలని , ఫ్లోరైడ్ శాతం తగ్గించాలనే ఉద్దేశ్యంలో చెక్ డ్యాం నిర్మిస్తే ఆ నీటిని నిల్వ ఉండకుండా ఎమ్మెల్యే కంచర్ల భూపాల్‌రెడ్డి నిటిని మళ్లించడానికి ప్రయత్నంచేస్తున్నారని వినతి పత్రంలో పేర్కొన్నట్టు తెలిపారు. తక్షణమే నీటిని మళ్లించడాన్ని ఆపాలని వారు కలెక్టర్‌ను కోరారు. ఎమ్మెల్యే ,సంబంధిత అధికారులు వెంటనే నీటిమళ్లింపు ఆపాలని, లేని పక్షంలో ధర్నాలు,రాస్తారోకోలు నిర్వహిస్తామని ఈ సందర్భంగా వారు హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో మాజి సర్పంచ్ లక్ష్మయ్య,ఉప సర్పంచ్ తలశయ్య, రమేష్; కృష్ణ, రాజీవ్, అంజయ్య, తదితరులు పాల్గొన్నారు.

# మహాసభలకు తరలిన నాయకులు

**చిట్యాల,29డిసెంబర్, ప్రభాతవార్త:**



ఖమ్మంలో జరుగుతున్న తెలంగాణ వ్యవసాయ కార్మిక సంఘం రాష్ట్ర 3వ మహాసభలకు చిట్యాల మండల నాయకులు బయలుదేరారు. గురువారం ఖమ్మంలో జరుగే బహిరంగ సభకు బయలుదేరుతున్న వారికి సిపిఎం జిల్లా కమిటి సభ్యులు జిట్ట నగేష్ జెండాఊపి ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కేంద్ర ప్రభుత్వ విధానాలవల్ల వ్యవసాయ రంగం సంక్షోభంలో ఉందని, కూలీలకు పని దొరకడంలేదని, ఉపాధిహామి చట్టాన్నినిర్వార్యం చేసేందుకు కుట్రలు చేస్తున్నారని, అధిక నిధులుకేటాయించకుండా నిర్లక్ష్యం వహిస్తున్నారని విమర్శించారు. కేంద్ర రాష్ట్ర ప్రభుత్వాలు అనుసరిస్తున్న విధానాలపై మహాసభ లో ఉద్యమ కార్యాచరణ రూపొందించుకోవడం జరుగుతుందని తెలిపారు. ఈ కార్యక్రమంలో ప్రజా సంఘాల నాయకులు అవిశెట్టి శంకరయ్య,జిట్టా సరోజ,అరూరి శ్రీనివాస్, కత్తుల లింగస్వామి, రుద్రారపు పెద్దులు, మెట్టు పరమేష్, కల్లూరి కుమారస్వామి, మందుల యాదయ్య ,మహేశ్వరం జ్యోతి ,కందుల అనిత, ఆమనగంటి నాగమ్మ పాల్గొన్నారు.

# దళిత జర్నలిస్టులకు దళితబంధు ప్రకటించాలి

**అడ్డగూడూర్, డిసెంబర్ 29 ప్రభాతవార్త :**



దళితుల అభ్యున్నతి కోసం తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా ప్రవేశపెట్టిన సంక్షేమ పథకాల్లో ఒకటైన దళితబంధు పథకాన్ని దళిత జర్నలిస్టులకు వర్తింపజేయాలని మాదిగ జర్నలిస్టు ఫోరం రాష్ట్ర నాయకులు కళాశ్రీ ప్రవీణ్ ఒక ప్రకటనలో తెలిపారు. ఆయా పత్రికా సంస్థల్లో పనిచేస్తూ జీతబత్యాలు లేకుండా కాలం వెల్లదీస్తున్న కళం కార్మికులు వెట్టిచాకిరీ చేస్తున్నారని జర్నలిస్టుల సమస్యల్లో భాగంగా దళిత జర్నలిస్టులకు డబల్‌బెడ్‌రూం ఇండ్లు ఇచ్చి స్వంత ఇంటి కళ నెరవేరేలా ప్రభుత్వం చొరవ తీసుకోవాలని దళితబంధు పథకాన్ని టియుడబ్ల్యూజె ప్రెస్ అకాడమీ చైర్మన్ చెప్పినట్లుగా రాష్ట్రప్రభుత్వం దళిత జర్నలిస్టులకు దళితబంధు ప్రకటించాలని డిమాండ్ చేశారు. ఇటీవల రాష్ట్ర ఆర్థిక మంత్రి తన్నీరు హరీష్‌రావు స్వయంగా దళిత జర్నలిస్టులకు దళితబంధు పథకాన్ని వర్తింపజేయాలని వచ్చిన వార్తను గుర్తుచేశారు. వచ్చేనెల జనవరి 16న నియోజకవర్గ స్థాయిలో దళిత జర్నలిస్టులతో సమావేశాలు నిర్వహించి స్థానిక ఎమ్మెల్యేలకు దళిత జర్నలిస్టుల జాబితాను తెలియజేస్తూ వినతిపత్రం అందజేయనునన్నట్లు తెలిపారు

## ఈనెల 31న ప్రగతిభవన్ ముట్టడి విజయవంతం చేద్దాం : బర్రె నరేష్

**భువనగిరి టౌన్, డిసెంబర్ 29 ప్రభాతవార్త :**



ఈ నెల 31న తెలంగాణ యువజన కాంగ్రెస్ ఆధ్వర్యంలో పోలీస్ కానిస్టేబుల్, ఎస్సై ఉద్యోగ నోటిఫికేషన్‌లో జరిగిన తప్పులను సవరించాలని నిర్వహిస్తున్న ప్రగతిభవన్ ముట్టడిని నిరుద్యోగ యువత కదలివచ్చి విజయవంతం చేయాలని యువజన కాంగ్రెస్ జిల్లా అధ్యక్షులు బర్రె నరేష్ ఒక ప్రకటన ద్వారా పిలుపునిచ్చారు. తెలంగాణ యువతకు మోసపూరిత నియామం వద్దని, ఈ 9 డిమాండ్స్‌ను నెరవేర్చాలని పేర్కొన్నారు. ఈ ముట్టడిలో జిల్లా నుండి నిరుద్యోగ యువత, యువజన కాంగ్రెస్ నాయకులు పెద్దఎత్తున పాల్గొని విజయవంతం చేయాలని తెలిపారు. నిరుద్యోగ యువ సత్తా చూపిద్దాం, మన హక్కులను సాధించుకుందాం అన్నారు.

# కళ్యాణలక్ష్మి చెక్కుల పంపిణి

**ఆత్మకూర్(ఎం), డిసెంబర్ 29 ప్రభాతవార్త :**



మండలంలోని కూరెళ్ల గ్రామంలో నలుగురు లబ్దిదారులకు కళ్యాణలక్ష్మి చెక్కులను గురువారం సర్పంచ్ బాషబోయిన ఉప్పలయ్య, ఆర్ఐ చిప్పలపల్లి యాదగిరిలు లబ్దిదారులకు అందజేశారు. గ్రామానికి చెందిన వేల్పున నాగమ్మ, గంగదారి అయిలమ్మ, అక్షంత ఆయియా, హనుమంతుల చంద్రకళకు రూ.లక్ష 116 చెక్కులను అందజేశారు. ఈ కార్యక్రమంలో ఏఎస్ఓ జయంత్, టిఆర్ఎస్ అధ్యక్షులు ఎర్కల స్వామి, ఉపసర్పంచ్ కొమ్ము నరేష్, అఖిలపక్ష నాయకులు పాల్గొన్నారు.

# ఆదర్శవాది రాగ్యానాయక్

**అడవిదేవులపల్లి,29డిసెంబర్, ప్రభాతవార్త:**
పేద ప్రజలకు అండగా ఉంటూ వారి అభివృద్ధికి కృషి చేసిన గొప్ప మహానుభావుడు, ఆదర్శవాది ధీరావత్ రాగ్యనాయక్ అని మొల్కచెర్ల ప్రాథమికోన్నత పాఠశాల ప్రధానోపాద్యాయులు వి.వెంకట్‌రామ్ అన్నారు. గురువారం మండల పరిధిలోని మొల్కచెర్ల గ్రామ పంచాయితి ప్రాథమికోన్నత పాఠశాలలో ధీరావత్ రాగ్యనాయక్ 29వ వర్ధంతిని పురస్కరించుకుని ఆయన స్వర్గీయ ధీరావత్ రాగ్యనాయక్ చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. అనంతరం విద్యార్థులకు పండు పంపిణి చేశారు. దామరచెర్ల మండలం రాళ్లవాగు తండలో గిరిజన కుటుంబంలో పుట్టి మిర్యాలగూడ సమితి ప్రెసిడెంట్‌గా, జిల్లా కాంగ్రెస్




అధ్యక్షులుగా, దేవరకొండ అసెంబ్లీ నియోజకవర్గ శాసన సభ్యులుగా పదవి బాధ్యతలు నిర్వహిస్తూ పేదప్రజలకు అండగా ఉంటూ వారి అభ్యున్నతికి కృషి చేసిన గొప్ప వ్యక్తి అని ఈ సందర్భంగా వెంకట్రామ్ కొనియాడారు. ఈ కార్యక్రమంలో పాఠశాల ఉపాధ్యాయులు గుర్రం గోపి, రమాదేవి, విజయలక్ష్మి, కృష్ణయ్య, వీరేష్,ప్రదీప్, సునీత, ఏసు పాల్గొన్నారు.

# టాడి కార్పోరేషన్‌ను బలోపేతం చేయాలి

## ప్రిన్సిపల్ సెక్రటరీ వెంకటేశంకు కార్మిక సంఘం వినతి

*చండూరు, 29డిసెంబర్,(ప్రభాతవార్త:*

కల్లుగీత కార్మికులు, యువతీ,యువకులకు ఉపాధి కలిగిలే చర్యలు తీసుకోవాలని,కార్పోరేషన్‌ను బలోపేతం చేయాలని, కల్లుగీత కార్మికుల సమస్యలు పరిష్కరించాలని ఆ సంఘం నాయకులుప్రిన్సిపల్ సెక్రటరీ బుర్రా వెంకటేశంకు గురువారం వినతి పత్రం అందజేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ వృత్తిలో ప్రమాదానికి గురైన439మందికి 75 లక్షలు ఇవ్వడం బాదితలకు ఓదార్పును కలిగించిందని, అదేవిదంగా కార్పోరేషన్‌నుండి రుణ సౌకర్యం కల్పించిఆదుకోవాలని , కల్లుగీత కార్మికులు పిల్లకు గురుకుల రెసిడెన్సియల్‌లో సీట్లుఇవ్వాలని, వైద్య ఖర్చులు, దహన ఖర్చులకు ఇస్తున్న డబ్బులు పెంచాలని, ప్రమాద నివారణ చర్యలుసొసైటీల భూమికి ఫెన్సింగ్, తాటి,ఈత, ఖర్జూర, జీనుగుచెట్లు ఇవ్వాలని, నీటి సౌకర్యం, సొసైటీలవారికి 5ఎకరాల భూమి నిరుద్యోగులకు ఉపాధి తదితర సమస్యలు పరిష్కరించాలని వెంకటేశంకు విన్నవించినట్టు తెలిపారు. ఇందుకు ఆయన సానుకూలంగా స్పందించారని, త్వరలో అమలు అయ్యేలా చర్యలు తీసుకుంటామని ఆయన హామి ఇచ్చారన్నారు. ఈ కార్యక్రమంలో కల్లుగీత కార్మిక సంఘం రాష్ట్ర అధ్యక్ష కార్యదర్శులు యంవి. రమణ, బెల్లంకొండ వెంకటేశ్వర్లు, రాష్ట్ర ఆఫీస్




బేరర్స్ బొలగాని జయరాములు, ఎల్లూరి గోవిందు, వి. వెంకటనరసయ్య, బూడిద గోపి , ఎప్ రమేష్; గౌని వెంకన్న, బాల్నే వెంకటమల్లయ్య బండకింది అరుణ్, గాలి అంజయ్య, పామనుగుల్ల అచ్చాలు, చండూరు కల్లుగీత కారిమక సంఘాల నాయకులు పాల్గొన్నారు.

# నిరుపేద కుటుంబానికి ఆర్థిక సహాయం

## పల్లి రామరాజు యాదవ్



*నల్లగొండ అర్బన్,29డిసెంబర్,(ప్రభాతవార్త:*

నల్లగొండ పట్టణంలోని లైన్‌వాడకి చెందిన నిరుపేద కుటుంబానికి చెందిన నఫీజ్ కూతురు, కుమారుడు అనార్యోగంతో బాధపడుతుండటంతో వారి కుటుంబానికి బారస పార్టీ నల్లగొండ టౌన్ ప్రెసిడెంట్,ఆర్‌కెఎస్ ఫౌండేషన్ చైర్మన్ ,8వవార్డు కౌన్సిలర్ పిల్లి రామరాజు యాదవ్ గురువారం 5వేల రూపాయల ఆర్థిక సహాయం అందజేశారు. ఈ ఎకార్యక్రమంలో మాజి కౌన్సిలర్ ఇంతియాజ్ అలీ,మోహినా, అఖిల్ రైమతుల్లా సయ్యద్,సాదక్ , శేఖర్, మహేష్; మదార్, మజాంబిల్‌ఖాన్, తదితరులు పాల్గొన్నారు. ఘనంగా మండల పూజ మహోత్సవం

# ఘనంగా మండల పూజ మహోత్సవం

*నల్లగొండ కల్చరల్, 29డిసెంబర్,(ప్రభాతవార్త:*



నల్లగొండ పట్టణంలోని మిర్యాలగూడ రోడ్డులోని శ్రీవెంకటరమణ లారీ ట్రాన్స్‌పోర్టు యజమాని కందుల యాదగిరి,నిర్మల ఆధ్వర్యంలో తమ గృహంలో గురువారం ఘనంగా మండల పూజ మహోత్సవ కార్యక్రమం నిర్వహించారు. స్వామివారికి మహాభిషేకం నిర్వహించారు.అనంతరం అన్నదాన కార్యక్రమం చేశారు. ప్రజలు సుభిక్షంగా ఉండాలని మణికంఠస్వామిని వేడుకున్నట్లు వారు తెలిపారు.ఈ కార్యక్రమంలో కందుల బాలరాజు, కందుల వెంకటరమణ, గురుస్వాములు విశ్వప్రసాద్, రాంపర్తి శ్రీను, కంజర శ్రీను, శివ పురోహితులు సురేష్‌శర్మ, శ్రవణ్‌కుమార్‌శర్మ, భక్తులు అధిక సంఖ్యలో పాల్గొన్నారు.

# రాగ్యానాయక్ సేవలు చిరస్మరణీయం

*మిర్యాలగూడ క్రైం,డిసెంబర్ 29 ప్రభాతవార్త*

బడుగు బలహీనవర్గాల అశాజ్యోతి దేవరకొండ మాజీ ఎమ్మెల్యే దీరావత్ రాగ్యానాయక్ 21వ వర్ధంతి వేడుకలు గురువారం ఘనంగా నిర్వహించి అనంతరం రక్తదాన శిబిరాన్ని ఏర్పాటు చేశారు. బస్టాండ్ ఎదుట ఉన్న రాగ్యా విగ్రహానికి తెలంగాణ అగ్రో ఇండస్ట్రీస్ చైర్మన్ తిప్పన విజయసింహారెడ్డి , ట్రైకార్ చైర్మన్ రామచందర్‌నాయక్, రైతుసమితి జిల్లా అధ్యక్షులు చింతరెడ్డి శ్రీనివాస్‌రెడ్డి, మాజీ ఎమెల్సీ భారతీరాగ్యానాయక్, స్కైలాబ్‌నాయక్, చిట్టిబాబు, నాగార్జునచారి, మిర్యాలగూడ మున్సిపల్‌ఫ్లోర్‌లీడర్ బత్తుల లక్ష్మారెడ్డి(బిఎల్‌అర్) పూలమాలలు వేసి నివాళులర్పించారు.అనంతరం ఎంపిటిసిఫోరం జిల్లా కార్యదర్శి బెజ్జం సాయి 15వ సారి రక్తదానం చేశారు. ఈ కార్యక్రమంలో పట్టణ కాంగ్రెస్ అధ్యక్షులు





నూకల వేణుగోపాల్‌రెడ్డి బ్లాక్ కాంగ్రెస్ అధ్యక్షులు పొదిల శ్రీనివాస్, రామకృష్ణ రవినాయక్‌లు పాల్గొనగా కార్యక్రమంలో నాయకులు, కార్యకర్తలు, అభిమానులు తదితరులు పాల్గొన్నారు. త్రిపురారం: దేవరకొండ మాజీ ఎమ్మెల్యే దీరావత్ రాగ్యానాయక్ సేవలు చిరస్మరణీయమని మండల కాంగ్రెస్ అధ్యక్షులు ముడిమాల బుచ్చిరెడ్డి అన్నారు. మండలకేంద్రంలో గురువారం మండల కాంగ్రెస్ పార్టీ అధ్వర్యంలో రాగ్యానాయక్ 21వ వర్ధంతి కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా అయన చిత్రపటానికి పూలమాలలు వేసి ఘనంగా నివాళులర్పించారు. అనంతరం పండ్లు పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో ఎంపిపి అనుముల పాండమ్మ, జడ్పిటిసి భారతి, బ్లాక్‌కాంగ్రెస్ అధ్యక్షులు భాస్కర్‌నాయక్, నాయకులు అనుముల శ్రీనివాస్‌రెడ్డి, సర్పంచ్ ముడిమాల కొండమ్మ, అలంలపల్లి జానయ్య, చిలుముల శ్రీను, హుసేన్, కిషన్‌నాయక్, సైదానాయక్, పద్మ, కృష్ణ, బాలకృష్ణ తదితరులు పాల్గొన్నారు.

# వ్యవసాయానుబంధరంగాలను ప్రోత్సాహించాలి

*త్రిపురారం,డిసెంబర్ 29 ప్రభాతవార్త*

రైతులు మూస వ్యవసాయ పద్ధతులు విడనాడి అందుబాటోల్లో ఉన్న అధునీక సాంకేతికతను వినియోగించుకొని సేంద్రియ సాగు చేపట్టడంతో పాటుఉద్వావన, కూరగాయల సాగు తదితర వ్యవసాయానుబంధరంగాలను ప్రోత్సాహించి అర్థికా సావ్వలంభన సాధించాలని కంపసాగర్ కృషి విజ్ఞాన కేంద్రం సమన్వయకర డాక్టర్ శ్రీనివాస్‌రావు అన్నారు. సేంద్రియ పద్ధతుల్లో స్థానిక కెవికెలో గురువారం రైతులకు అవగాహన కల్పించారు. ఈ కార్యక్రమంలో శాస్త్రవేత్తలు హిమబిందు, పల్లవి, టి.భరత్, స్వాతి రైతులు తదితరులు పాల్గొన్నారు.

# చివరి భూములకు నీరందించాలి

## -కిసాన్‌సెల్ జిల్లా అధ్యక్షులు నర్సిరెడ్డి

*మిర్యాలగూడ క్రైం,డిసెంబర్ 29 ప్రభాతవార్త*

నాగార్జునసాగర్ అయకట్టు పరిధిలో చివరి భూములకు నీరందించాలని కిసాన్‌సెల్ జిల్లా అధ్యక్షులు ముదిరెడ్డి నర్సిరెడ్డి అన్నారు. ఈ మేరకు గురువారం డిసిసి అధ్యక్షులు శంకర్‌నాయక్ అధ్వర్యంలో ఎన్ఎస్‌పి డిఈకి వినతిపత్రాన్ని అందజేశారు. అనంతరం అయన మాట్లాడుతూ వారబందీ పద్ధతిలో జనవరి 2 నుండి సాగర్ కాల్వకు నీటి విడుదల నిలిపి వేస్తున్నారని, దీంతో చివరి భూములకు నీరందక ఎండిపోతాయన్నారు.సాగర్‌అయకట్టు ప్రాంత పొలాలకు జనవరి చివరి వరకు నీటిని అందించి రైతులు నష్టపోయకుండా చూడాలన్నారు. ఈ కార్యక్రమంలో పిసిసి సభ్యులు చిరుమర్రి కృష్ణయ్య, మున్సిపల్‌ఫ్లోర్‌లీడర్ బతుల లక్ష్మారెడ్డి(బిఎల్‌అర్), బ్లాక్‌కాంగ్రెస్ అధ్యక్షులు పొదిల శ్రీనివాస్, బసవయ్య, బెజ్జం సాయి, బక్కారెడ్డి, ఎం.ఎ సలీం, మెరుగు శ్రీనివాస్, కోట శ్రీనివాస్‌రావు, రవినాయక్, నాగునాయక్, ఎండి గౌస్, అరీఫ్ తదితరులు పాల్గొన్నారు.



# షార్ట్ సర్క్యూట్‌తో నగదు, అహార పదార్ధాలు దగ్ధం

*ఐలాపురం(మిర్యాలగూడ రూరల్),డిసెంబర్ 29 ప్రభాతవార్త*

మిర్యాలగూడ మండలం ఐలాపురం గ్రామంలో భాణావత్ నందా, నాగమ్మ దంపతుల నివాసంలో (రేకుల ఇల్లు) గురువారం విద్యుత్ సర్క్యూట్ కారణంగా ఇంట్లో దాచిన నగదుతో పాటు, భూమి పత్రాలు, బియ్యం, ఇతర అహార వస్తువులు దగ్ధమయ్యాయి. బాధితులు నంద తెలిపిన వివరాల ప్రకారం ఇంటికి తాళం వేసి వ్యవసాయ పనుల నిమిత్తం వెళ్లినట్లు తెలిపారు. ఈక్రమంలో ఇంటోల్లో షార్ట్ సర్క్యూట్‌తో సుమారు 4లక్షలకు పైగా నష్టపోయినట్లు తెలిపారు. ప్రభుత్వ అధికారులు తమ పరిస్థితిపై వివరాలు సేకరించి అదుకోవాలని కోరారు.

## విద్యారంగ సమస్యలపై నిరంతరం పోరాటం

### -ఎస్ఎఫ్ఐ జిల్లా కార్యదర్శి శంకర్

మిర్యాలగూడ అర్బన్,డిసెంబర్ 29 ప్రభాతవార్త



ఎస్ఎఫ్ఐ 53వ అవిర్భావ దినోత్సవ వేడుకలు విజయవంతం చేయాలని సంఘం జిల్లా కార్యదర్శి ఖమ్మంపాటి శంకర్ కోరారు. గురువారం మిర్యాలగూడ ప్రభుత్వ జూనియర్ కళాశాలలో నిర్వహించిన సమావేశంలో జిలా అధ్యక్షులు అకారపు నరేష్‌తో కలిసి జెండా ఎగురవేశారు. అనంతరం అయన మాట్లాడుతూ విద్యారంగ సమస్యల పరిష్కారం కోసం దేశవ్యాప్తంగా ఎస్ఎఫ్ఐ పోరాటం చేస్తుందన్నారు. మా దేహం ముక్కలైన ఈ దేశాన్ని ముక్కలుకానివ్వం అన్న దృఢ సంకల్పంతో భారత విద్యార్థి ఫెడరేషన్ ఎస్ఎఫ్ఐ దేశ సమైక్యత కోసం పోరాటం చేస్తుందన్నారు. ఈ కార్యక్రమంలో ఎస్ఎఫ్ఐ డివిజన్ కార్యదర్శి కుర్రా సైదానాయక్, మూడావత్ జగన్, వీరన్న, ఉపేందర్, న్యూమన్ తదితరులు పాల్గొన్నారు.

## లయన్స్‌క్లబ్ అధ్వర్యంలో అస్లాంకు ఘన సన్మానం



మిర్యాలగూడ రూరల్,డిసెంబర్ 29 ప్రభాతవార్త

తెలంగాణ యూనియన్ వర్కింగ్ జర్నలిస్ట్ (టియుడబ్ల్యూజె-హెచ్) నల్లగొండ జిల్లా ప్రధానకార్యదర్శిగా మిర్యాలగూడ పట్టణానికి చెందిన మహమ్మద్ అస్లాం ఎన్నికైన సందర్భంగా గురువారం లైన్స్ క్లబ్ రీజియన్ చైర్మన్ మాశెట్టి శ్రీనివాస్(డైమండ్) అధ్వర్యంలో ముక్కపాటి వెంకటేశ్వర్‌రావు, దివ్యాంగుల ఉద్యోగుల సంక్షేమ సంఘం రాష్ట్ర కార్యదర్శి, యోగా ప్రధానకార్యదర్శి కోలా సైదులుముదిరాజ్, రిటైర్డ్ డిప్యూటీ డిఈఓ మురహరి, ఏచూరి భాగ్యలక్ష్మి, లైన్స్ క్లబ్ బాధ్యులతో కలిసి శాలువాలు కప్పి ఘనంగా సన్మానించారు.

## నిరుపేద కుటుంబానికి ఆర్థిక సహాయం అందజేత



హుజూర్‌నగర్‌రూరల్ డిసెంబర్ 29 ప్రభాతవార్త

మండలంలోని బూరుగడ్డ గ్రామానికి చెందిన గడ్డం పద్మ ఇటీవల అనారోగ్యంతో మృతి చెందారు. వారి కుటుంబానికి దశ దిన కర్మ సందర్భంగా రూ.50 కేజీల బియ్యం సర్పంచ్ షేక్ సలీమారంజాన్ అందజేశారు. ఈ సందర్భంగా సర్పంచ్ మాట్లాడుతూ ఉన్నంతలో సహాయం చేయడం చాలా సంతోషంగా ఉందని, ఇంతకు ముందు కూడా పలు సేవా కార్యక్రమాలు చేశానని, ఇక ముందు కూడా చేసే పనులు మంచివైపు ఉంటాయని, ఊరిలో ఎవరికి ఏ ఆపద వచ్చినా సర్పంచ్‌గా తాను ఎప్పుడు ముందుంటానని, ఈ పదవులు శాశ్వతం కాదని, ఎవరేమనుకున్నా గ్రామ అభివృద్ధి వైపు తమ లక్ష్యమని తెలిపారు. ఈ కార్యక్రమంలో ఉప సర్పంచ్ శీలం ఆదెమ్మ, గండు సైదులు, అలీపాషా, ఆవుల వెంకటయ్య, మల్లయ్య, చింతలచెరువు ఉపేందర్, గడ్డం లక్ష్మణ్, గడ్డం నర్సింహారావు, రాజుల మట్టపల్లి, జాడ రాఘవులు పాల్గొన్నారు.

# యువత స్వశక్తితో ఎదగాలి

### - ఐడియా షోరూంను ప్రారంభించిన ఎమ్మెల్యే

చింతపల్లి డిసెంబర్ 29 ప్రభాతవార్త

చింతపల్లి మండల పరిధిలోని మాల్ వెంకటేశ్వరనగర్‌లో గురువారం నూతనంగా ఏర్పాటు చేసిన ఐడియాషోరూంను ఎమ్మెల్యే రమావత్ రవీందర్‌కుమార్ ప్రారంభించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూయువత ప్రభుఉద్యోగాలే కాకుండా స్వశక్తితో ఎదగాలని వారు ఆకాంక్షించారు. అదేవిధంగా తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం యువత కోసం ఎన్నో సంక్షేమ పథకాలు ప్రవేశపెడుతుందని, వాటిని ఎస్సీ, ఎస్టీ, బీసీ మైనార్టీ వర్గాల వారికి ప్రభుత్వం అన్ని విధాలుగా వారికి అండగా ఉంటుందన్నారు. యువత తాను చేపట్టే పని కష్టమర్లతో మమేకమై స్వయం సమృద్ధి కోసం కృషి చేయాలన్నారు. ఈ సందర్భంగా నూతన ఐడియా షోరూంను రిబ్బన్ కట్ చేసి ప్రారంభించారు. ఈ కార్యక్రమంలో టిఆర్ఎస్ రాష్ట్ర నాయకులు కంకణాల వెంకటరెడ్డి, డి.శేఖర్‌రెడ్డి, షాప్ యజమాని నర్సింహగౌడ్, వి.సాగర్‌రావు, దళిత బంధు జిల్లా కమిటి సభ్యులు మాసా భాస్కర్, ఎ.నర్సింహ, కొండూరు శ్రీనివాస్, లక్ష్మణ్, గొడకొండ్ల ఉప సర్పంచ్ కట్కూరి నారాయణగౌడ్, గోపి, గణేష్, కొప్పు రాముగౌడ్, జిట్ట జగదీష్ ఆర్.వేణు తదితరులు పాల్గొన్నారు.



# ఘనంగా అయ్యప్ప మహా పడిపూజ

### - పలువురు ప్రముఖులు హాజరు
### - చైర్మన్ పగడాల ముత్తు

చింతపల్లి డిసెంబర్ 29 ప్రభాతవార్త

చింతపల్లి మండలపరిధిలోని పోలేపల్లి రాంనగర్‌కు చెందిన తన నూతన గృహంలో గురువారం 18 మెట్ల మహా పడి పూజ కార్యక్రమాన్ని అత్యంత వైభవోపేతంగా కన్నుల పండువగా గురుస్వామి నిర్వహించారు. బాస లక్ష్మణ్ గురుస్వామి ఈ సందర్భంగా ఈ మహాపడి పూజ కార్యక్రమానికి వందలాది మంది అయ్యప్ప స్వాములు హాజరై మహా పడిపూజ కార్యక్రమంలో పాల్గొన్నారు. ఈ సందర్భంగా భక్తులు ఆలపించిన అయ్యప్ప భక్తి పాటలు ఎంతగానో ఆకట్టుకున్నాయి. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా శ్రీపగడాల కనకయ్య ఫౌండేషన్ చైర్మన్ పగడాల ముత్తు కుటుంబసభ్యులు, సొసైటి సభ్యులు హాజరై పూజా కార్యక్రమాలు నిర్వహించారు. ఈ కార్యక్రమంలో వేదపండితులు, గురుస్వాములు మట్ట యాదయ్య, బాస లక్ష్మణ్ గురుస్వామి, జగతయ్య గురుస్వామి, ఫణిగిరి గోవర్ధన్ గురుస్వామి, ఫణిగిరి సుధాకర్ గురుస్వామి, కేశగోని పరమేష్ గురుస్వామితోపాటుపలువురు గురుస్వాములు, సొసైటీ వైస్ చైర్‌పర్సన్ శిరీష, పాపయ్య, కిషన్ తదితరులు పాల్గొన్నారు.



# రోడ్డు ప్రమాదానికి గురైన బాధిత కుటుంబానికి ఆర్థిక సహాయం

చింతపల్లి డిసెంబర్ 29 ప్రభాతవార్త

చింతపల్లి మండలకేంద్రానికి చెందిన రవి ఇటీవల రోడ్డు ప్రమాదానికి గురై కాలు విరిగింది. దీంతో రవి పరిస్థితి అధ్వాన్నంగా ఉండటంతో విషయాన్ని తెలుసుకున్న పగడాల కనకయ్య ఫౌండేషన్ చైర్మన్ పగడాల ముత్తు వారి కుటుబానికి రూ.10వేల ఆర్థిక సహాయాన్ని అందజేశారు. అదేవిధంగా చింతపల్లి మండలపరిధిలోని తీదేడు గ్రామానికి చెందిన సందె మారయ్య గత కొంత కాలంగా అనారోగ్యానికి గురై హైద్రాబాద్‌లో భిక్షాటన చేసి మృతి చెందాడు. దీంతో ఈ విషయం తెలుసుకున్న పగడాల ముత్తు అంత్యక్రియల కోసం రూ.10వేలను గురువారం ఆకుటుంబాలకు అందజేశారు. తాను కష్టపడి సంపాదించే డబ్బుతో ఇతరులకు ఆర్థిక సహాయం తమ తండ్రి పేరు మీద ఈ సహాయాన్ని అందిస్తున్నాని ఆయన పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో వైస్ చైర్‌పర్సన్ శిరీష, ప్రవీణ్‌రెడ్డి, కిషన్, గణేష్, పాపయ్య, లక్ష్మణ్, జగదీష్, వినోద్‌గడ్, తదితరులున్నారు.



# పరిశ్రమ పరిధిలోని గ్రామాల అభివృద్ధికి నిరంతరం కృషి

మట్టంపల్లి డిసెంబర్ 29 ప్రభాతవార్త

పరిశ్రమ పరిధిలోని గ్రామాల అభివృద్ధికి మై హోం సిమెంట్ పరిశ్రమ యాజమాన్యం ఎప్పుడు ముందుంటుందని పరిశ్రమ యూనిట్ హెడ్ శ్రీనివాసరావు అన్నారు. గురువారం మండలంలోని చౌటపల్లి గ్రామంలో సిసి రోడ్డు నిర్మాణం కోసం గ్రామ సర్పంచ్ కృష్ణవేణి నరేష్‌లకు రూ.20లక్షల చెక్కును అందజేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ పరిశ్రమ పరిధిలోని గ్రామాలలో మౌలిక సదుపాయాల కల్పన కోసం పరిశ్రమ ఎప్పుడు ముందుంటుందని గతంలో పరిశ్రమ పరిధిలోని గ్రామాలకు మౌలిక సదుపాయాల కోసం అనేక సార్లు నిధులు ఇవ్వడం జరిగిందని వారన్నారు. పంచాయితీ సెక్రటరీ కవిత, పరిశ్రమ జిఎం నాగేశ్వరరావు, ఏజిఎంశ్రీనివాసరావు, గ్రామప్రజలు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.



## నిధుల దుర్వినియోగంపై మత్స్యశాఖ అధికారులు చర్యలు తీసుకోవాలి

డిండి, డిసెంబర్ 29 ప్రభాతవార్త

డిండి మండలంలోని ఎర్రగుంటపల్లి సొసైటీ పరిధిలోని తవక్లాపూర్ గ్రామపంచాయతీలోని కొత్తతండా దగ్గరలోని పెద్దచెరువుకు మంజూరైన ఉచిత చేపపిల్లలపై విచారణ నిర్వహించాలని సమాచార హక్కు ప్రచారసమితి రాష్ట్ర అధ్యక్షులు కొర్ర కిషన్‌నాయక్ డిమాండ్ చేశారు. ఈసందర్భంగా కిషన్‌నాయక్ మాట్లాడుతూ గత సెప్టెంబర్‌లో సొసైటీకి లక్షా 70వేల చేపపిల్లలు రాగా సొసైటీ చైర్మన్, మత్స్యశాఖ అధికారి ఇరువురి కుమ్మక్కై అధికార దురి ్వనియోగానికి పాల్పడ్డారని ఆరోపించారు. వచ్చిన నిధులను ఇరువురి కలిసి దుర్వినియోగపర్చారన్నారు. ఇప్పటికైనా జిల్లా మత్స్యశాఖ అధికారి దీనిపై విచారణ నిర్వహించి తగు చర్యలు తీసుకోవాలని కిషన్‌నాయక్ విజ్ఞప్తి చేశారు.

## 31న జరిగే ప్రగతిభవన్ ముట్టడిని విజయవంతం చేయాలి

### డిండిలో యూత్ కాంగ్రెస్ జిల్లా నాయకులు

డిండి, డిసెంబర్ 29 ప్రభాతవార్త



పోలీస్ రిక్రూట్‌మెంట్ బోర్డ్ చేసిన తప్పిదాలను నిరసిస్తూ ఈనెల 31 న తెలంగాణ రాష్ట్ర యువజన కాంగ్రెస్‌పార్టీ అధ్యక్షులు శివసేనరెడ్డి ఆధ్వర్యంలో చేపట్టే ప్రగతి భవన్ ముట్టడి కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని యూత్ కాంగ్రెస్ రాష్ట్ర కార్యదర్శి జరుపుల లక్ష్మీతిరుపతి నాయక్, యువజన కాంగ్రెస్ దేవరకొండ నియోజకవర్గ అధ్యక్షుడు కిన్నెర హరికృష్ణ, రాష్ట్ర కార్యదర్శి కొర్ర రాంసింగ్‌నాయక్‌లు ఎ లువునిచ్చారు. ఈ మేరకు గురువారం డిండిలో జరిగిన యువజన కాంగ్రెస్ సమావేశంలో పాల్గొని మాట్లాడారు. ఈసందర్భంగా వారు మాట్లాడుతూ పోలీస్‌కానిస్టేబుల్, ఎస్‌ఐ అభ్యర్థులకు న్యాయం చేయలని డిమాండ్ చేశారు. ఈకార్యక్రమంలో జిల్లా ప్రధాన కార్యదర్శి ఉమర్‌ఖాసీం, నియోజకవర్గ ప్రధానకార్యదర్శులు వి విఆర్.రమ్మీనాయక్, ఇంతియాజ్, యూత్ కాంగ్రెస్ నేతలు మహేందర్, కార్తీక్, మంగ్యానాయక్, ముకురోజు రాజు, సాయి రాథోడ్, దుబ్బా చరణ్, పొట్ట ప్రవీణ్, పవన్, సన్నీ, ప్రసాద్, ఆనంద్, శివ, అజయ్, బాలు, కిషన్, మధు ,రవి, సతీష్ తదితరులు పాల్గొన్నారు.

## సమాచారహక్కు చట్టంపై అవగాహన

నల్లగొండప్రతినిధి,29డిసెంబర్, ప్రభాతవార్త:

మహాత్మాగాంధీ యూనివర్సిటీలో సమాచార హక్కు చట్టంపై నేడు ఒకరోజు వర్క్‌షాపు నిర్వహిస్తున్నట్టు ఆచార్య అల్వాల రవి ఒక ప్రకటనలో తెలిపారు. ఉదయం 11గంటలకుఆర్ట్స్ కళాశాల సెమినార్ హాల్‌లో జరుగనున్న ఈ కార్యక్రమానికి రాష్ట్ర సమాచార హక్కు కమీషనర్ గంగులోతు శంకర్‌నాయక్ ముఖ్య అతిథిగా విచ్చేసి కీలకోపాన్యాసం చేయనున్నట్టు , విశిష్ట అతిథిగా ఉస్మానియా లా కళాశాల విభాగాధిపతి ఆచార్య ఎన్ వెంకటేశ్వర్లు హాజరుకానున్నట్లు తెలిపారు.

## సిరిసిల్ల రాజేశ్వరికి కొవ్వొత్తులతో అశ్రునివాళి

జనగామ టౌన్, డిసెంబరు29 ప్రభాతవార్త :

జనగామ రచయితల సంఘం ఆధ్వర్యంలో ఇటీవల మృతిచెందిన బాల కవయిత్రి సిరిసిల్ల రాజేశ్వరికి గురువారం అంబేద్కర్ విగ్రహం ముందు కొవ్వొత్తులతో అశ్రునివాళి ఘటించారు. ఈసందర్భంగా పలువురు మాట్లాడుతూ సుద్దాల హనుమంతు జాతీయ అవార్డు గ్రహీత బాలకవయిత్రి చిన్నారి సిరిసిల్ల రాజేశ్వరి అస్తమయంతో మానవతా సాహితీలోకం చిన్నబోయిందని అన్నారు. చెదరని ఆత్మవిశ్వాసం ఆమె కవిత్వం సృజించారని అన్నారు. నిరుపేద చేనేత కుటుంబంలో జన్మించిన రాజేశ్వరి జీవితాన్ని వైకల్యం చిన్నాభిన్నం చేసిందన్నారు. ఎక్కడా చెదరని గుండెనిబ్బరంతో కాళ్లను, చేతులుగా మలుచుకుని తన ఆత్మవిశ్వాసాన్ని అక్షరాలుగా నిలబెట్టి ఎన్నో కవితలు రాశారన్నారు. సంకల్పం ముందు వైకల్యం ఎంత.. దృఢచిత్తం ముందు దుర్భష్టం ఎంత.. ఎదురీత ముందు విధిరాత ఎంత.. పోరాటం ముందు ఆరాటం ఎంత.. రాజేశ్వరి రాసిన కవితను గమనిస్తే ఆమె అక్షరాల పనుదు అర్థమవుతుందన్నారు.

## కేరళ సిఎం పినరయ్ విజయన్‌కు జిల్లా ఎస్పీ ఘనస్వాగతం

నల్లగొండ కలెక్టరేట్, డిసెంబర్ 29 ప్రభాతవార్త



తెలంగాణలోని ఖమ్మంలో జరుగుతున్న వ్యవసాయ కార్మిక సంఘం రాష్ట్ర మహాసభకు రోడ్డు మార్గంలో వెళుతున్న కేరళ రాష్ట్ర ముఖ్యమ ంత్రి పినరాయ్ విజయన్ మార్గమధ్యలో నార్కెట్పల్లిలోని ఓసీటీఎల్ అతిథి గృహంలో కాసేపు ఆగారు. ఈ సందర్భంగా సీఎం విజయన్‌కు జిల్లా ఎస్పీ రేమారాజేశ్వరి, నల్గొండ ఆర్డీవో జయచంద్రరెడ్డి పుష్ప గుచ్ఛం అందజేసి స్వాగతం పలికారు. అనంతరం పోలీసుల గౌరవ వందనం స్వీకరించారు.

## మూఢనమ్మకాలపై ఇంద్రజాల ప్రదర్శన

కట్టంగూర్, డిసెంబర్ 29 ప్రభాతవార్త



గ్రామీణ ప్రజల్లో మూఢనమ్మకాలను తొలగించేందుకు, విద్యార్థులకు చదువుపట్ల ఆసక్తి కల్గించేందుకు ఇంద్రజాల ప్రదర్శన ద్వారా కృషిచేస్తున్నానని ఇంద్రజాలకుడు జి.రామకృష్ణ అన్నారు. గురువారం మండలకేంద్రంలోని వైవీఆర్ ఫంక్షన్ హాల్లో కట్టంగూరుకు చెందిన సాందీపని, గీతాంజలి, ఎస్ఎస్‌విఎస్ పాఠశాల విద్యార్థులకు తన ఇంద్రజాల ప్రదర్శనతో విద్యార్థులను అబ్బుర పరిచాడు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ తాను నేర్చుకున్న విద్యను పలువురికి పంచుతూ ప్రజలను చైతన్య వంతులను చేసేందుకు తన వంతు కృషిచేస్తానని తెలిపారు. ఈ కార్యక్రమంలో ఆయా పాఠశాలల హెచ్‌ఎంలు పోగుల రాములుగౌడ్, వెంకటేశ్, సరిత, ఉపాధ్యాయులు యాదగిరి, సంపత్, ప్రసాద్, పద్మ, ప్రశాంతి, భువనేశ్వరి, రాధ, ఉమ, పవిత్ర, మహేశ్వరి, సబిత, మమత, నాగమణి, పద్మ, రేణుక, మంగ, అనిత, స్వాతి ఉన్నారు.

## ఉపాధిహామీపై ముగిసిన ప్రజావేదిక

డిండి, డిసెంబర్ 29 ప్రభాతవార్త



మండలకేంద్రంలోని ఎంపీడీవో కార్యాలయం నందు గురువారం ఉపాధిహామీ పనులపై ప్రజా వేదికను నిర్వహించారు. ఈసందర్భంగా అదనపు ప్రాజెక్టు అధికారి జి.బి.శైలజ వివరాల వెల్లడిస్తూ మండలవ్యాప్తంగా 3136 జరిగినటువంటి పనులు వాటికి గాను ఖర్చు రూ.13 కోట్ల 38 లక్షల 67 వేల 868,మెటీరియల్ ఖర్చుకు రూ.4 కోట్ల 21 లక్ష 00 997లు మొత్తం రూ.17 కోట్ల 59 లక్షల 68 వేల 867 సుమారుగా 12 లక్షల 60 వేల వరకు వివిధ పనుల కింద రికవరీ గుర్తించామన్నారు. టెక్నికల్ అసిస్టెంట్లు, పంచాయతీ కార్యదర్శులు, ఫీల్డ్ అసిస్టెంట్లు కంప్యూటర్ ఆపరేటర్లకు పనితీరును బట్టి పనిష్మెంట్ రూపంలో రికవరీసు విధించడం జరిగిందన్నారు. ఈకార్యక్రమంలో ఈజీఎస్ విజిలెన్స్ ఆఫీసర్ నిరంజన్, స్టేట్ రిసోర్స్ పర్సన్ రమేష్, ఎంపీపీ మాధవరం సునీత జనార్దన్‌రావు, ఎంపిటిఓగిరిబాబు, ఏపీవో జయరాజు, టెక్నికల్ అసిస్టెంట్స్, ఫీల్డ్ అసిస్టెంట్స్, పంచాయతీ కార్యదర్శులు, కంప్యూటర్ ఆపరేటర్లు, సోషల్ ఆడిట్ సిబ్బంది పాల్గొన్నారు.

## ఘనంగా నృసింహుని నిత్య కళ్యాణం



మట్టంపల్లి డిసెంబర్ 29 ప్రభాతవార్త

ప్రసిద్ధ పుణ్యక్షేత్రమైన మట్టపల్లి లక్ష్మీనరసింహస్వామి క్షేత్రంలోని శ్రీరాజ్యలక్ష్మి చెంచులక్ష్మి సమేత శ్రీలక్ష్మీనరసింహస్వామి నిత్య కళ్యాణంను అర్చకులు శాస్త్రోక్తంగా నిర్వహించారు. ఈ సందర్భంగా ఆలయంలో ప్రత్యేక పూజలు ని ర్వహించి కళ్యాణతంతు కార్యక్రమాన్ని వందలాది మంది భక్తుల నడుమ అర్చకులు శాస్త్రోక్తంగా నిర్వహించారు. ఈ సందర్భంగా భక్తులు కళ్యాణాన్ని తిలకించి పూజా కార్యక్రమాలలోపాల్గొని స్వామివారిని దర్శించుకొని తరించారు. ఈ కార్యక్రమంలో ఆలయ అనువంశిక ధర్మకర్తలు చెన్నూరు విజయ్‌కుమార్, మట ్టపల్లిరావు, కార్య నిర్వహణ అధి కారి సిరికొండ నవీన్, అర్చకులు రామాచార్యులు, పద్మనాభాచార్యులు, బదరీనారాయణచార్యులు, లక్ష్మీనర్సి ంహమూ ర్తి, ఆంజనేయాచార్యులు, భక్తులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.

## ఉచిత వైద్య శిబిరాలు ఏర్పాటు చేయడం అభినందనీయం

చిట్యాల రూరల్, డిసెంబర్ 29 ప్రభాతవార్త



గ్రామీణ ప్రాంతాల్లో ఉచిత వైద్య శిబిరాలను ఏర్పాటు చేసి పేద ప్రజలకు వైద్య పరీక్షలు నిర్వహించి ఆరోగ్య సూచనలు చేయడం అభినందనీయమని సర్పంచ్ ఆరూరి లాలమ్మ స్వామి అన్నారు. మండలంలోని ఆరెగూడెంలో గురువారం జీఎంఆర్ వరలక్ష్మి ఫౌండేషన్ ఆధ్వర్యంలో హైద్రాబాద్ సన్‌రైజ్ ఆసుపత్రి సౌజన్యంతో ఏర్పాటు చేసిన ఉచిత వైద్య శిబిరాన్ని ఆమె ప్రారంభించారు. ఈ శిబిరంలో సుమారు 150 మంది గ్రామస్తులకు వైద్య పరీక్షలు నిర్వహించి ఉచితంగా మందులు అందజేశారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ ప్రతి ఒక్కరూ ఆరోగ్యం పట్ల జాగ్రత్తలు తీసుకోవాలని సూచించారు. ఉచిత వైద్య శిబిరాలను ప్రతి ఒక్కరు సద్వినియోగం చేసుకోవాలన్నారు. జీఎంఆర్ వరలక్ష్మి ఫౌండేషన్ చేస్తు ్న సేవల పట్ల ఆమె సంతోషం వ్యక్తం చేశారు. ఈ కార్యక్రమంలో ఉప సర్పంచ్ విజయలక్ష్మి, డాక్టర్ ప్రవీణ్‌రెడ్డి, సాంబశివరావు, జీఎంఆర్ ప్రతినిధి గోర ంట్ల శ్రీనివాస్, నిర్వాహణాధికారులు సంతోష్, భానుప్రసాద్, రామకృష్ణ పాల్గొన్నారు.

## మృతుని కుటుంబానికి ఆర్థిక సహాయం అందజేత

చిట్యాల రూరల్, డిసెంబర్ 29 ప్రభాతవార్త



మండలంలోని ఉరుమడ్ల గ్రామానికి చెందిన బెల్లంకొండ బక్కయ్య ఇటీవల అనారోగ్యంతో మృతి చెందారు. విషయం తెలుసుకున్న రాష్ట్ర శాసనమండలి చైర్మన్ గుత్తా సుఖేందర్‌రెడ్డి తనయుడు గుత్తా అమిత్‌రెడ్డి భాదిత కుటుంబానికి గుత్తా వెంకటరెడ్డి మెమోరియల్ ట్రస్టు ఆధ్వర్యంలో సమకూర్చిన రూ. 10 వేల నగదును గ్రామ మాజీ ఎంపిటిసి పోలగోని స్వామి గురువారం మృతుని కుటుంబ సభ్యులకు ఆర్థిక సహాయంగా అందజేశారు. అందజేసిన వారిలో ట్రస్టు సభ్యులు ఉయ్యాల నరేష్, జనపాల శ్రీను, నడిపెల్లి గోపి, ఊడుగు పాండు, రూపని ఎల్లయ్య, మర్రి అశోక్, శ్రవణ్‌కుమార్, ఈదుల ప్రవీణ్‌కుమార్, రాచమల్ల వెంకన్న, అంతటి వెంకన్న తదితరులు పాల్గొన్నారు.

# 31న ప్రగతి భవన్ ముట్టడిని విజయవంతం చేయాలి

### పోలీస్ అభ్యర్థులకు న్యాయం చేయాలని యువజన కాంగ్రెస్ డిమాండ్

*దేవరకొండ, డిసెంబర్ 29, ప్రభాతవార్త:*

పోలీస్ ఎస్ఐ, కానిస్టేబుల్ నియామకాలకు సంబంధించి తెలంగాణ స్టేట్ లెవెల్ పోలీస్ రిక్రూట్‌మెంట్ బోర్డులో జరిగిన అవకతవకలను నిరసిస్తూ ఈ నెల 31న యువజన కాంగ్రెస్ తెలంగాణ రాష్ట్ర అధ్యక్షులు శివసేరెడ్డి ఆధ్వర్యంలో ప్రగతి భవన్ ముట్టడి కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని యువజన కాంగ్రెస్ దేవరకొండ నియోజకవర్గం అధ్యక్షులు కిన్నెర హరికృష్ణ, రాష్ట్ర కార్యదరినశ కొర్ర రామ్‌సింగ్ నాయక్, జరుపుల లక్ష్మి పిలుపునిచ్చారు. గురువారం దేవరకొండ పట్టణంలో ఏర్పాటు చేసిన సమావేశంలో వారు మాట్లాడారు. పోలీస్‌రిక్రూట్ మెంట్ బోర్డు, రాష్ట్ర ప్రభుత్వం అభ్యర్థులకు నూతన నిబంధనల పేరుతో ఉద్యోగాలు దూరం చేసే కుట్ర చేస్తున్నారని అన్నారు. దేశంలో ఎక్కడ లేని విదంగా



పురుషులకు 3.8 నుండి 4 మీటర్లు, మహిళలకు 2.2 నుండి 2.5 మీటర్లు లాంగ్ జంప్ పెంచారని, దీనివలన వేలాది మంది విద్యార్థులు నష్టపోతున్నారని తక్షణమే లాంగ్ జంప్‌ని తగ్గించి పాత పద్దతిని కొనసాగించాలని డిమాండ్ చేశారు. అదేవిధంగా పురుషులకు షాట్‌పుట్‌ని 5.6 నుండి 6 మీటర్లు మహిళలకు 3.75 నుండి 4 మీటర్లు పెంచారని దీనిని కూడా తక్షణమే తగ్గించాలని , అలాగే డిజిటల్ విదానాన్ని తీసివేసి పాత పద్దతిలో మాన్యువల్‌గా అభ్యర్థుల ఎతునత కొలతలను తీసుకోవాలని పేర్కొన్నారు. పోలీస్ బోర్డు ఇచ్చిన తప్పుడు ప్రశ్నల వల్ల మల్టిపుల్ ప్రశ్నల 7 మార్కులను అభ్యర్థులకు కలపాలని, హైకోర్టు తీర్పు ఇచ్చినా రాష్ట్ర ప్రభుత్వం అమలు చేయకపోవడం దారుణమన్నారు. ఇప్పటికే ప్రభుత్వ నిర్లక్ష్యం కారణంగా పరీక్షలకు హాజరైన అనేకమంది అభ్యర్థులు ఆత్మహత్యలు చేసుకుంటున్నారని ఆవేధన వ్యక్తం చేశారు. ఈ సమావేశంలో యువజన కాంగ్రెస నాయకులు ఉమెర్ ఖాసి, వంగూరి వెంకటేశ్వర్లు, రమ్మీ నాయకన, ముకు రాజు, సాయి రాథోడ్, దుబ్బ చరణ్, పొట్ట ప్రవీణ్, పవన్, సన్నీ, ప్రసాద, ఆనంద్, శివ, అజయ్, బాలు, కిషనన, మధు, రవి, సతీష్ తదితరులు పాల్గొన్నారు.

# పేదింటి ఆడబిడ్డలకు భరోసా కళ్యాణలక్ష్మీ

### ఎమ్మెల్యే రమావత్ రవీంద్రకుమార్



*దేవరకొండ, డిసెంబర్ 29, ప్రభాతవార్త:*

తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం పేదింటి ఆడబిడ్డల కుటుంబాలలో వెలుగులు నింపాలనే సంకల్పంతో కళ్యాణలక్ష్మి, షాదీ ముభారక్ పథకాలను ప్రవేశపెట్టి పకడ్బందీగా అమలు చేస్తుందని దేవరకొండ శాసనసభ్యులు రమావత్ రవీంద్ర కుమార్ అన్నారు. గురువారం దేవరకొండ పట్టణంలోని ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయంలో 64 మంది లబ్దిదారులకు 64 లక్షల 71 వేల రూపాయల విలువైన కళ్యాణలక్ష్మి చెక్కులను, చీరలను అందజేసి మాట్లాడారు. ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా ప్రవేశపెట్టిన కళ్యాణలక్ష్మి, షాదీ ముబారక్ పథకాలు పేదింటి ఆడబిడ్డలకు కొండంత బరోసా ఇస్తున్నాయని ఆయన పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో ఎంపీపీ వంగాల ప్రతాపరెడ్డి, వైస్ ఎంపీపీ నర్సింహారెడ్డి, బొడ్డుపల్లి కృష్ణ తదితరులు పాల్గొన్నారు.

# ప్రేమించిన వ్యక్తి మోసం చేశాడని

## బావిలో పడి యువతి ఆత్మహత్య

*చౌటుప్పల్, డిసెంబర్ 28 ప్రభాతవార్త*

ప్రేమించిన వ్యక్తి మోసం చేశాడని తీవ్ర మనస్థాపానికి గురైన యువతి బావిలో దూకి ఆత్మహత్య చేసుకున్న సంఘటన చోటు చేసుకుంది. కుటుంబ సభ్యులు తెలిపిన వివరాలు ఇలా ఉన్నాయి. చౌటుప్పల్ పట్టణంలోని చిన్నకొండూరు రోడ్డులో ప్రభుత్వ ఉన్నత పాఠశాల ముందు భాగంలో ఉన్న బుడిగ జంగాల కాలనీకి చెందిన ఇప్ప యాదయ్య-చంద్రమ్మల మూడో కుమార్తె ఇప్ప జ్యోతి(19) స్థానిక ఉన్నత పాఠశాలలో 10వ తరగతి చదువుకుంది. అనంతరం స్థానిక ఫంక్షన్ హాల్స్‌లో క్యాటరింగ్ విభాగంలో పనిచేస్తుంది. ఆ సమయంలో క్యాటరింగ్ నిర్వాహకుడు అయిన పోతగాని శివసాయిగౌడ్ గత ఏడాది నుంచి ప్రేమించున్నారు. పెళ్లికి నిరాకరించడంతో తీవ్ర మనస్థాపాకి గురై సోమవారం తెల్లవారు జామున ఇంట్లో నుంచి వెళ్లిపోయింది. ఈ విషయం తెలుసుకున్న కుటుంబ సభ్యులు శివసాయిగౌడ్ తీసుకెళ్లినట్లుగా అనుమానం వచ్చి పోలీసులకు అతడిపై ఫిర్యాదు చేశారు. బుధవారం కాలనీకి సమీపంలో ఉన్న ఓ వ్యవసాయ బావిలో అటుగా బహిర్భుమికి వెళ్లిన వారు బావిలో తేలియాడుతున్న మృతదేహాన్ని చూసి





పోలీసులకు, కాలనీ వాసులకు సమాచారం అందించారు. అటుగా వచ్చిన పోలీసులు మృతదేహంను కుటుంబ సభ్యులకు సమాచారం అందించడంతో తమ కుమార్తెగా వారు గుర్తించి బయటకి తీసి పోస్టుమార్టం నిమిత్తం స్థానిక ప్రభుత్వ ఆస్పత్రికి తరలించారు. తమకు న్యాయం చేయాలని పోలీసును వేడుకున్నారు. ఈ మేరకు పోలీసులు కేసు నమోదు చేసుకుని ధర్యాప్తు జరుపుతున్నారు.

# మండలి చైర్మన్ సుడిగాలి పర్యటన

*దామరచర్ల డిసెంబర్ 29 ప్రభాతవార్త*



దామరచర్ల మండలకేంద్రంలో శాసన మండలి చైర్మన్ గుత్తా సుఖేందర్‌రెడ్డి, మిర్యాలగూడ ఎమ్మెల్యే నలమోతుభా స్కర్‌రావుతో కలిసి సుడిగాలి పర్యటన నిర్వహించారు. తొలుత రావెల్ కార్ వాష్ సెంటర్‌ను ప్రారంభించి అనంతరం ఇటీవల మరణించిన కందుల వెంకటరెడ్డి కుటుంబ సభ్యులను పరామర్శించారు. ఈ కార్యక్రమంలో తెరాసనాయకులు చింతరెడ్డి శ్రీనివాసరెడ్డి, కందూరు వీరకోటిరెడ్డి, పడిగపాటి కోటిరెడ్డి, సోముసైదిరెడ్డి, ఆంగోతు హాతీరామ్, బాల సత ్యనారాయణ, బైరం గోపి, పరంగి సురేష్, రఫి తదితరులున్నారు.

# రైతుల సంక్షేమమే కేసిఆర్ ప్రభుత్వ లక్ష్యం : ఎమ్మెల్యే కూసుకుంట్ల

*చౌటుప్పల్, డిసెంబర్ 29 ప్రభాతవార్త*



రైతుల సంక్షేమానికి కేసిఆర్ నాయకత్వంలోని బిఆర్ఎస్ ప్రభుత్వం నిరంతరం పాటుపడుతుందని మునుగోడు ఎమ్మెల్యే కూసుకుంట్ల ప్రభాకర్‌రెడ్డి అన్నారు. చౌటుప్పల్ వ్యవసాయ మార్కెట్ యార్డులో రూ.41 లక్షలతో నిర్మించిన షాపింగ్ కాంప్లెక్స్‌ను ప్రారంభించారు. రూ.1.72 కోట్ల వ్యయంతో నిర్మించతలపెట్టిన ధాన్యం షెడ్ నిర్మాణ పనులకు శంఖుస్థాపన చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ దేశంలో ఏ రాష్ట్రంలో చేపట్టని విధంగా రైతులకు అనేక సంక్షేమ పథకాలను ప్రవేశపట్టె వంద శాతం అమలు చేస్తున్న ఘనత కేసిఆర్ సర్కార్‌దేనన్నారు. ప్రతి రైతు కేసిఆర్ అందిస్తున్న సంక్షేమ పథకాలను సద్వినియోగం చేసుకుని మరింత ఆర్థిక ప్రగతి సాధించాలన్నారు. ఈ కార్యక్రమంలో మున్సిపల్ చైర్మన్ వెన్‌రెడ్డి రాజు, మార్కెట్ చైర్మన్ బొడ్డు శ్రీనివాస్‌రెడ్డి, సింగిల్‌విండో చైర్మన్ చింతల దామోదర్‌రెడ్డి, మార్కెట్ పాలకవర్గం, మున్సిపల్ కౌన్సిలర్లు, టిఆర్ఎస్ నాయకులు, ప్రజా ప్రతినిధులు తదితరులున్నారు.

# కాశయ్య మృతి పట్ల ఎమ్మెల్యే రవికుమార్ సంతాపం

*కొండమల్లేపల్లి ,29డిసెంబర్,ప్రభాతవార్త:*

మండలంలోని చింతకుంట్ల గ్రామానికి చెందిన పంది కాశయ్య మృతి బాధాకరమని దేవరకొండ శాసన సభ్యులు , బిఆర్ఎస్ పార్టీ నల్లగొండ జిల్లా అధ్యక్షులు రమావత్ రవీంద్ర కుమార్ అన్నారు. గురువారం కాశయ్య పార్థీవ దేహానికి పూలమాల వేసి నివాళులు అర్పించిన అనంతరం ఆయన మాట్లాడుతూ కాశయ్య మృతి బిఆర్ఎస్ పార్టీకి తీరని లోటనిఅన్నారు. ఎమ్మెల్యే వెంట ఎంపిపి వంగల ప్రతాప్ రెడ్డి, రైతు బంధు అధ్యక్షులు కేసాని లింగారెడ్డి, మండల పార్టీ అధ్యక్షులు రమావత్ దస్రునాయక్, వల్లపురెడ్డి , సర్పంచులు, సర్పచుల ఫోరం అధ్యక్షుడు కుంభం శ్రీనివాస్‌గౌడ్, మాజి ఎంపిపి శ్రీనివాస్‌యాదవ్, రావుల వెంకటయ్య , సత్యనారాయణ, వస్కుల కృష్ణయ్య, పేరియాల వెంకటయ్య, వీరస్వామి తదితరులు పాల్గొన్నారు.



# అయ్యప్ప భక్తులకు నిత్య అన్నదానం

*చౌటుప్పల్, డిసెంబర్ 29 ప్రభాతవార్త*



శ్రీశ్రీశ్రీ సత్యదేవ సహిత అయ్యప్ప స్వామి దేవాలయంలో నిత్య అన్నదాన కార్యక్రమంలో భాగంగా చౌటుప్పల్ పట్టణానికి చెందిన కేసరి సత్యనారాయణరెడ్డి-రజనీ దంపతులు అయ్యప్ప భక్తులకు అన్నదానం చేశారు. ఆలయంలో ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఈ కార్యక్రమంలో ఆలయ చైర్మన్ బొబ్బిళ్ల మురళి గురుస్వామి, ప్రదాన కార్యదర్శి చింతల సాయిలు, తూర్పాటి శంకర్, కాంశెట్టి భాస్కర్‌గుప్తా, దేవరపల్లి గోవర్ధన్‌రెడ్డి, తాడూరి పరమేష్, కందుల వెంకటేశం, పందుల రాజేష్, పెద్దగోని రమేష్, ఉప్పు ఆంజనేయులు, సుక్క సుదర్శన్, బోరెం రాజశేఖర్‌రెడ్డి, మెండె మల్లేశం, ఉష్కాగుల నాగరాజు, ఆలయ అర్చకులు ఓకాంశశాస్త్రి తదితరులున్నారు.

# రికార్డులు పరిశీలించిన జెడ్‌పి డిప్యూటి సిఈవో

*కేతేపల్లి,29డిసెంబర్,ప్రభాతవార్త:*

వార్షిక పర్యవేక్షణలో భాగంగా జిల్లా ప్రజా పరిషత్ డిప్యూటి సిఈవో కాంతమ్మ గురువారం మండల పరిషత్ కార్యాలయంలో రికార్డులు పరిశీలించారు. అనంతరం ఎంపిడివో రమేష్ దీన్ దయాల్‌తో కలిసి కేతేపల్లి నర్సరీని పరిశీలించారు. ఈ సందర్భంగా సంబందిత అధికారులు డిప్యూటి సిఈవో వెంట ఉన్నారు.

# అభివృద్ధి, సుందరీకరణ పనులు వేగవంతం చేయాలి

**.. జిల్లా కలెక్టర్ టి. వినయ్ కృష్ణారెడ్డి**

*నల్లగొండప్రతినిధి,29డిసెంబర్, ప్రభాతవార్త:*




నల్లగొండ పట్టణంలో చేపట్టిన రహదారుల విస్తరణ, అభివృద్ధి, సుందరీకరణ పనులు వేగవంతం చేయాలని జిల్లా కలెక్టర్ టి. వినయ్ కృష్ణారెడ్డి సంబందిత అధికారులను, ఏజెన్సీల ఆదేశించారు. గురువారం కలెక్టర్ కార్యాలయ చాంబర్‌లో స్థానిక శాసన సభ్యులు కంచర్ల భూపాల్‌రెడ్డి కలిసి కలెక్టర్ పట్టణంలోని అభివృద్ధి పనులపై మున్సిపల్ ,ఇంజనీరింగ్, ఆర్ అంబి, ఇరిగేషన్, విద్యుత్‌శాఖ అధికారులు ,ఏజెన్సీలతో సమీక్షా సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా కలెక్టర్ వినయ్ కృష్ణారెడ్డి మాట్లాడుతూ పట్టణంలో చేపట్టిన రహదారుల విస్తరణ, అభివృద్ధి, సుందరీకరణ పనులు వేగవంతం చేయాలని,నిర్ణయించిన షెడ్యూల్ ప్రకారం నిర్ణీత కాలవ్యవధిలో పూర్తి చేయాలని అన్నారు.రహదారుల చేపట్టిన రహదారుల విస్తరణ, అభివృద్ధి, సుందరీకరణ పనులు అండర్ గ్రౌండ్ డ్రైనేజి పనులపై సమీక్షించారు. ముఖ్య మంత్రి ఆదేశాలను అనుసరించి అభివృద్ధి కార్యక్రమాలు చేట్టినట్లు , గత 6నెలలుగా పనులు జరుగుతున్నట్లు తెలిపారు.పనుల పురోగతిపై పది రోజులకు ఒక సారి సమీక్షించనున్నట్లు ఆయన తెలిపారు. సమస్యాత్మక ప్రాంతాలను గుర్తించి సంబందిత అధికారులు సమన్వయంతో పనులు వేగవంగా పూర్తి చేసేలాచర్యలు తీసుకోవాలని జిల్లా యంత్రాంగం తరుపున పూర్తి సహకారం ఉంటుందని అన్నారు. శాసన సభ్యులు కంచర్ల భూపాల్‌రెడ్డి మాట్లాడుతూ గత సంవత్సరం డిసెంబర్ 29న నల్లగొండకు వచ్చిన ముఖ్యమంత్రి కెసిఆర్ నల్లగొండ అభివృద్ధిపై సమీక్షించి ఆదేశాలు జారీ చేశారని, సిఎం పర్యటన తరువాత రాష్ట్ర పురపాలన పట్టణ అభివృద్ధి శాఖ మంత్రి కెటిఆర్ ఇతర మంత్రులతో కలిసి పట్టణంలో పర్యటన చేసి పలు సూచనలు చేశారని తెలిపారు. పట్టణంలో అభివృద్ధి , సుందరీకరణకు చేపట్టిన పనులలో మార్పు కనిపిస్తోందని, ఇందుకు ఏజెన్సీలు , అధికారులు కృషి చేస్తున్నారని అన్నారు.పనులను వేగవంతం చేసి నిర్ణీత కాల వ్యవధిలో నిర్ణయించిన విధందా పూఇరతన చేయాలని అన్నారు. తొలుత మున్సిపల్ కమీషనర్ పట్టణంలో చేపట్టిన పనులపై సమావేశంలో వివరించారు. ఈ సమావేశంలో మున్సిపల్ కమీషనర్ డా.కెవి రమణాచారి, పబ్లిక్ హెల్త్ ఎస్ ఈ కందుకూరి వెంకటేశ్వర్లు, ఈఈ సత్య నారాయణ, ఆర్అండ్‌బి ఈఈ నరేందర్‌రెడ్డి, మున్సిపల్ డీఈలు, ఏఈలు, ఏజెన్సీల ప్రతినిధులు పాల్గొన్నారు.

# మోడల్ స్కూల్ పనులను జనవరి 8వ తేది కల్లా పూర్తి చేయాలి

**-జిల్లా కలెక్టర్ పాటిల్ హేమంత్ కేశవ్**

*సూర్యాపేట, డిసెంబర్ 29, ప్రభాతవార్త:*



మన ఊరు మనబడి కార్యక్రమంలో భాగంగా 56 మోడల్ స్కూల్స్ సిద్ధం చేసే బాధ్యత హెచ్ఎంలదే అని కలెక్టర్ తెలిపారు. మన ఊరు మనబడి క్రింద చేపట్టిన పనులు త్వరగా పూర్తిచేసి జనవరి 8వ తారీకు కల్లా ప్రారంభానికి సిద్ధం చేయాలన్నారు. మన ఊరు మనబడి కార్యక్రమం క్రింద పాఠశాలలు మంజూరైన పనులు ఎందుకు పూర్తి చేయడం లేక పోతున్నామని కలెక్టర్ ప్రశ్నించారు. నిర్మాణ పనులలో అలసత్వం వహించరాదని ఈజీఎస్ క్రింద చేపట్టిన పనులు త్వరగా పూర్తి చేయాలి అన్నారు. మోడల్ స్కూల్ వారిగా పనులు పూర్తి చేసి ఆన్లైన్లో రికార్డు నమోదు చేయాలన్నారు. స్కూళ్ళలో ఉన్న పాత ఫర్నిచర్లను మోడల్ స్కూల్ నందు వినియోగించుకోవాలని కలెక్టర్ తెలిపారు. మండల స్పెషల్ ఆఫిసర్లు వారికి కేటాయించిన మోడల్ స్కూల్‌లను పరిశీలించి పెండింగ్ పనులను పూర్తి చేయాలని కలెక్టర్ అధికారులకు ఆదేశించారు. మండలాల వారిగా ఎంపీడీవో, మోడల్ స్కూల్ హెచ్ఎం, ఏఈలను పనుల వివరాలను అడిగి కలెక్టర్ తెలుసుకున్నారు. కొన్ని మండలాలలో ఈజీఎస్ వర్కులు ఇంకా స్టార్ట్ చేయకపోవడానికి గల కారణాలను హెచ్ఎంలను అడిగి తెలుసుకున్నారు. జిల్లాలోని 56 మోడల్ స్కూల్‌లను కొత్త సంవత్సరంలో ప్రారంభానికి సిద్ధం అని కలెక్టర్ తెలియజేశారు. ఈ కార్యక్రమంలో డిఇఓ అశోక్, పిఆర్ఈఈ శ్రీనివాస్ రెడ్డి, మండల ఎంఈఓలు, మోడల్ స్కూల్ హెచ్ఎంలు, మండల స్పెషల్ ఆఫీసర్లు సిబ్బంది పాల్గొన్నారు. జిల్లా సమాచార పౌర సంబంధాల శాఖ సూర్యాపేట జిల్లా వారిచే జారీ చేయనైనది.

# ప్రజా సంక్షేమమే ధ్యేయంగా సిఎం కెసిఆర్ పాలన

**...ప్రభుత్వ పథకాలకు ఆకర్షితులై బిఆర్ఎస్ పార్టీలోకి వలసలు**

**...... దేవరొండ ఎమ్మెల్యే రవీంద్ర కుమార్**

**.....పలు అభివృద్ధి పనులకు శంకుస్థాపన**



*చందంపేట,29డిసెంబర్, ప్రభాతవార్త:* ప ల ు

ప్రజా సంక్షేమమే ధ్యేయంగా తెలంగాణ సర్కార్ పాలన అందిస్తుందని బిఆర్ఎస్ పాఈర్ట నల్లగొండ జిల్లా అధ్యక్షులు,దేవరకొండ శాసన సభ్యులు రమావత్ రవీంద్రకుమార్ అన్నారు. గురువారం మండలంలోని పోలే పల్లి గ్రామానికి చెందిన పలువురు ఎమ్మెల్యే సమక్షంలో బిఆర్ఎస్ పార్టీలోఓ చేరారు. వారికి ఆయన పార్టీ కండువాలు కప్పి పార్టీలోకి ఆహ్వానించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ తెలంగాణ రాష్ట్రంలో అమలవుతున్న అభివృద్ధి , సంక్షే మానికి ఆకర్షితులై పార్టీలో చేరుతున్నారని అన్నారు. అభివృద్ధి , సంక్షేమ దేశమంతా అందించాలనే సంకల్పంతో సిఎం కెసిఆర్ ముందుకు సాగుతున్నారని అన్నారు. ప్రతి బిఆర్ఎఓస్ కార్యకర్తకు పార్టీ అండగా ఉంటుందని తెలిపారు.అనంతరం చందంపేట మండలంలోని తండాలు గ్రామాలలో నిర్వహించిన వివిద కార్యక్రమాలలో ఆయన పాల్గొన్నారు. మన ఊరు మన ప్రభుత్వం కార్యమ్రంలో భాగంగా చందంపేట మండలంలోని బిల్డింగ్ తండా, మనవత్ తండాలలో పలు అభివృద్ధి పనులకు ఆయన శంకుస్థాపన చేశారు. పాల్గొన్నారు. తండాలను గ్రామ పంచాయితీలుగా మార్చిన ఘనత కెసిఆర్‌ది అని , గిరిజనుల జీవితాలలో వెలుగులు నింపారని ఈ సందర్భంగా ఎమ్మెల్యే రవీంద్ర కుమార్ తెలి పారు. తమ తండాలను,గ్రామాలను తామే అభివృద్ధి చేసుకునే అవకాశం కల్పించిందని, గ్రామాల సర్వతోముఖాభివృద్ధికి ప్రభుత్వం కృషి చేస్తుందని ఆయన గుర్తు చేశారు. నియోజకవర్గాన్ని అన్ని రంగాలలో అభివృద్ధి చేస్తానని ఆయన అన్నారు. ప్రభుత్వం అందిస్తున్న పథకాలపై గ్రామస్తులకు అవగాహన కల్పించాలని ఆయన కార్యకర్తలను కోరారు. గరువారం నిర్వహించిన వివిద కార్య క్రమాలలో రైతు బంధు అధ్యక్షుడు బోయపల్లి శ్రీనివాస్ గౌడ్, నేరేడుగొమ్ము జెడ్‌పిటిసి కేతావత్ బాలు, మాజి ఎంపిపి ఏర్పుల గోవింద్ యాదవ్, జెడ్‌పిటి సలహాదారు రమావత్ మోహన్ కృష్ణ,వివిద గ్రామాల సర్పంచులు లోక్యనాయక్; నగిళ్ల జంగమ్మ, కేతావత్ శంకర్, నగిళ్ల మహేష్, శోబన్ నాయక్, బొద్దికూర మహలక్ష్మయ్య, దేవా రమేష్‌నాయక్, కుమార్, బొడ్డుపల్లి కృష్ణ, అర్జున్ గోవర్ధన్,ప్రజా ప్రతినిధులు, టిఆర్ఎస్ కార్యకర్తలు , తదితరులు పాల్గొన్నారు.

# ఆసుపత్రిని సందర్శించిన వైద్యుల బృందం

*నడిగూడెం, డిసెంబర్ 29 ప్రభాతవార్త*



స్థానిక సామాజిక ఆరోగ్య కేంద్రాన్ని సిద్దిపేట జిల్లా చేర్యాల వైద్య విధాన పరిషత్ ఆసుపత్రి డాక్టర్ల బృందం గురువారం సందర్శించింది. నడిగూడెం ఆసుపత్రిని కూడా వైద్య విధాన పరిషత్ కిందకు తీసుకురావడంతో ఇక్కడ అందజేస్తున్న వైద్య సేవలు తదితర అంశాలను వారు పరిశీలించారు. చేర్యాల డాక్టర్ స్రవంతి ఆధ్వర్యంలో బృందం సభ్యులు సందర్శించి పరిస్థితిని సమీక్షించారు. ఓపి ఎలా ఉంది, వైద్య విధాన పరిషత్‌లోకి వచ్చిన తరువాత ఆసుపత్రుల్లో సౌకర్యాల మెరుగు తదితర అంశాలను తెలుసుకున్నారు. ఈ కార్యక్రమంలో వైద్యాధికారులు విద్యాసాగర్, ఫణీశ్వర్, విష్ణు, రోహిత్, వైద్య సిబ్బంది పాల్గొన్నారు.

# సైబర్ నేరాలపై అవగాహన కార్యక్రమం

*భువనగిరి టౌన్, డిసెంబర్ 29 ప్రభాతవార్త :*



భువనగిరి మండలంలోని హన్మాపురం గ్రామ జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో రాచకొండ కమీషనరేట్ యాదాద్రి భువనగిరి జోన్ జాగృతి కళ బృంధం ఆద్వర్యంలో విద్యార్థులకు మహిళల రక్షణ, సైబర్ నేరాలపై అవ గాహన కల్పించారు. సమాజ రక్షణలో పోలీస్ శాఖ బాధ్యతను వివరిస్తూ ఎలాంటి అవసరం వచ్చినా 100కు డయల్ చేయాలని సూచించారు. పాఠశాలలో ఈవ్‌టీజింగ్ చేయరాదని అసభ్యంగా ప్రవిర్తంచరాదని ఎవరైనా అలాంటి చర్యలకు పాల్పడితే వారి పేర్లు తెలపాలని వారి వివరాలు గోప్యంగా ఉంచి, సంబంధిత వ్యక్తులపై కఠిన చర్యలు తీసుకుంటామని తెలిపారు. మహిళల రక్షణ కోసం ప్రత్యేక షీటీం ఉందన్నారు. ఎవరూ భయపడవలసిన అవసరంలేదని అన్నారు. ఈ కార్యక్రమంలో పాఠశాల ప్రధానోపాద్యాయులు సిహెచ్ రంగరాజన్, ఉపాద్యాయులు సంజీవరెడ్డి, ఉపాద్యాయ బృందం, విద్యార్థులు పాల్గొన్నారు.

# నేడు యాదాద్రికి రాష్ట్రపతి ద్రౌపతి ముర్మూరాక

*యాదగిరిగుట్ట, డిసెంబర్ 29, ప్రభాతవార్త:*



యాదాద్రి లక్ష్మి నరసింహ స్వామి వారి దర్శనార్ధం భారత రాష్ట్రపతి ద్రౌపతి ముర్ము శుక్రవారం రాను న్నారు. ఈ సందర్భంగా యాదాద్రి క్షేత్రంలో ఆలయ అధికారులు జిల్లా అధికారులు అన్ని ఏర్పాట్లు చేశారు. 30వ తేదీ శుక్రవారం ఉదయం 9:30 ని.లు ప్రత్యేక హెలికాప్టర్‌లో యాదగిరిగుట్టకు బయలుదేరి 9:40 ని.లకు చేరుకుంటారు. అక్కడినుండి రోడునడ మార్గాన 9:50 ని.లకు కొండపైకి కారులో విచ్చేస్తారు. 10:00 గం. వరకు స్వామివారి సేవలో గడిపి ప్రత్యేక పజలు చేస్తారు. అనంతరం 9:40 ని.లకు తిరిగి కారులో రోడ్డు మార్గాన ఎలిప్యాడ్ వద్దకు చేరుకొని అక్కడి నుండి తిరిగి హెలికాప్టర్‌లో హైదరాబాద్‌కు బయలుదేరుతారు.

# పిఎం మత్స్యసంపద యోజన

*నల్లగొండప్రతినిధి,29డిసెంబర్, ప్రభాతవార్త:*

మత్స్య సహకార సంఘం సభ్యులకు ప్రధాన మంత్రి మత్స్యసంపద యోజన ద్వారా గ్రూప్ ఇన్సూరెన్స్ సౌకర్యం కలదని మత్స్య శాఖ అధికారి ఒక ప్రకటనలో తెలిపారు.వ్యక్తి ప్రమాదవశాత్తు మరణం, అంగవైకల్యం సంభవించినప్పుడు సకాలంలో స్పందించి వారంలోగా జిల్లా మత్స్య శాఖ కార్యాలయాన్ని సప్రదించాలని ప్రకటనలో తెలిపారు.